సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER

Read / Share / Follow
www.leaderepaper.com
www.facebook.com
/leaderramanamurthy/

శుక్రవారం • 23 ఫిబ్రవరి 2018 । సంపుటి : 20 సంచిక : 207 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00
Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

కొనసాగుతున్న విద్యుత్ కార్మికుల నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గత మూడు రోజులుగా విద్యుత్ కార్మికులు నిరసన చేస్తున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక సభ్యులు. - ఫొటోగ్రాఫర్ / న్యూస్‌లీడర్

లూలూ కోసం..
బలవంతపు భూసేకరణ

భూమికి భూమిన్నర
కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ప్రైవేటుపరం

బీచ్‌రోడ్‌లో అత్యంత విలువైన 19.2 ఎకరాల ఏపీఐఐసీ భూమిని లూలూ ఇంటర్నేషనల్ షాపింగ్‌మాల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కట్టబెట్టిన ప్రభుత్వం మరో తప్పిదానికి పాల్పడింది. బీచ్ రోడ్డును ఆనుకుని వున్న సీఎంఆర్ గ్రూపునకు చెందిన విశ్వప్రియా పంక్షన్ హాల్ ప్రాంగణం 3.4 ఎకరాల భూమిని కూడా సేకరించి లూలూ చేతుల్లో పెట్టేయడానికి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రజాప్రయోజనాలను పక్కన పెట్టి ప్రైవేటు ప్రయోజనాల కోసం సీఎంఆర్ గ్రూపు స్థలాన్ని భూమికి భూమిన్నర పద్ధతిలో సేకరించి నగరంలో విలువైన భూముల్ని బదలాయించడానికి జీవో ఎం.ఎస్. నెం.5ను ప్రభుత్వం

ఫిబ్రవరి 16వ తేదీన విడుదల చేసింది. ఇంతవరకు ప్రభుత్వ అవసరాలకు, అత్యవసర రోడ్డు నిర్మాణానికో, వంతెన నిర్మాణానికి, ప్రజలకు అత్యవసరమయిన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ప్రైవేటు భూములను సేకరించడమే ఇంతవరకూ చూశాం. కానీ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరింత చొరవ, అత్యుత్సాహంతో ముందుకు వెళ్ళి లూలూ అనే ప్రైవేటు సంస్థకు దారాదత్తం చేయడం విమర్శలకు తావిస్తోంది.




GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
Energy, I&I Department - Development of International Convention Centre at Visakhapatnam - Allotment of total extent of land Ac.13.83 including additional land of Ac.1.31 belonging to APIIC and Ac.3.4 belonging to CMR Group to M/s LuLu International Shopping Mall Pvt. Ltd. - Orders - Issued.
ENERGY, INFRASTRUCTURE AND INVESTMENT (AIRPORTS) DEPARTMENT
G.O.Ms.No. 5 Dated: 16-02-2018
Read the following:
1) G.O.Ms.No.31, Energy, I&I(Dept.), dt.20.2.2017
2) G.O.Ms.No.116, Energy, I&I(Dept.), dt.25.7.2017
3) From the District Collector, Letter Rc.No.2876/2016/E2, Dt.6.12.2017.
ORDER
Government of Andhra Pradesh is developing an International Convention Centre at Visakhapatnam City with exhibition halls, meeting halls, parking places, 5-Star hotel, retail mall, etc. on a Public Private Partnership in a site of around Ac.9.12 Cts in Sy.No.1011/1A1 A2 of Waltair Ward. Infrastructure Corporation of Andhra Pradesh (INCAP) has invited tenders for selection of Developer. After the bid process, Government in the reference 2nd read above, have accorded approval for issue of Letter of Intent (LoI) by Andhra Pradesh Industrial Infrastructure Corporation (APIIC) [illegible]

న్యూస్‌లీడర్ / విశాఖపట్నం
రామకృష్ణామఠం సమీపంలోని అత్యంత విలువైన ఏపీఐఐసీకి చెందిన 19.2 ఎకరాల స్థలాన్ని లూలూ గ్రూపునకు ఇచ్చి మాల్స్, ఐదు నక్షత్రాల హొటల్, కాన్ఫరెన్స్ హాలు పీపీపీ పద్ధతిలో ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. అయితే నేర చరిత్ర వున్న లూలూ మిగతా 2లో ▶

వివాదంలో అజాతశత్రువు


సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

విశాఖలో అజాత శత్రువు ఎవరైనా వున్నారంటే ఆయన సీఎంఆర్ మావూరి వెంకటరమణ. గత ముప్పై ఏళ్ల నుంచి విశాఖతో ఆయనకు తీరని అనుబంధం ఏర్పడిపోయింది. జిల్లాలో ఏ మూల ఎవరు ఏ కార్యక్రమాన్ని చేపట్టినా, సీఎంఆర్ రమణ హస్తం వుండాల్సిందే. అది అన్నదానమైనా, సాంస్కృతిక కార్యక్రమమైనా లేదా గ్రామదేవత పండగైనా అక్కడ సీఎంఆర్ రమణ కనబడతారు. తన వద్దకు వచ్చిన వారెవరనీ కాదనకుండా ఎంతో కొంత సహాయం చేసే గుణం మావూరి వెంకటరమణ సొంతం. ప్రజాభిమానం పొందిన వెంకటరమణను రాజకీయాల్లో దింపాలని ఎంతోమంది ముఖ్యమంత్రులు స్వయంగా ప్రయత్నించారు. మనకెందుకండి రాజకీయాలు అంటూ సున్నితంగా రమణ తిరస్కరించి తన వ్యాపారం తాను చేసుకుంటూ వస్తున్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అప్పుడు రమణ రాజకీయ ప్రవేశంపై కథలు కథలు మొదలవుతాయి. నిన్నగాక మొన్న మేయర్ ఎన్నికలు జరగబోతున్నాయని అని అందరూ అనుకున్నప్పుడు కూడా మేయర్ పదవికి రమణ పేరు మారుమోగింది. విశాఖ ప్రజల్లో ఇంతటి మిగతా 2లో ▶

అడ్డగో(డ)లు నిర్మాణం

గుర్రంపాలెం ఐడీఎలో గెడ్డ దురాక్రమణ

- ఐలా మాజీ చైర్మన్ నిర్వాకం
- ప్లాన్ మార్చి, విస్తీర్ణం పెంచి
- చోద్యం చూస్తున్న ఐలా అధికారులు



న్యూస్‌లీడర్, గాజువాక :
రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఏర్పాటైన అధికార నోడల్ ఏజెన్సీ ఎపిఐఐసి ఇప్పుడు అక్రమాలకు నిలయంగా మారింది. ఐలా చట్టం ప్రకారం నియమితులైన కమిషనర్ అడ్డగోలుగా వ్యవహరించడంతో కొండగెడ్డలు సైతం కబ్జాకు గురవుతున్నాయి. వుడా లేదా ఐలా అమోదంతో మార్చాల్సిన ప్లానులు ప్లాటు మిగతా 3లో ▶

మూడేళ్లలో 8వేల మోసాలు

బ్యాంకులకు వణుకు పుట్టిస్తున్న టోకరా కేసులు

- మొదటి స్థానంలో ఎస్‌బీఐ
- తర్వాతి స్థానంలో బ్యాంక్ ఆఫ్ బరోడా



ఢిల్లీ: ప్రఖ్యాత వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ప్రభుత్వ రంగ బ్యాంకైన పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400కోట్ల భారీ మోసానికి పాల్పడి బ్యాంకింగ్ వ్యవస్థకే పెద్ద షాక్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గత మూడేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో జరిగిన మోసాలన్నీ చర్చకొచ్చాయి.వాటి సంఖ్యను చూస్తే విస్తుపోవాల్సిందే.బ్యాంకులు కోల్పోయిన వేల కోట్ల రూపాయల లెక్క తెలుసుకుంటే దిమ్మ తిరగాల్సిందే. భారత రిజర్వు బ్యాంకు వెల్లడించిన వివరాల ప్రకారం గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వ బ్యాంకుల్లో దాదాపు 8,622 మోసాలు జరిగాయి. ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ ప్రతాప్ శుక్లా నెలారంభంలో ఈ విషయాన్ని లోక్‌సభకు రాతపూర్వకంగా వెల్లడించారు. ఇప్పుడు భారీ మోసం జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంకులోనూ 2014-15, 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాల్లో 471 మోసం కేసులు మిగతా 3లో ▶

నీరవ్‌మోదీకి ఈడీ షాక్



ముంబై: పీన్‌బీ మెగా కుంభకోణంలో డైమండ్ వర్తకుడు నిరావ్ మోడీ, గీతాంజలి గ్రూప్ యజమాని మెహల్ చోక్సీ ఈడీ మరో గట్టి షాక్ ఇచ్చింది. మోదీ, అతని కంపెనీకి చెందిన విలువైన కార్లను సీజ్ చేసింది. అలాగే మిగతా 3లో ▶

ఆంధ్రాలో తెలంగాణ బస్సులు

నిద్రావస్థలో ఏపీఆర్టీసీ

- విజయవాడలో బస్టాండ్‌లోనూ మూగిపోతున్న టీఎస్ సర్వీసులు
- మెతక వైఖరిలో ఏపీ ఆర్టీసీ యాజమాన్యం
- ఇలాగయితే నష్టాల నుంచి గట్టెక్కేదెప్పుడూ..?

అమరావతి :
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పూర్తిస్థాయి సేవలను అందిం చలేక పోతున్నదా..? రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు తగిన బస్సులు అందుబాటు లోలేవా..? అందుకు తెలంగాణ రాష్ట్ర సర్వీసుల సహాయం కోరుతుందా..? అన్నట్లుగా ఉంది ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లోని మిగతా 3లో ▶



జగమేమాయ!



మన పార్టీ పేరు చెబితేనే గుర్రు మంటున్నారు.. రేపు ఓటేయండని అడిగితే ఏం చేస్తారో..!

సొమ్ము మీదే.. పెత్తనం బ్యాంకులది



- వేధిస్తున్న నగదు కొరత
- చాలా చోట్ల మూతపడ్డ ఏటీఎంలు
- లక్ష్యానికి మించిన రుణాలే కారణం
- మరో పక్క ఎఫ్ఆర్‌డీఐ ప్రభావం
- విలవిలలాడుతున్న ఖాతాదారులు

విశాఖ జిల్లాలో రోజూ రూ.800 కోట్ల మేరకు నగదును బ్యాంకుల నుంచి ఖాతాదారులు ఉపసంహరిస్తున్నారు. బ్యాంకుల్లో మాత్రం రోజుకు సుమారు రూ.400 కోట్లు జమ అవుతోందని భోగట్టా. తద్వారా ఖాతాదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఏటీఎంలలో నగదు అందుబాటులో లేక బ్యాంకులకు వెళ్తే అడిగినంత ఇవ్వక జనం చాలా ఇబ్బందులు పడుతున్నారు.

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : మీది ఏ బ్యాంకు ఖాతా అయినా కావచ్చు... అందులో దాచుకున్న డబ్బు మీదే కావచ్చు... కానీ ఆ డబ్బుపై ప్రస్తుతం పెత్తనం మాత్రం బ్యాంకులదే. ఎందు కంటారా ! అదంతే. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు అలాంటి చర్యలకు తెర తీశాయి. మీ ఖాతాలో పదివేల రూపాయలు ఉన్నా యనుకోండి. అయిదు వేల రూపాయల మిగతా 3లో ▶

సంచలన వార్తాపత్రిక
లీడర్ క్లాసిఫైడ్స్

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు. - మేనేజ్‌మెంట్

విశాఖపట్నం | శుక్రవారం 23-2-2018

లూలూ కోసం బలవంతపు భూసేకరణ

(మొదటి పేజీ తరువాయి)

గ్రూపు ఈ స్థలానికి అనుకుని బీచ్ ముఖంగా వున్న సీఎంఆర్ గ్రూపు స్థలం 3.4 ఎకరాలను కూడా కోరింది. దీనికి ముఖ్యమంత్రి 'సై' అంటూ సీఎంఆర్ గ్రూపుతో మంతనాలు జరపడానికి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కూడా సారధ్యంలో కమిటీని నియమించారు. ఈ కమిటీ సీఎంఆర్ గ్రూపుతో సంప్రదింపులు జరిపి సీఎంఆర్ పోగొట్టుకుంటున్న 3.4 ఎకరాలకు గాను నగరంలో అత్యంత ఖరీదైన 4.85 ఎకరాల భూమిని బదలా ఇవ్వడానికి ఒప్పించారు. అంటే ఒక ఎకరానికి ఒకటిన్నర ఎకరం చొప్పున బదలాంపు చేయడానికి కలెక్టర్ కమిటీ అంగీకరించి ప్రభుత్వానికి నివేదించింది. ఇంతవరకూ భూమికి భూమిన్నర ఇవ్వడమనే పద్ధతి లేదు. చట్టం అంతకన్నాలేదు. ప్రజా ప్రయోజనాలు లేకుండా ఒక ప్రైవేటు సంస్థకి ఇవ్వడం కోసం మరో ప్రైవేటు సంస్థకు అంత పెద్ద ఎత్తున రాయితీలు ఇవ్వడం వెనుక మర్మం ఏమిటో తెలియాల్సి ఉంది. సీఎంఆర్ గ్రూపు బీచ్‌రోడ్‌లో లూలూకోసం పోగొట్టుకుంటున్న భూమికి గాను సిరిపురంలో హెచ్.ఎస్.బి.సి పక్కన వున్న వుడా స్థలం 1.36 ఎకరాలతో (6582 గజాలు) పాటు నగరంలో అత్యంత ఖరీదైన ఆరు చోట్ల అత్యంత ఖరీదైన స్థలాలను ప్రభుత్వం ఇవ్వడానికి అంగీకరిస్తూ ఆఘమేఘాల మీద జీవోని విడుదల చేసింది. చినవాల్తేరులో 4404 గజాలు, కిర్లంపూడి లే అవుట్‌లో 1597 గజాలు, ఎంవీపీ డబుల్ రోడ్ (రైతు బజారు వద్ద) 7212 గజాలు, రేసవానిపాలెం (సీతమ్మధార రెవెన్యూ క్వార్టర్స్ స్థలం) 3146 గజాలు చినవాల్తేరు లాసెన్స్ బే కాలనీలో 532 గజాలు, మొత్తం కలిసి 23473 గజాలు సీఎంఆర్‌కు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. దీంతో విశాఖ మహా నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాలు ప్రైవేటు చేతుల్లోకి పోయినట్టే.

సీఎంఆర్ విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వున్న స్థలాన్ని ప్రభుత్వం గజం 50వేల రూపాయలుగా లెక్క గట్టింది. అంతేకాకుండా ఫంక్షన్ హాల్ ద్వారా ప్రస్తుతం సంవత్సరానికి రెండు కోట్ల రూపాయల ఆదాయం వస్తుండగా రానున్న నాలుగు సంవత్సరాల్లో 8 కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతున్నట్లు ప్రభుత్వం లెక్కగట్టింది. అంతేకాకుండా ప్రభుత్వం ఇస్తున్న 4.85 ఎకరాల భూమి కన్నా బీచ్‌రోడ్‌ను అనుకుని వున్న సీఎంఆర్ భూమి లోకేషన్ పరంగా గొప్పదని ప్రభుత్వం భావిస్తూ, ఇందు వల్లే ప్రభుత్వం 485 ఎకరాల భూమిని ఇస్తున్నట్టు జీవోలో .. చెప్పుకుంది. అంతేకాకుండా సీఎంఆర్‌కి ఇస్తున్న భూమికి 150 అడుగుల రోడ్డు వున్నట్టుగా భావించి 25శాతం సెట్‌బ్యాక్ మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతే కాకుండా సీఎంఆర్‌కు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో వారికి కావాల్సిన నిర్మాణాలు, చేసుకునే విధంగా వుడా మాస్టర్‌ప్లాన్‌ను సవరించడానికి ప్రభుత్వం అంగీకరించింది. వీటన్నిటికీ మించి ఈ భూముల బదలాయింపునకు సంబంధించిన స్టాంపు డ్యూటీకి పూర్తిగా మినహాయింపు ఇచ్చేసింది. ఈ భూములు తప్పనసరి భూ సేకరణ కింద సేకరించినందు వల్ల ఆదాయిపన్నుగాని, క్యాపిటల్ గెయిన్స్ గాని, వర్తించడానికి అవకాశం లేదు. అయినప్పటికీ ఒకవేళ వర్తిస్తే ఈ మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని జీవో వెల్లడించింది. ఒక ప్రైవేటు సంస్థకి ప్రభుత్వం చతికలపడి ఇన్ని రాయితీలు ఇచ్చి విశాఖలోని అత్యంత ఖరీదైన భూములన్నిటినీ బదలాంపు చేయడంపై అన్ని రాజకీయ పక్షాలూ ఆక్షేపిస్తున్నాయి.

ఇందులో ముఖ్యమంత్రికి 'క్విట్ ప్రోకో' వుండడం వల్ల విశాఖ ప్రజల ఆస్తుల్ని ప్రైవేటు సంస్థల చేతుల్లో పెడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా విశాఖ హెరిటేజ్‌కు ప్రతీకగా నిలిచిన వందేళ్ల నాటి కట్టడం సీఎంఆర్ విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో వుంది. దీన్ని లాలూ గ్రూపు నేలమట్టం చేయడం అత్యంత దారుణమని చరిత్రకారులు అంటున్నారు. నేర చరిత్ర వున్న లూలూ గ్రూపునకు పీపీపీ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యుత్సాహం చూపించి ఇవ్వడంపై విచారణ జరిపించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐఏఎస్ శర్మ ఇప్పటికే సంబంధిత ఏజెన్సీలకు లేఖ రాశారు. ఒక పక్క విశాఖ ప్రజల పోరాటం, మరో పక్క కోర్టులను ఆశ్రయించడానికి సిద్ధంగా వున్న ప్రజాసంఘాలు, ఆందోళన చేపట్టనున్న రాజకీయ పక్షాల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తననిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటుందా? లేదా ప్రజాభిప్రాయాన్ని ఖాతరు చేయకుండా ముందుకు వెళ్తుందా చూడాల్సిందే.

వివాదపు ఊబిలో అజాతశత్రువు

(మొదటి పేజీ తరువాయి)

ఖ్యాతిని ఆర్జించి అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్న మావూరి వెంకటరమణను ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పదంలోకి లాక్కొచ్చింది. హాయిగా తన విశ్వప్రియఫంక్షన్ హాల్‌ను తను లాభనష్టాలతో సంబంధం లేకుండా నడుపుకుంటుంటే లూలూ కోసం సీఎంఆర్ గ్రూపును ఊబిలోకి దింపేసింది. అత్యంత విలువైన, తన ప్రాణ సమానమైన విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ప్రాంగణాన్ని పోగొట్టుకోకుండా వుండడానికి రమణ తీవ్రంగా ప్రయత్నించారు. లూలూ ముందు చతికిల పడిన ప్రభుత్వం మాత్రం సీఎంఆర్ భూమిని ఎలాగైనా లాక్కోవాలని ఒత్తిడిపెంచింది. చివరకు ఇలా చేస్తేనే గాని తన సీఎంఆర్ విశ్వప్రియ ప్రాంగణాన్ని వదులుకుంటానని చెప్పడం దానికి ప్రభుత్వం 'సై' అంటూ అంగీకరించింది.

ఎలాగూ విశ్వప్రియను ఒదులుకోవలసి రావడంతో ప్రభుత్వం అంగీకరించని డిమాండ్లను సంప్రదింపుల సంఘం ముందు పెట్టినట్టు తెలిసింది. అయినా ప్రభుత్వం అడిగిన వన్నీ ఇచ్చేస్తూ నిర్ణయం తీసుకోవడం ప్రజల విమర్శలకు కారణమైంది.

రోడ్డు పనులకు శంకుస్థాపన



టెక్కలి, లీడర్‌న్యూస్ : శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం స్థానిక అయ్యప్పనగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మంత్రి అచ్చంనాయుడు చొరవతో రూ. 60లక్షల(ఎన్.ఆర్.జి.ఎస్) నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు గురువారం టెక్కలి ప్రెసిడెంట్ బెహరా కృష్ణవేణి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మామిడి రాము, దుక్క రమేష్ రెడ్డి, వార్డు మెం బర్ ధోని కొండలరావు, కాంట్రాక్టర్ జీరు వెంకటరెడ్డి, పేర.మురళీధర్, కమిటీ అధ్యక్షుడు దానవేంద్రరావు, టీడీపీ నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

95వ రోజు ముగిసిన జగన్ పాదయాత్ర



ప్రకాశం: వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి 95వ రోజు పాదయాత్రను ముగించుకుని హైదరాబాద్‌కు బయలుదేరారు. గురువారం ఉదయం పీసీపల్లి మండలం అలవలపాడు నుంచి జగన్ పాదయాత్ర ప్రారంభమైంది. రామాపురం, గుడెవారిపాలె మీదుగా సాగిన పాదయాత్ర హాజీజ్‌పురం వద్ద ముగిసింది. అక్కడి నుంచి రేపు సీబీఐ కోర్టుకు హాజరయ్యేందుకు జగన్ హైదరాబాద్‌కు బయలుదేరారు. ఇప్పటి వరకు జగన్ 1275.9 కిలో మీటర్లు నడిచారు.

జీఎస్టీ ట్రైలర్ ని తొలగించిన యూట్యూబ్!

ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రూపొందించిన గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ (జీఎస్టీ) వెబ్ సిరీస్ కు సంబంధించిన ట్రైలర్ ను యూట్యూబ్ నుంచి తొలగించింది. గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ స్క్రిప్ట్ తనదేనంటూ ఆరోపణలు చేసిన రచయిత జైకుమార్ ఈ మేరకు యూట్యూబ్ కు గత నెలలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో ఆ ట్రైలర్ ని యూట్యూబ్ నుంచి తొలగించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, ఐద్వా మహిళ మణి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వర్మను అరెస్టు చేయాలంటూ విశాఖపట్టణంలో మహిళా సంఘాలు తమ నిరసన కొనసాగిస్తున్నారు.

26న రేణుకా ఎల్లమ్మ అమ్మ వారి జాతర

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : అచ్చియ్యమ్మపేట, కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుకా ఎల్లమ్మ అమ్మవారి 18వ వార్షికోత్సవ జాతర ఉత్సవాలు ఈనెల 26 నుంచి ప్రారంభించనున్నట్టు ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సోమవారం ప్రధాన పండుగ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆజాద్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

వైసీపీ నాయకులు వంశీకృష్ణ యాదవ్

డాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: భారత స్వాతంత్ర సైనికుడు, మహా రచయిత, భారత రత్న అబ్దుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడాల్లో యువత ముందుకు సాగాలని వైసీపీ తూర్పు నియోజకవర్గం నాయకులు వంశీకృష్ణ యాదవ్ అన్నారు. మద్దిలపాలెం వైసీపీ పార్టీ కార్యాలయంలో ఆజాద్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువత కోసం అహర్నిశలు పాటు పడిన మహా మనిషి అబ్దుల్ కలాం ఆజాద్ కొనియాడారు. దేశ భవిష్యత్తు యువతపై వుందని నమ్మిన ఘనుడని అన్నారు. ఆజాద్ జీవిత ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి భారతీయులందురూ సమైక్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ అల్ హిల్ అనే ఉర్దూ పేపరును స్థాపించి బ్రిటిషూవారి ఘోర ప్రభుత్వ చేష్టలను ప్రజల దృష్టికి తీసుకువెళ్ళారన్నారు. తెల్లవారికి వ్యతిరేకంగా పోరాడి ఆయన పేపరును కూడా నిషేదించారన్నారు. భారత స్వాతంత్రం సంగ్రామ పోరాటంలో విరామమెరుగని సైనికుడిగా పోరాటం చేసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి ఫరూఖ్, సెక్రటరీ అలీ, వైసీపీ నాయకులు శివరామకృష్ణ, పీతాల మూర్తి యాదవ్, మొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వంశీకృష్ణ యాదవ్

ఎన్ఎస్ఎన్ రెడ్డికి ఘన నివాళి

డాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిలు కృషి చేసిన ప్రజా నాయకులు, మాజీ శాసన సభ్యుడు, విశాఖ నగర ప్రథమ మేయర్‌ను ఎన్ఎస్ఎన్ రెడ్డి అడుగుజాడల్లో నడావాలని వక్తలు కోరారు. ఎన్ఎస్ఎన్ రెడ్డి 88వ జయంతి పురష్కరించుకుని జీవీఎంఎంసీ ఎదురుగా గాంధీ పార్కులో వున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి వివిధ పార్టీ నాయకులు, అభిమానులు ఘన నివాళలు అర్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ వారి సేవలును స్మరించుకున్నారు. అటువంటి గొప్ప నాయకులును ఆదర్శంగా తీసుకుని అంకితభావంతో నేటి నేతలు పనిచేయాలని ఆకాంక్షించారు. ఆయన లాంటి మహనీయులను స్మరించుకోవడం పూర్వజన్మ సుకృతమని వక్తలు కొనియాడారు. విశాఖ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎన్ రెడ్డి కుమారులు విజయానందరెడ్డి, వివేకానందరెడ్డి పాటు బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు పీవీ నారాయణ, లీడర్ పత్రిక ఎడిటర్ వి.వి.రమణ మూర్తి, వైసీపీ నాయకులు సత్తిరామకృష్ణ రెడ్డి, తిప్పలగురుమూర్తి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


జీవీఎంసీ గాంధీ పార్కులో గల ఎన్ఎస్ఎన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

3వ రోజు కొనసాగిన ధర్నా
విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యవేదిక నాయకులు


సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న నర్సింగరావు

డాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులుకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యవేదిక నాయకులు ఆర్వేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. ఐక్యవేదిక అధ్వర్యంలో నగరంలో జీవిఎంసీ గాంధీ విగ్రహం దరిలో విద్యుత్ కార్మికులు చేపట్టిన నిరసన గురువారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులందరికీ క్రమబద్ధీకరించడం లేదా విలీనం చేయాలన్నారు. ఉద్యోగ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందని వెల్లడించారు. ప్రతి నెల 1వ తేదీన బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులుకు పీస్‌రేట్ విధానాన్ని రద్దు చేయాలని, థర్డ్ పార్టీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దీక్షకు మద్దతుగా వైసీపీ నాయకులు సత్తిరామకృష్ణ రెడ్డి, తిప్పల నాగిరెడ్డి, గరికిన గౌరీ, రవిరెడ్డి, సిఐటీయూ నాయకులు , ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పడాల రమణ,జిల్లా కార్యదర్శి ఎం మన్మథరావు, బి. వెంకట్రావ్, రమణ మూర్తి, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు పరుశురాం, కేదారిశ్వరీ, శారధ, అచ్చెం నాయుడు,జగదీష్, చంద్రశేఖర్,వాసు తదితరులు పాల్గొన్నారు.

రాంగోపాల్ వర్మపై రగడ

- 354ఏ, ఐటీ 67కేసులతో పాటు నిర్భయచట్టం పెట్టాలి
- మహిళ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్


దీక్షలో మాట్లాడుతున్న సీపీఐ నేత పైడిరాజు

డాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: మహిళలు ఆత్మగౌరవాన్ని కించపరిచిన రాంగోపాల్ వర్మను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మహిళ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జీవిఎంసీ గాంధీ విగ్రహం దరి చేపట్టిన 48 గంటల నిరహారదీక్ష గురువారం కొనసాగింది. ఈ ధర్నాకు ప్రజా సంఘాలు, సీఐటీయూ నాయకులు, రాజకీయపార్టీ నేతలు, అధిక సంఖ్యలో మహిళలు మద్దతు పలికారు. ఈ మేరకు మహిళా నేతలు మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి మచ్చ తెచ్చేలా ప్రవర్తించి, మహిళను అగౌరవ పరిచిన దర్శకుడు రాంగోపాల్‌పై చర్యలు తీసుకోవడానికి ఏపీ ప్రభుత్వం వెనకడుగు వేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఒక టీవీ ఛానల్‌లో రాంగోపాల్ వర్మ తీసిన పోర్న్ సినిమాపై జరిగిన ఇంటర్వ్యూలో మహిళ నాయకురాలైన మణిపై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూ మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగేలా మాట్లాడిన వర్మపై కఠిన చర్యలు తీసుకునే వరకు దశలవారీగా పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం అవుతుందని హెచ్చరించారు. పోలీసులు తప్పించుకునే దోరణిలో నామమాత్రపు సెక్షన్‌లు పెట్టి మభ్యపెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. రాంగోపాల్ వర్మపై 354 ఏ, ఐటీ 67 కేసులుతో పాటు నిర్భయకేసు కూడా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై ఏ స్థాయి వ్యక్తులైన మహిళలను కించపరిస్తే రాంగోపాల్ వర్మకు పట్టిన గతే పడుతుందని తెలియజేస్తామన్నారు. ఇప్పటివరకు ఆయన అభ్యంతరకరంగా మాట్లాడిన మాటలు, సోషల్ మీడియా రెచ్చిపోతున్న అశ్లీల వ్యాఖ్యలపై త్రీ టౌన్ పోలిసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఒక మహిళ నాయకురాలిపై ఆమె స్వాభిమానం దెబ్బతినేలా వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడమేమిటని ప్రశ్నించారు. మహిళలు ఇన్‌డీసెంట్‌గా ఉండటమే నాగరికత అని, మహిళలకు లైగింక స్వేచ్ఛ కావాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న ప్రభుద్ధుడిని తక్షణమే ప్రభుత్వం అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ మహిళల్ని లైంగిక వస్తువుగా చూసే దృష్టి వలన మహిళలపై హింస మరింత పెరుగుతుందన్నారు. తనను ప్రశ్నించిన మహిళ నాయకురాలిపై రాంగోపాల్ వర్మ నోటికొచ్చిన విధంగా కామెంట్స్ చేశారన్నారు. దీనిపై మహిళ సంఘాలు పెద్ద ఎత్తున్న నిరసన తెలియజేయగా తెలంగాణ ప్రభుత్వం స్పందించి రాంగోపాల్ వర్మ పాస్‌పోర్టును సీజ్ చేసి, చర్యలు తీసుకుంటోందన్నారు. కానీ ఏపీ ప్రభుత్వం సంబంధం లేనట్టు తప్పించుకోవడం దుర్మార్గమన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని అగౌరవ పరుస్తూ మాట్లాడిన రాంగోపాల్ వర్మపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన అనుచరులు సైతం నిత్యం సోషల్ మీడియాలో అశ్లీలతతో చెలరేగిపోతున్నారన్నారి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ లక్ష్మీ, ఐద్వా ఆర్ఎన్. మాధవి, విమల, దాక్షయిని, పి. మణి, పరమేశ్వరీ, వెంకటి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆంధ్రలో తెలంగాణ బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి. ఇక్కడ ఉంటూ కూడా ఏ రాష్ట్ర బస్సుల్లో తిరుగుతున్నామో తెలి యని అయోమయస్థితిలో ప్రయాణికులు ఉన్నారు. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు ఆంధ్రా రాజధాని ప్రాంతాలైన విజయవాడ, గుంటూరుకు ఇరు రాష్ట్రాల బస్సు సర్వీసులు తిరుగుతున్నాయి. అంతవరకు బాగానే ఉంది. అయితే ఎక్కడో విజయవాడకు 200 కి.మీ. దూరంలో ఉన్న ఒంగోలులోనూ, అక్కడ నుంచి మరో 250 కి.మీ.దూరంలో ఉన్న తిరుపతి నుంచి కూడా తెలంగాణ బస్సులు తిరుగుతున్నాయి. బోధన్ వెళ్లాల్సిన సర్వీసులకు బోధన్ పేరుకు పేపరు అడ్డుపెట్టి గుంటూరు పేరు మాత్రమే కనిపించే విధంగా ఒంగోలు నుంచి గుంటూరుకు సూపర్ లగ్జరీ సర్వీసులు నడుస్తున్నాయి. ఇది తెలియని ప్రయాణికులు కూడా తాము ఏపీఆర్టీసీ బస్సులోనూ తిరుగుతున్నామన్నట్టుగా ప్రయాణిస్తున్నారు. జిల్లాలలో నష్టాలు వస్తున్న ప్రజల సౌకర్యార్థం తిరిగే పల్లెవెలుగు బస్సులు ఆంధ్రా ఆర్టీసీ నిర్వ హిస్తుంటే అధిక ధరలు చెల్లించే లగ్జరీ బస్సుల ఆదాయాన్ని తెలంగాణ సర్వీ సులు తన్నుకుపోతున్నాయి. విజయవాడలో బస్టాండ్‌లో కూడా ఇటీవల టీఎస్ సర్వీసులు 50 వరకూ ప్లాట్‌ఫామ్‌లలో మూగిపోతే ఆంధ్రా సర్వీసులు వెనకాల నిలపాల్సి వచ్చింది. ఇదెక్కడి అన్యాయమని సమస్యను ఆర్టీసీ ఎండి దృష్టికి ఆర్టీసీ ఉద్యోగులు తీసుకువెళ్లారు. అయితే ఈ అంశంపై ఎటువంటి చర్య తీసుకోలేదు. అయితే విజయవాడ, గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న సర్వీసులను కోదాడ, సూర్యపేట వంటి తెలంగాణ బస్టాండ్‌లలో ఐదు నిమిషాలు కూడా నిలపకుండా పంపించేస్తున్నారని డ్రైవర్లు చెబుతున్నారు. తెలంగాణ వైపు వెళ్లే ఏపీఆర్టీసీ బస్సులను ప్లాట్‌ఫామ్ ఖాళీగా ఉన్న నిలవనీయడం లేదంటున్నారు. నష్టాలో ఉన్న ఆర్టీసీ ఇకనైనా లగ్జరీ సర్వీసులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు కోరుతున్నారు.

మూడేళ్లలో 8వేల మోసాలు

(మొదటి పేజీ తరువాయి)

నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో పీఎన్‌బీలో 180 కేసులు నమోదు కాగా, తర్వాతి ఆర్థిక సంవత్సరం 2015-16లో 131, ఆ తర్వాత 2016-17 మధ్య 160 కేసులు నమోదయ్యాయని శుక్లా ఓ ప్రశ్నకు సమాధానంగా లోక్‌సభకు వెల్లడించారు. దేశంలోని 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అతి పెద్దదైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మోసాల సంఖ్య అధికంగా ఉంది. ఎస్‌బీఐలో 2014-15 ఆర్థిక సంవత్సరంలో 893కేసులు నమోదయ్యాయి. తర్వాతి ఆర్థిక సంవత్సరంలో 770 కేసులు, ఆ తర్వాత 803కేసులు నమోదయ్యాయి. తర్వాతి స్థానంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఉంది. ఇందులో 2014-15 ఆర్థిక సంవత్సరంలో 303 కేసులు, తర్వాత సంవత్సరాల్లో వరుసగా 255, 224 కేసులు నమోదయ్యాయి.

శుక్లా వెల్లడించిన వివరాల ప్రకారం..

బ్యాంకుల్లో జరిగిన మోసాలకు సంబంధించి 2015 సంవత్సరంలో సదరు మోసాలతో సంబంధం ఉన్న 2,748 బ్యాంకు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. 2016లో 1,994 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకోగా, 2017 జనవరి నుంచి మార్చి వరకు 458 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో మోసాలను పరిశీలిస్తే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే తక్కువ సంఖ్యలో ఉండడం గమనార్హం. 2014 నుంచి 2017 వరకు మూడు ఆర్థిక సంవత్సరాల్లో ప్రైవేటు రంగ బ్యాంకుల్లో 4,156కేసులు నమోదయ్యాయి. మోసాలతో సంబంధం ఉన్న 568 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు.

సొమ్ము మీదే.. పెత్తనం బ్యాంకులది

(మొదటి పేజీ తరువాయి)

ఉపసంహరణ కోసం బ్యాంకుకు వెళ్తే ఇవ్వరు..రెండు వేలే ఇస్తారు..అదేమని అడిగితే "నగదు కొరత" అని సమాధాన మిస్తున్నారు. అన్ని బ్యాంకుల్లోను ఇప్పుడు ఇదే పరిస్థితి. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టుగా ప్రధాని నరేంద్ర మోదీ నోట్ల రద్దు తర్వాత బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఉంచిన నేపథ్యంలో చాలా మంది తమ ఆర్జితాన్ని నేరుగా బ్యాంకుల్లో జమ చేసేందుకు ముందుకు రావడం లేదు. దాంతో బ్యాంకుల్లో డిపాజిట్ల శాతం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో లావాదేవీలు నిర్వహించేందుకు బ్యాంకుల్లో నగదు కొరత తీవ్ర ప్రతిబంధకంగా మారింది. ఖాతాదారులకు తీరని కలతను మిగులుస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు తమ వేతనాలను బ్యాంకుల నుంచి ఉపసంహరించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు.

ఏటీఎంలు వెలవెల..

విశాఖ జిల్లాలో దాదాపు వివిధ రకాల 50 బ్యాంకులుండగా.. వీటి పరిధిలో 1200 వరకు ఏటీఎంలు ఉన్నాయి. ఎక్కువగా ఎస్‌బీఐ, ఆంధ్రా బ్యాంక్ ఏటీఎంలున్నాయి. వీటిలో మూడొంతుల ఏటీఎంలు నగదు కొరతతో వెలవెలబోతున్నాయి. గత కొద్ది రోజులుగా ఏటీఎంల చుట్టూ తిరుగుతున్న ఖాతాదారులు నగదు లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. జాతీయ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకుల ప్రాంగణాల్లో ఉన్న ఏటీఎంలలో మాత్రం నిత్యం తక్కువ మొత్తంలో నగదు పెడుతున్నారు. గంటల వ్యవధిలోనే నగదు ఖాళీ అవుతుండడంతో బ్యాంకర్లు సైతం దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఏటీఎంలు ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. నగరంలోని కొన్ని ప్రాంతాల్లోనూ పలు ఏటీఎంలను మూసివేశారు.ఇలా రకరకాల సమస్యలతో ఏటిఎంలు ప్రజల సహనాన్ని పరీక్షిస్తూ ఉసురు పోసుకుంటున్నాయి. నగరంలో చాలా ఏటిఎంలు చెత్త, చెదారంతో నిండిపోయి బూజు పట్టి డస్ట్‌బిన్‌లను తలపిస్తున్నాయి. కాలంలో ముందుకు సాగే కొద్దీ, టెక్నాలజీ అభివృద్ధి చెంది, ప్రజలకు నాణ్యమైన సేవలందించడానికి బదులు ఏటిఎమ్‌ల తీరు నానాటికీ దిగజారిపోతోంది.

డిజిటల్ మనీ ఇదేనా...

ఏటిఎంలు డిజిటల్ మనీల గొప్పలు ప్రకటనలకే పరిమితమయ్యాయి కాని కార్యరూపం దాల్చడంలో దాదాపు విఫలమయ్యాయి. సామాన్యుడి బాధను అర్థం చేసుకోకుండా పాలకులు ఇలాంటి రూల్స్ పెట్టడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. నేతలు కోరుకుంటే డబ్బులు వాటంతటవే వచ్చి పడతాయి. కాని సామాన్యుడి విషయంలో అలా జరగదు. తన డబ్బు కోసం కూడా ఎన్నో తిప్పలు పడాల్సి వస్తోంది. బదా నేతలంతా ఒక్కసారి ఏటిఎంల దగ్గరకి వచ్చి నగదు తీసుకోవడానికి ప్రయత్నిస్తే సామాన్యుడి కష్టం తెలిసొస్తుందని జనం అభిప్రాయపడుతున్నారు. ఏసి గదుల్లో కూర్చొని చట్టాలు చేయడం కాదని, వాటివల్ల సామాన్యుడికి ఎటువంటి ఇబ్బందీ కలుగకుండా ఏర్పాట్లు చేశాకే అమలుచేయాలని ఉద్ఘాటిస్తున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే ప్రయివేటు బ్యాంకుల పనితీరు అన్ని రకాలుగా బాగుందనేది నిర్వివాదాంశం. ఇది జనాభిప్రాయం కూడానూ. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారుల, నేతల చిత్తశుద్ధిని శంకించక తప్పదు.

ఊకదంపుడు ప్రసంగాలు...

నగదు రహిత లావాదేవీలపై రోజుకోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు, అప్పుడప్పుడు ఆర్‌బిఐ గవర్నర్ ప్రకటనలతో ఊదరగొడుతున్నారు. పెట్రోల్ బంకులు, పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ మినహా ఇంకెక్కడికి వెళ్ళినా స్వైపింగ్ యంత్రాలు ఉండవు. అదేమిటంటే నచ్చితే నగదు చెల్లించి సరుకు తీసుకోమని, లేదంటే మూసుకొని పొమ్మని చెబుతున్నారు. డిజిటల్ ఇండియాని అంతగా ప్రోత్సహించిన వారు ప్రతి చోట స్వైపింగ్ మెషిన్ ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలీదా ? అసలు ఇటువంటి సమస్యలను చెప్పుకోవడానికి కూడా సరైన మార్గదర్శకాలు తెలియడం లేదు. స్వైపింగ్ మెషిన్లు ఉండవు. ఏటిఎంలకు వెళితే నగదు ఉండదు. పోనీ బ్యాంకుకి వెళితే అక్కడ నగదు ఉండదు.

ఎఫ్ఆర్‌డీఐ ప్రభావం...

కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌డీఐ బిల్లు ప్రవేశపెట్టనున్నట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో.. డిపాజిటర్లలో భయం నెలకొంది. బ్యాంకుల నుంచి తమ డబ్బులను తీసుకునే వారి సంఖ్య భారీగా పెరిగింది. గత మూడు నెలలుగా వినియోగదారులు తమ సేవింగ్స్ ఖాతాలలో డబ్బులు వేయడం తగ్గించేశారు. వీలైనంత వరకూ ఇళ్లలోనే ఉంచుకుంటున్నారు. గతంలో రూ.3 నుంచి 5 వేలు ఉంచుకునే వాళ్లు.. ప్రస్తుతం రూ.30 నుంచి రూ.50 వేల వరకూ ఇంటిలోనే ఉంచుకుంటున్నారు.

లక్ష్యానికి మించిన రుణాలు..

జిల్లాలో రుణాలు సైతం లక్ష్యానికి మించి ఈ ఏడాది ఎక్కువ ఇచ్చారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం చివరి నెలలు కావడంతో రుణాలు లక్ష్యాల మేరకు ఇవ్వాల్సి ఉండడం కూడా బ్యాంకులపై ఒత్తిడి పడేలా చేస్తోంది. పైగా మరో ఏడాదిలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ముందస్తుగా డబ్బులను ఇళ్లల్లో జాగ్రత్త చేసుకుంటుండడం కూడా కొరతకు ఓ కారణంగా కనిపిస్తోంది. మార్చి రావడంతో పరిస్థితి మరింత తీవ్రం కాబోతోంది.

ఏ రోజు వచ్చింది ఆరోజే.

సాధారణంగా బ్యాంకుల కరెంట్ ఖాతాలకు వచ్చిన డబ్బులను మరుసటి రోజు ఏటీఎంలలో నింపుతుంటారు. కానీ.. ప్రస్తుతం పరిస్థితి తీవ్రంగా ఉండడంతో.. వచ్చిన డబ్బులు వచ్చినట్టే కొంత ఏటీఎంలలో పెట్టడం, మరికొంత బ్యాంకుకు వచ్చి డ్రా చేసుకునే ఖాతాదారులకు ఇవ్వడం చేస్తున్నారు. ఏటీఎంలలో డబ్బులు పెట్టిన గంటకే అయిపోతున్నాయి. మిగతా ఎక్కడా ఏటీఎంలు పనిచేయకపోవడంతో డబ్బులు ఉన్న వాటి దగ్గర జనం బారులు తీరి తీసుకుంటున్నారు.

నీరవ్‌మోదీకి ఈడీ షాక్

(మొదటి పేజీ తరువాయి)

వీరిరువురికి చెందిన షేర్లను, మ్యూచుఫల్ ఫండ్స్‌ను స్థంభింప చేసింది. 11,400 కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం మోదీకి చెందిన రూ.7.80 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్స్, షేర్లను ఫ్రీజ్ చేసింది. అలాగే చోక్సి చెందిన 86.72 కోట్ల రూపాయల విలువైన షేర్లను స్తంభింపచేసింది. మోదీకి, కంపెనీకి చెందిన 9లగ్జరి కార్లను కూడా ఈడీ స్వాధీనం చేసుకుంది. ఈ కార్లలో రోల్స్ రాయిస్ ఘోస్ట్, రెండు మెర్సిడెస్ బెంజ్ జీఎల్ 250 సిడిఐ, ఒక పోర్షే పనామెర, 3 హోండా కార్లు, ఒక టయోటా ఫార్చ్యూనర్ ఒక టయోటా ఇన్నోవా ఉన్నాయి. కాగా వేల కోట్ల రూపాయల మేర బ్యాంకులను ముంచేసి విదేశాలకు పారిపోయిన నీరవ్ మోదీ కేసులో ఈడీ, సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేశాయి. ఇప్పటికే పీఎన్‌బీకి చెందిన ఉద్యోగులను అరెస్ట్‌చేసిన రిమాండ్‌కు తరలించింది. అలాగే నీరవ్‌మోదీ సంస్థలు, గీతాంజలి సంస్థలపై కూడా చర్యలకు దిగింది. వీరి ఉద్యోగులను అరెస్ట్ చేసింది మరోవైపు అత్యుత్సాహంతో బ్యాంకుల రికవరీని పరిమితం చేసుకుంటుంటూ పీఎన్‌బీపై మోదీ ఎదురుదాడికి దిగారు. అలాగే నీరవ్ విదేశాలకు పారిపోయేటట్లు, వ్యాపార పనుల మీద వెళ్లడంతో అతని కౌన్సిల్ వాదించిన సంగతి తెలిసిందే.

అడ్డగో(డ)లు నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

యాజమానులు ఇష్టారాజ్యంగా మార్పు చేస్తున్నారు. అందులోనూ గాజువాక జలా మాజీ చైర్మన్ ఈ తతంగానికి అండగా నిలవడంతో అడిగేవాడే లేదన్నట్టు కొండగెడ్డకు అడ్డంగా కోటగోడలా ప్రహరీని నిర్మించారు. పది మీటర్ల వెడల్పుగా ప్లాన్‌లో చూపిన గెడ్డగెడ్డను పూడ్చేసి ప్లాటు విస్తీర్ణాన్ని 2000చ.మీ.కు పెంచేశారు. పైగా అనధికారిక చీకటి ఒప్పందాన్ని కుదుర్చుకొని ప్లాటు రూపు మార్చేశారు. కమాన్ ఫెషిలీటీ సెంటర్ లో ఈ వ్యవహారం చోటు చేసుకోవడంతో ప్లాటు ఓనర్లు కొండగెడ్డనుంచి వచ్చే నీరు ఎక్కడ తమ ప్లాట్లును ముంచెత్తుతుందోనన్న భయాందోళనకు గురవుతున్నారు. పెందుర్తి బిఆర్‌టిఎస్ రహదారిని ఆనుకొని వున్న గుర్రంపాలెం ఐడిఎ కామన్ ఫెషిలిటీ సెంటర్‌లో ఈ అడ్డగోలు వ్యవహారం చోటుచేసుకొంది. నిన్న మొన్నటి వరకూ మొద్దునిద్రలో ఉన్న గాజువాక జలా అధికారులు లీడర్ ఈ వ్యవహారంలో పరిశోధన ప్రారంభించిందని తెలియడంతో ఉలిక్కి పడ్డారు. వారం రోజులుగా సాగుతున్న అడ్డుగోడ నిర్మాణం ఇప్పుడే తెలిసినట్టు బిల్డప్ ఇవ్వడం కొసమెరుపు. ఏపిఐఐసి జోనల్ మేనేజర్ విశాఖపట్నం వారి అనుమతితో రూపొందిన ప్లాన్‌లో 31సెంట్లుగా ఉన్న కొండగెడ్డను మింగేసి అడ్డుగోడను నిర్మించిన జలా మాజీ చైర్మన్ వ్యవహారంపై లీడర్ ప్రత్యేక కథనం.

గాజువాక జలా పరిధిలోని పెందుర్తి గుర్రంపాలెం ఐడిఎ అండ్ ఎస్ లేఅవుట్‌లో 7.53సెంట్లులో కమాన్ పెషిలిటీ సెంటర్‌ను రూపొందించారు. ఇందులో 1,29సెంట్లలో పెట్రోల్ బంక్‌కు కేటాయించి నిర్మించారు. మిగిలిన భూమిలో సబ్‌స్టేషన్ కోసం అరెకరా మినహాయించి సి-1,సి-2ఎ,బి,సి-3,సి-4ప్లాట్లును రూపొందించి ఆన్‌లైన్ అలాట్‌మెంట్ కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. సి-3ప్లాటు విస్తీర్ణం అరెకరాలోపు ఉండటంతో జిల్లా స్థాయి అధికారులు అప్పటి గాజువాక జలా చైర్మన్‌కు కేటాయించారు. పక్కన అనుకొని ఉన్న సి-1ప్లాటు విస్తీర్ణం రెండెకరాలకు పైబడి ఉండటంతో రాష్ట్రస్థాయి కమిటీ అమోదంతో కేటాయించారు. అయితే కమాన్ ఫెసిలిటీ సెంటర్ కోసం 2016 మే 5వ తేదీన రూపొందించిన తొలి లేఅవుట్‌లో సి-3ప్లాటు విస్తీర్ణం 51సెంట్లు కాగా, గెడ్డ విస్తీర్ణం 45సెంట్లుగా పేర్కొన్నారు. అనంతరం బిఆర్‌టిఎస్ రహదారి మంజూరు కావడంతో నిబంధనల ప్రకారం 15మీటర్ల గ్రీన్‌బెల్ట్‌ను అదనంగా ప్లాన్‌లో చేర్చాల్సి వచ్చింది. దీంతో సి-3ప్లాటు విస్తీర్ణం 41సెంట్లకు, గెడ్డ (పొడవు తగ్గడం కారణంగా)విస్తీర్ణం 31సెంట్లకు తగ్గింది. సి-3ప్లాటు విస్తీర్ణం తగ్గడంతో పక్కనే ఉన్నగెడ్డకు అడ్డుగోడ కట్టి యథాతథంగా ప్లాటు విస్తీర్ణాన్ని పెంచేశారు. అలాగే వాస్తు కోసమన్నట్టు ప్లాట్ అలైన్‌మెంట్‌ను సైతం మార్చేశారు. నిజానికి ప్లాట్ అలైన్‌మెంట్, విస్తీర్ణం మార్చాల్సి వస్తే జలా లేదా వుడా అప్రూవల్‌తో రివైజ్డ్ ప్లాన్‌ను సమర్పించి మార్చాలి. అందులోనూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం సహజ వనరులకు విఘాతం కల్గించడం, గెడ్డవాగుల్లో నీటి ప్రవాహాన్ని అడ్డగించడం నేరం. అయినా ఏపిఐఐసి ఇంజినీరింగ్ విభాగం జోనల్ అధికారులు, గాజువాక జలా అధికారులు ఏ విధంగా గెడ్డను పూడ్చేందుకు అనుమతిచ్చారో అర్థం కావడం లేదు. వారం రోజులుగా ఈ అడ్డుగోలు వ్యవహారం సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో లీడర్ రంగంలోకి దిగి తీగ లాగితే అడ్డుగోలు వ్యవహారంలో ప్లాటు విస్తీర్ణాన్ని ఇష్టారాజ్యంగా పెంచేసుకొన్న విషయం బహిర్గతమైంది. ముందస్తు ప్లాన్ ప్రకారం డబ్బుచెల్లించినందునే గెడ్డను ఆక్రమించుకొని ప్లాటు విస్తీర్ణాన్ని పెంచేసుకొన్నట్టు చెబుతున్న పారిశ్రామిక వేత్తలు, విస్తీర్ణం తగ్గినప్పుడు తిరిగి వెనుక్కుడబ్బు తీసుకోవాలి కాని గెడ్డను, వాగును ఎలా మింగేస్తారో అంతుబట్టడం లేదు. ఇందుకు అధికారులు ఏ విధంగా సహకరిస్తారో తెలియడం లేదు. గెడ్డను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భాషాభివృద్ధిలో మీడియాకు బాధ్యత లేదా?



ఇటీవలి ప్రపంచ తెలుగు మహాసభలను పత్రికలు, ఛానళ్లు చాలా పొగిడాయి. మరి ఆ సభల ప్రభావం మీడియాపై ఎంతున్నది? తర్వాతి రెండు మాసాల కాలంలో పరిస్థితిని గమనించగా, వారు అవసరం లేకున్నా ఇంగ్లీషు పదాలను విరివిగా ఉపయోగించటం వెను కటిస్థాయిలోనే కనిపిస్తున్నది. మార్పు రాత్రికిరాత్రి జరిగేది కాదు గాని, కనీసం ఆ దిశలో ప్రయత్నాలు అయినా ఏమైనా చేస్తున్నారా? భాషాభివృద్ధిలో తన పాత్ర కీలకమన్న విషయం తెలిసిన మీడియా, ఆ బాధ్యతను ఇంకా ఎప్పుడు గుర్తిస్తుంది?

తెలుగు భాషాభివృద్ధిలో మీడియా పాత్ర మరొక మారు చర్చనీయం అవుతున్నది. పరిస్థితులు గత మహాసభల నాటి వంటివి అయితే మీడియా పాత్ర గురించి అంతగా మాట్లాడుకోవలసింది ఉండేది కాదు. మాట్లాడకున్నా అది మొక్కుబడికోసం అయేది. ఈసారి అట్లా జరుగరాదని మనకు మనం చెప్పుకోవాలి. మీడియా కూడా అట్లా చెప్పుకోగలదని ఆశించాలి.తె

తెలుగు భాష అభివృద్ధి గురించిన చర్చ చాలాకాలంగా జరుగుతున్నది. చర్చకు సంబంధించినంత వరకు మీడియా పెద్దపాత్రనే వహిస్తున్నది. అందుగురించిన వార్తలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, లేఖల ప్రచురణ, సంపాదకీయాల రచన బాగానే కన్పిస్తున్నది. తెలుగు భాషాదినోత్సవాల సందర్భంగా, తెలుగు అభివృద్ధికి కృషిచేసిన ప్రముఖుల జయంతి సమయాల్లో వారు మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. కనుక భాషాభివృద్ధి అవసరం ఏమిటో, అందు లో తమ పాత్ర ఏమిటో మీడియాకు ఎవరూ చెప్పనక్కరలేదు. కాని, ఇం దుకోసం పత్రికల్లో తగినంత చోటు, ఛానళ్లలో సమ యం ఇవ్వటం ద్వారా అందుకు దోహదం చేస్తున్న మీడి యాను అభినందిస్తూనే పని విషయంలో శ్రద్ధ ఎందు వల్ల చూపటం లేదు? పత్రికలతో పోల్చితే ఛానళ్ల పరిస్థితి మరీ ఇంత విచారకరంగా ఎందుకున్నది?

ఈ ప్రశ్నలేవీ కొత్తవి కావు. నిరుడు డిసెంబర్ 15 నుంచి అయిదు రోజుల పాటు జరిగిన హైదరాబాద్ సభలకన్న ముందు కాలంలోనూ ఉన్నవే. ఇంకా చెప్పాలంటే ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన సభలకు ముందు వెనుకలుగానూ ఉన్నవే. కాని మీడియా వైపు నుంచి తనను తాను మార్చుకునేందుకు జరిగిన ప్రయత్నం స్వల్పం. మీడియాకు చెం దినవారు ఈ ప్రశ్నపై ఎపుడైనా సమావేశం కావటం, అందరూ సూచన లు చేయటం వరకు కొన్నిసార్లు జరిగింది. కాని అవన్నీ ఆ సమావేశాల తో ముగిసిపోవటం తప్ప ముందుకు కదలలేదు. మరింత నికరమైన చర్చలు, ఆచరణ ప్రణాళికలు, కార్యరూపాలు కన్పించలేదు. అటువంటిది ఆ రోజుల్లో మొదలై ఉంటే, చిన్నిచిన్న అడుగులతో ఈ సరికి తగినంత ముందుకువెళ్లేది. అది ఒక కార్యాచరణ ధోరణిగా మారేది. ఆ తరహాలో ముందుకుపోవటం అసాధ్యం కాదు, పెద్ద కష్టమూ కాదు. కావలసింది సంకల్పం, సమన్వయం, మధ్యలో ఆపకుండా కొనసాగించే శ్రద్ధ. కాని ఇవి లేకుండా పోయినందునే సమస్య ఎప్పటివలెనే కొనసాగుతున్నది.


ఇందులో భిన్నాభిప్రాయాలు, సమస్యలు లేవని కాదు, కాని అవి ఏవీ అధిగమించలేనివి కావు. కనీసం సమస్యాత్మకం అయినవాటిని పక్కన ఉంచి ఇతర అంశాలలో ముందుకుపోయే పద్ధతి ఒకటి ఉంటుం ది. ఆ ప్రకారం, మీడియాలో తెలుగు ఉపయోగాన్ని పెంచటం, ఇంగ్లీషును వీలైనంతగా పరిహరించటంపై ఏకాభిప్రాయానికి వస్తూ ఆ పని చేయటం తప్పకుండా తేలికే. ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న తెలుగు పదాలను పోనివ్వకపోవటం, ఇటీవలి గతంలో వాడుకలో ఉండి కనుమరుగవుతున్న వాటిని నిలబెట్టుకోవటం, మీడియాలో ఆధునిక కాలంలోనూ సర్వత్రా ఉపయోగిస్తుండిన మాటలు కొత్తతరాల జర్నలిస్టుల అర్ధ విద్య, అర్ధ శిక్షణలు, ఆసక్తిలేమి, పెద్ద పర్యవేక్షణా లోపం వల్ల మాసిపోతుండటాన్ని ఆపటం వంటివి కష్టమైన పనులు కాదు. కావలసింది మీడియా వారు కలిసి మాట్లాడుకొని అందుకు పూనుకోవటం. ఈ విధంగా ఇప్పటికే ఉన్న పద సంపదను ఉపయోగించి కాపాడుకోవటం ప్రాథమిక కార్యం కాగా, అసలు సవాలు మరొకటి ఉంది. అది అందరి కీ తెలిసిందే. చర్చలలోకి వస్తున్నదే. ఆధునికత విస్తరిస్తున్నా కొద్దీ వాడుకలోకి వస్తున్న వివిధ రంగాల పద సముదాయానికి సరిపోయే తెలుగు పదాలను తయారు చేసుకోవటం, దానిని ఉపయోగంలోకి తేవటమన్నది ఆ సవాలు. కొత్త పద సముదాయాల తయారీపై ప్రభుత్వ శాఖల నుంచి, ఇతర సంస్థలు వేదికలు, ఒక మేరకు మీడియా నుంచి ప్రయత్నాలు జరుగుతూనే వస్తున్నాయి కాని ఆ పదాలు సరైనవా కావా, వాడటం తేలికా కష్టమా, వాడినప్పుడు పాఠకులకు లేదా జన సామాన్యానికి ఆమోదయోగ్యం అవుతాయా లేదా అనే ప్రశ్నలు ఎక్కువ భాగం ఎటూ తేలకుండా ఉన్నాయి. అట్లా తేల్చి ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నాలు ఇంచుమించు జరుగటం లేదు. తయారీలు-ప్రశ్నలు-వాదనలు-వదిలివేతలు అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఈ పరిస్థితి మారాలంటే అందరూ కలిసి చొరవ తీసుకోవాలి. సమన్వయపరుచవలసింది ప్రభుత్వం, అకాడమీలు, మీడియా సంస్థలు.

గత కొన్ని దశాబ్దాల కాలంలో సృష్టి అయిన కొత్త పద సంపదను తెలుగులోకి తేవటం పరిస్థితి ఇట్లుండగా, శరవేగంతో మరింత కొత్త పదజాలం వచ్చిపడుతున్నది. ఆ విధంగా, వెనుకటి సమస్యలే పరిష్కారం కాకుండా మిగిలి ఉండగా కొత్త సమస్యలు వచ్చి ముంచెత్తుతున్నాయి. ఈ పరిస్థితిని ఆర్థిక పరిభాషను ఉపయోగిస్తూ వర్ణించాలంటే భాషా పరమైన అండర్ డెవలప్‌మెంట్ అన్నమాట. ఒకవైపు భాష విస్తరిస్తుంటే మనం కనీసం ఉన్నచోటనైనా మిగలక మరింత వెనుకకు పోవడమన్నమాట. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే రాగల 10-20 ఏండ్లలో విష యం ఇంకా విషమిస్తుంది. అది తెలుగు భాష సజీవంగా ఉంటూనే నిర్జీవంగా మారదన్నమాట. అందుకు తగినట్లు మన వాడకంలో తెలుగు తగ్గి ఇంగ్లీషు పెరుగుతుండటం కొంతకాలం క్రితమే మొదలైంది. క్రమంగా ఇంకా పెరుగుతున్నది. ఇందుకు అడ్డుకట్ట వేసేందుకు మనకు గల సాధారణ స్పృహ పనిచేయటం లేదు. భాషా దినోత్సవాలు, గిడుగు వర్ధంతులు, తెలుగు సభల వంటివి ప్రేరణ కావటం లేదు.

సోఫియా చెప్పిన సత్యం

కృత్రిమ మేధపై అవగాహన గల శాస్త్రవేత్తలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మానవులలో విలువలు పెంపొందించడానికి కృషి సాగించాలె తప్ప విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలను అడ్డుకోవడం సబబు కాదు. కలమై నా, ఖడ్గమైనా మానవులు ఉపయోగించుకునే తీరుపై ఉంటుంది. అణుశక్తిని వైద్యం కోసం వాడుకోవచ్చు, మానవ వినాశనానికి ఉపయోగించవచ్చు. విజ్ఞానశాస్త్రం కొత్త పుంతలు తొక్కినప్పుడల్లా దాని పర్యవసానంపై భయాందోళనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. కొత్త విజ్ఞాన ఆవిష్కరణలను ఆహ్వానిస్తూనే, వాటిని మానవ పురోభివృద్ధికి ఉపయోగించుకోవడానికి సిద్ధపడాలె. అంతర్జాతీయ సదస్సులకు అత్యుత్తమ వేదికగా అలరారుతున్న హైదరాబాద్ నగరంలో తాజాగా కృత్రిమ మేధపై అంతర్జాతీయ సమ్మేళనం సాగడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ప్రముఖ ఐటీరంగ దిగ్గజాలు రావడంతోపాటు, రోబో సోఫియా ఈ సమావేశాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశంలోనే తొలిసారిగా ప్రపంచ ఐటీ సమ్మేళనాన్ని హైదరాబాద్ నగరంలో ఏర్పాటుచేయడం వెనుక తెలంగాణ ప్రభుత్వ కృషి ఉన్నది. ఈ సమావేశాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నాస్కాంతో కలిసి హైదరాబాద్ నగరంలో కృత్రిమ మేధ, డేటా విజ్ఞాన విశిష్ట కేం ద్రాన్ని ఏర్పాటుచేయ నిశ్చయించడం విశేషం. ఈ ఐటీ సమ్మేళనానికి ప్రేరకులైన రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ చెప్పినట్టు - కృత్రిమ మేధ, డేటా విజ్ఞానం 2025 నాటికి 16 బిలియన్ డాలర్ల పరిశ్రమగా వృద్ధి చెందే నేపథ్యంలో ఇటువంటి విశిష్ట కేంద్రం ప్రాధాన్యం పొందుతున్నది. కొత్త ఆవిష్కరణలకు, పరిశ్రమల పురోభివృద్ధికి, ఉపాధి కల్పనకు ఈ కేంద్రం తోడ్పడుతుంది. రాబో యేరోజుల్లో డేటా విజ్ఞానం అధ్యయనాలకు, రూపకల్పనకు మహాగనిగా మారుతుంది. ప్రతి రంగమూ ఈ డేటా విజ్ఞానాన్ని ఇమిడించుకోకతప్పదు. కృత్రిమ మేధ కూడా విజ్ఞానశాస్త్రంలో, పారిశ్రామిక వ్యవస్థలో, మానవ జీవనంలో అపూర్వ మార్పులను ప్రవేశపెట్టనుంది. ఈ సమావేశాలను ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తూ- భారత సమాజం సాంకేతికను అతి సులభంగా ఒడిసిపట్టుకునే సంస్కృతి గలదని చెప్పడం గమనార్హం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐటీ ంగాన్ని అతివేగంగా వృద్ధి చేయడంతోపాటు గ్రామీణ జనానికి డిజిటల్ విప్లవాన్ని చేరువ చేయడానికి కృషి చేస్తున్నది. ఈ కృషి ఫలితమే ప్రపంచ ఐటీ సమ్మేళనానికి హైదరాబాద్ నగరాన్ని వేదికగా మార్చింది. రాబోయే రోజులలో కృత్రిమ మేధ పునాదిగా ఏర్పడే పరిశ్రమలలో భారీగా ఉపాధి కల్పన జరిగే సూచనలు ఉన్నాయి. కృత్రిమ మేధ విజ్ఞాన శాస్త్ర, పారిశ్రామిక రం గాలలో సంచలనం సృష్టిస్తుం దనడంలో సందే హం లేదు. అయితే యంత్ర మానవుల సృష్టిపై చర్చ ఎంత ఆసక్తిదాయమైనదో, అంత ఆలోచింపదగినది. ఐటీ సమ్మేళనంలో రోబో సోఫియా సృష్టికర్త డేవిడ్ హాన్సన్ వెలిబుచ్చిన అభిప్రాయాలు ఈ చర్చను ముందుకు తీసుకుపోయేవిగా ఉన్నాయి. కృత్రిమ మేధ వల్ల నిజమైన ప్రమాదమేమీ లేదని ఆయన అంటూనే, పరోక్ష హెచ్చరికలను చేశారు. యంత్ర మేధ మానవ మేధను మించి పై చేయి సాధిస్తుందన దానికి ఆధారాలు లేవని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిని ఆయన వివరించిన తీరు కూడా గమనార్హమైనది. అరువై ఏండ్ల పరిశోధన తరువాత కూడా రోబోలలో పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించడం రాలేదు. జీవులలో ఉండే స్వేచ్ఛా దృక్పథం రోబోలకు ఏర్పడలేదు. విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు మానవులకు సాధ్యం. కానీ యంత్రాలు వాటికవి చేయలేవు. మానవులు నిర్మించిన మేధపై ఆధారపడి వ్యవహరిస్తాయి అని డేవిడ్ హాన్సన్ వివరించారు. కానీ రోబోల వ్యవహార సరళిపై హాన్సన్ ఇచ్చిన వివరణ మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నది. రోబోలు తమ చర్యల ఫలితం ఎట్లా ఉంటుందనే ది ఆలోచించలేవు. ఇదే భయాలకు తావిస్తున్నది. విజ్ఞానానికి భయపడవలదు. కాకపోతే రాబో యే పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలె అని ఆయన అన్నారు. ఈ యంత్రమానవులను నియంత్రించడం ఎట్లా అనేది ఇపుడు న్న చర్చ. ఉత్తమమైన యంత్రమానవులను సృష్టించాల నే భావన ఉన్నది. అయితే మానవులలోనే స్వార్థం, మోసం, ప్రేమ, విలువల వంటి భిన్నమైన ఉద్వేగాలు ఉన్నాయి. ఇక ఉత్తమమైన విలువలుగల రోబోలను సృష్టించడం ఎట్లా సాధ్యం అని డేవిడ్ హాన్సన్ ప్రశ్నించారు. హాన్సన్ వివరణను బట్టి యంత్ర మానవులు కాదు, మానవులే అసలు సమస్య అనేది స్పష్టమవుతున్నది. ఎలాన్ మస్క్‌తో సహా పలువురు కృత్రిమ మేధ పట్ల జాగ్రత్తలు అవసరమని హెచ్చరిస్తున్నా రు. కృత్రిమ మేధపై, రోబోలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్నది. దీని ఫలితంగా రోబోలు మానవులపై తిరుగబడే ఇతివృత్తాలతో సినిమాలు కూడా వచ్చినయి. కానీ రోబో సోఫియాను గమనిస్తే, రోబోలు మానవులపై తిరుగబడే రోజులు కనుచూపు మేరలో లేవని చెప్పవచ్చు.

బుద్ధుడు సందేశాలు



తెలివిగలవాడు తనవద్దనున్న కాంతిని ఉపయోగించి ఉజ్వలమైన తేజస్సును పొందుతాడు. అతడు సత్య జ్ఞాన ప్రకాశంలో నిరంతరంగా ముందుకు పోతాడు. ధర్మ ప్రవర్తన, పుణ్య కార్యాల ద్వారా, వివేచనా శక్తిని వినియోగించడం ద్వారా నీ నిజమైన ఆధిక్యతను ప్రదర్శించు. ఐహిక విషయాలు, ఇంద్రియ సుఖాలు నిస్సారమైనవి, నిరుపయోగమైనవి. వాటి మాయాజాలాన్ని గురించి లోతుగా ఆలోచించు. ధ్యానంచేయి. నిలకడలేని ఈ శుష్క జీవితాన్ని బాగా అర్థం చేసుకో.

ఇంద్రియ సుఖాలు నిస్సారమైనవి

నీ మనస్సును ఉన్నత స్థాయికి తీసుకొని వెళ్లు. దృఢమైన లక్ష్యంతో, చిత్తశుద్ధితో కూడిన విశ్వాసాన్ని సాధన చేయి. రాజధర్మ నియమాలను ఉల్లంఘించకు, నీ సుఖం ఆనందం బాహ్య వస్తువుల్లో గాక నీ మనస్సుపైనే ఆధారపడి ఉందని గ్రహించు. ఆ విధంగా శాశ్వత కీర్తి ప్రతిష్టలు గడించి, తథాగతుని అభిమానాన్ని పొందగలవు. బుద్ధుని ఉపదేశాన్ని రాజు భక్తి శ్రద్ధలతో ఆలకించాడు. ప్రతి పదాన్ని తన హృదయంలో భద్రపరచుకొన్నాడు.

వేణువనం

రాజగృహంలోని వేణువనంలో ఒకసారి బుద్ధుడు బౌద్ధ సంఘాన్ని ఉద్దేశించి ఇలా ప్రసంగించాడు. "ఓ శ్రమణులారా! బుద్ధులు పుట్టినా, పుట్టకున్నా నిర్మితమైనవన్నీ నిలకడలేనివే, అశాశ్వతమైనవే అనేది నిత్య సత్యం. అశాశ్వతత్త్వం అనేది అస్తిత్వం యొక్క ముఖ్య లక్షణం. ఇది మారదు. ఈ విషయాన్ని ఒక బుద్ధుడు కనిపెట్టి జ్ఞాని అవుతాడు. అలా జ్ఞాని అయిన బుద్ధుడు ఆ సత్యాన్ని ప్రకటిస్తాడు. ఉపదేశిస్తాడు. విశదీకరిస్తాడు, వెల్లడి చేస్తాడు వివరణ ఇస్తాడు. నిర్మితమైనవన్నీ అశాశ్వతమైనవనే విషయాన్ని స్పష్టం చేస్తాడు. ఓ శ్రమణులారా! బుద్ధులు పుట్టినా, పుట్టకపోయినా నిర్మితమైనవన్నీ బాధకు గురియవుతాయనేది మారని సత్యం. అస్తిత్వంలో అది ఒక భాగం. ఈ విషయాన్ని ఒక బుద్ధుడు కనిపెట్టి జ్ఞాని అవుతాడు. అలా జ్ఞాని అయిన బుద్ధుడు ఆ సత్యాన్ని లోకానికి వెల్లడి చేస్తాడు. ఉపదేశిస్తాడు. వివరిస్తాడు. నిర్మితమైనవన్నీ బాధకు గురియవుతాయని స్పష్టం చేస్తాడు.

ఓ శ్రమణులారా! బుద్ధులు పుట్టినా, పుట్టకపోయినా నిర్మితమైన వాటికి ఆత్మలే దనేది సత్యం. అది అస్తిత్వంలో ఇమిడియున్న లక్షణం. ఈ సత్యాన్ని ఒక బుద్ధుడు కనిపెట్టి జ్ఞాని అవుతాడు. అలా జ్ఞాని అయిన బుద్ధుడు ఆ సత్యాన్ని లోకానికి చాటుతాడు. నలుగురికి చెబుతాడు. ప్రచారం చేస్తాడు. అందరికీ తేటతెల్లంగా విశదీకరిస్తాడు.

దిన ఫలాలు

శుక్రవారం -23-2-2018

మేషం : చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా సాగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

వృషభం: కుటుంబ సభ్యులతో ఏర్పడిన విబేధాలు తొలగుతాయి. ఆరోగ్య, వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. దీర్ఘకాలిక సమస్యలు కొంతవరకు తీరుతాయి.

మిథునం : ఆర్థిక ప్రగతి సాధిస్తారు. బాకీలు వసూలవు తాయి. పనులలో విజయం సాధిస్తారు. ఉద్యోగాలలో ముందడుగు. భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

కర్కాటకం : బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. రుణబాధలు తొలగుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

సింహం :పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు. సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం.

కన్య :ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి. పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. కుటుంబ సమస్యలు కొంత వరకు తీరతాయి. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

తుల :వివాహ, ఉద్యోగయత్నాలలో పురోగతి సాధిస్తారు. ఆర్థికలాభాలు అందుతాయి. సంఘంలో గౌరవం పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

వృశ్చికం : దూర ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. సోదరులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి.

ధనుస్సు : వృత్తి, వ్యాపారాలలో ముందంజ వేస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. సన్మానయోగం వుంటుంది.

మకరం : కొత్త పెట్టుబడులకు అనుకూలమైన కాలం. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. సోదరులతో ఏర్పడిన విబేధా లు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

కుంభం : మిత్రుల సహకారంతో నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తిచేస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం : దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమై ఊరట చెందుతారు. కీలక నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు. దూరప్రాంతాల నుంచి విలువైన సమాచారం.

అందం



చర్మ సమస్యలకి దూరంగా..

చిన్నపాటి జాగ్రత్తలతోనే చర్మ ఆరోగ్యానికి సంబంధించి ఎంతో మెరుగైన ఫలితాలు అందుకోవచ్చు. కాకపోతే ఇవన్నీ క్రమంతప్పకుండా కొనసాగేలా చూసుకోవాలి. అలాంటి జాగ్రత్తలు కొన్ని..

- శరీరంపై పేరుకుపోయిన మృతకణాలు ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి. ఇందుకోసం పెద్దగా ఖర్చుపెట్టాల్సిన అవసరం లేదు. వారానికి ఒకసారి ఆలివ్‌నూనెలో పంచదార కలిపి రుద్దినా సరిపోతుంది. ఇంట్లోనే ఇలాంటి ఎన్నో స్క్రబ్‌లు తయారుచేసుకోవచ్చు. ప్రయత్నించి చూడండి.
- తరచూ ఎండలో తిరగడం వల్ల మన చర్మం సహజ తేమను కోల్పోతుంటుంది. అది ఏమాత్రం తగ్గినట్టు అనిపించినా ప్రతి రోజూ రాత్రి పడుకునే ముందు మాయిశ్చరైజర్ రాసుకోండి.
- మేకప్ వేసుకున్నప్పుడు తప్పనిసరిగా మొత్తం తీసేశాకే నిద్రపోండి. 'ఒక్కరోజుకి ఏం కాదులే..' అనుకుంటే తీవ్ర సమస్యలు రావొచ్చు. మేకప్ తొలగించడానికి క్లెన్సర్‌లే ఉపయోగిం చక్కర్లేదు. కొబ్బరినూనె వాడినా చాలు.
- అలంకరణ సామగ్రీ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోండి. ఇవి కూడా బ్యాక్టీరియా వ్యాప్తి చెందడానికి కారకాలుగా పనిచేస్తాయి.
- మొటిమలు ఎక్కువ కావడానికి చర్మగ్రంధులు మూసుకుపోవడం కూడా ఓ కారణం. అందుకే తరచూ ముఖానికి ఆవిరి పట్టండి. దీనివల్ల చర్మగ్రంధులు తెరుచుకుం టాయి. బ్యాక్టీరియా సమస్య ఉన్నా తగ్గుతుంది.

చరిత్రలో ఫిబ్రవరి 23

ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం.

1483 : మొఘల్ సామ్రాజ్య స్థాపకుడు బాబర్ జననం (మ.1531).

1855 : సుప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు మరియు శాస్త్ర వేత్త కార్ల్ ఫ్రెడెరిక్ గాస్ మరణం (జ.1777).

1913 : ప్రముఖ ఇంద్రజాలికుడు పి.సి.సర్కార్ జననం (మ.1971).

1941 : అణుబాంబుల తయారీలో వాడే రసాయన పదార్థం ప్లుటోనియంను కాలిఫోర్నియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు కనుగొన్నారు.

1957 : తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకుడు కింజరాపు ఎర్రన్నాయుడు జననం (మ.2012).

1982 : భారతదేశ టెలివిజన్ నటుడు మరియు మోడల్ కరణ్ సింగ్ గ్రోవర్ జననం.

1966 : దళిత కళాకారిణి మరియు కవయిత్రి చంద్రశ్రీ జననం.

2009 : 91వ అకాడమీ అవార్డులలో భారతదేశానికి చెందిన ఏ.ఆర్.రెహమాన్ కు రెండు ఆస్కార్ అవార్డులు లభించాయి.

1503 : ప్రముఖ వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు అన్నమయ్య మరణం (జ.1408). వాగ్గేయ కారుడు తాళ్ళపాక అన్నమాచార్యుని గురించి. ఇతర వాడుకల కొరకు, అన్నమయ్య తాళ్ళపాక అన్నమాచార్య మరణం ఫిబ్రవరి 23, 1503 (వయసు 94) తిరుపతి, ఆంధ్రప్రదేశ్ రంగం కర్ణాటక సంగీతం వృత్తి రచయిత, యోగి, స్వరకర్త, కవి, పదకవితా పితామహుడు అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు (మే 9, 1408 - ఫిబ్రవరి 23, 1503) తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు (సాధారణ భాషలో గేయాలను కూర్చేవారు). అన్నమయ్యకు పదకవితా పితామహుడు అని బిరుదు ఉంది. దక్షిణాపథంలో భజన సంప్రదాయానికి, పదకవితాశైలికి ఆద్యుడు. గొప్ప వైష్ణవ భక్తుడు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ని, అహోబిలము లోని నరసింహ స్వామి ని, ఇతర వైష్ణవ సంప్రదాయ దేవతలను కీర్తిస్తూ 32వేలకు పైగా కీర్తనలు రచించాడు. అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం, భావలాలిత్యం పెనవేసికొని ఉంటాయి. కన్నడ వాగ్గేయ కారుడు పురందరదాసు అన్నమయ్యను శ్రీనివాసుని అవతారంగా ప్రశంసించాడంటారు. (సాక్షాత్తు శ్రీమహా విష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని శ్రీవైష్ణవసంప్రదాయంలో నమ్మకం ఉంది.



శ్రీవేంకటేశ్వర వైభవము

సకల చరాచర జగన్నియస్తయై శ్రీ వైకుంఠాద్రియందు ప్రఖ్యాతి కాంచిన ఈ తిరుమలయందు లక్ష్మీసమాశ్లిష్ట భుజాన్తరుడై అర్చావతారమున వేంచేసి యున్న శ్రీవేంకటేశ్వరస్వామివారికి తద్వక్షస్థల నిత్యనివాస రసికురాలగు శ్రీలక్ష్మీ అమ్మవారికి ప్రతిశుక్రవారం అభిషేకము జరుగును. శుక్రవారము ఉదయము శ్రీస్వామివారు గురువారమునాడు రాత్రి ధరించిన పూలంగితోనే విశ్వరూపదర్శనమునిచ్చెదరు.

విశ్వరూపదర్శనము పూర్తి అయిన పిమ్మట అర్చకులు అంతర్ద్వారము తలుపులు వేసి ఏకాంతముగా శ్రీవారి పుష్పాలంకారమును సళ్ళింపుచేసి ద్వారము తలుపులు తెరచెదరు.

శుద్ధి

పిదప ఆలయశుద్ధి జరిగి, ప్రాత:కాలారాధనము ప్రారంభమగును.

ప్రాత:కాలారాధనము

మామూలు మేరకు తోమాలసేవ, ప్రభుత్వోత్సవము (కొలువు) అర్చనము, ప్రసాదములనివేదనము, శాత్తుమొర ఏకాన్తముగా జరుగును.

అభిషేక పూర్వాంగములు

ఇటుల శ్రీస్వామివారికి ప్రాత:కాలారాధనము పూర్తికాగానే అర్చకులు, యవనికను (తెరను) వేసి ఏకాన్తముగా శ్రీవారికి శుక్రవారనిమిత్తమగు అభిషేకమునకు సంకల్పమునుచేసి ఉచితములైన ఉపచారములు సమర్పించి అష్టోత్తరశతనామార్చనమును చేసేదరు. తరువాత అభిషేకమునకు పూర్వాంగముగా శ్రీవారి ఊర్ధ్వపుంద్రములోని అరభాగమునున్న తగ్గించి సూక్ష్మముగా నూర్ధ్వ పుంద్రము నుంచి వస్త్రోత్తరీయముల తొలగించి స్నానశాటీని లేక స్నానకౌపీనమును ధరింపజేసెదరు.

అ సమయములో పరిచారకులు శ్రీవారి సన్నిధానమున రెండు వెండి గంగాళముల గోక్షీరములను, రెండు వెండి గంగాళముల శ్రీవారి బంగారుబావి శుద్ధోదకమగు సిద్ధపరచెదరు.

ఈ సమయముననే శ్రీస్వామివారి మహాద్వారమున కిరుపార్శ్వములయందును విచిత్రాలంకారవిభూషితములై విష్ణుభక్తులైన గజరాజాలోయన ఊర్ధ్వ పుండ్రములను ధరించిన శ్రీవారి మత్తగజములు రెండును గజపాలక శాసనములను పరిపాలించుచూ శ్రీవారి అభిషేక దర్శనానంద సమయమును వెల్లడించుచున్నవోయన మహత్తరములైన ఘీంకారములను చేయుచూ భక్తులగు యాత్రికులచే సత్కరింపబడుచూ మహారాజ చిహ్నములై

రాత్రి ధరించిన పూలతోనే విశ్వరూప దర్శనం



శ్వేతచ్ఛత్రాది మర్యాదలతోను పరివారాములతోను, ధ్వజదండప్రదక్షిణ ముగా విమాన ప్రదక్షిణము చేయుచూ సువర్ణ ద్వారమునకు వచ్చి, అచ్చట నుండి అధికారులు, జియ్యంగార్లు, ఏకాంగులు, పరిచారకులు అభిషేక కైంకర్యపరులు ఆలయంలో ప్రవేశించి ఆ పాత్రములను శ్రీవారికి సమర్పించెదరు. యవనిక (తెర) తీసివేయబడును.

అభిషేకాస్తమువరకు వేచియుండెను.

అభిషేక సమయమును పరిపాలించు శ్రీ జియ్యంగార్లు, అధికారులు ఏకాంగులు పరిచారకులు ఆచార్యపురుషులు శ్రీవైష్ణవ స్వాములు శ్రీవారి ప్రథమ ప్రాకారములోని పరిమళం అరకువెళ్ళి అచ్చట యేర్పాటు చేయబడియున్న రజతపాత్రములలో జియ్యంగార్లు శ్రీవారి ఊర్ధ్వపుంద్రమునకుగాను పచ్చకర్పూరము కస్తూరి కలిగియున్న రజత పాత్రమును అధికారులు కుంకుమపువ్వుతో తయారుచేయబడిన నలుగుబిళ్లలు చందనబిళ్ళలు, పసుపు కలిపియున్న రజతపాత్రమును, పరిచారకులు, పచ్చకర్పూ రము, కుంకుమపువ్వు, చందనముతో తయారుచేయబడి, పరిమళం అను పేరుతో వ్యవహరింపడుచున్న సుగంధ పదార్థముతో నిండియున్న రజత పాత్రమును, అభిషేక కైంకర్యపరులగు గృహస్థులు వారి వారి భక్తి శక్త్యను గుణమగు ఆర్జితములననుసరించి కొందరు ఊర్ణాభిషేక సేవానుగుణపదార్థపాత్రములను, కొందరు గంబూరా (పచ్చకర్పూరం) పాత్రములను, కొందరు జాఫ్రా (కుంకపువ్వు) పాత్రములను కొందరు పునుగు పాత్రములను, కొందరు కస్తూరి పాత్రములను భక్తిశ్రద్ధలతో తీసుకుని అందరు మంగళ వాద్యములతోను

అభిషేకమహోత్సవము

శ్రీలక్ష్మీ సమాశ్లిష్ట భుజాన్తరుడగు శ్రీవారికి అభిషేక మహోత్సవము ప్రారంభమగును. అర్చకుడు శ్రీస్వామివారి పాదాబ్జములకు శ్రీతాయార్ల వారికిని నమస్కరించి ఉష్ణీషాదులతో నియమింపబడినవాడై అభిషేకమునకు అనువగు పీఠమునందు నిలువంబడి వాఙ్నియమముకలవాడై జియ్యంగార్లు అందిచ్చిన ఆకాశగంగా జలముతో పూరింపబడిన సువర్ణశంఖమును తీసుకొని హరి:ఓమ్ సహస్రశీర్షా పురుష అని చతుర్వేదశ్రూయమాణమగు పురుషసూక్తం పఠించుచూ శ్రీతాయార్ల వారితో ప్రకాశించు శ్రీస్వామివారి శిరోభూషణమై పరత్వజ్ఞాపకమగు కిరీటమునందు భక్తిశ్రద్ధలతో అభిషేకము చేయుచుండును.

డీవీఎన్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ పై శిక్షణా తరగతులు

అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాలలో ప్రముఖ కంపెనీలో ఎంపికకు రెండు రోజులు శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ కోరుబిల్లి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ ఐ.రంగామణి మాట్లాడుతూ విద్యార్థులకు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగం సాంపదించుటకు ఇదొక మంచి అవకాశమన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కమ్యూనికేషన్, ఇతర అంశాలపై మంచి పట్టు ఉండాలన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో దాడి వీరునాయుడు కళాశాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రూ. 4 వేల కోట్లు

కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్ : రాష్ట్ర బడ్జెట్‌లో నాలుగువేల కోట్ల రూపాయల ప్రత్యేక నిధిని కేటాయించి అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్లను చెల్లించి బాధితులను రక్షించాలని కోరుతూ గురువారం ఉదయం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులను ప్రభుత్వం విక్రయించి 32 లక్షల మంది బాధితులకు న్యాయం చేయాలన్నారు. 2017 మార్చి 23న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన వాగ్దానాల అమలుకు కార్యాచరణ ప్రణాళికలను ప్రకటించాలన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ పరివార్ తదితర స్కీమ్‌లోని బాధితులందరికీ పూర్తి న్యాయం చేకూర్చాలన్నారు. జిల్లాకు ఒక వెరిఫికేషన్ కేంద్రం పెట్టి మిగిలిపోయిన బాధితుల బాండ్లను పరిశీలించి లబ్దిదారుల జాబితాలోకి చేర్చాలని భద్రం కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ, కరణం మాణిక్యాలరావు, ఎంజీ రమణ, సూరిబాబు, మూర్తి, చిన్నమ్ములు, భవాని, ఎస్.మల్లికార్జున్, పి.శివరామకృష్ణ, పి.సుధాకర్, ఎన్. జయసింహ, ఎస్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలి

జీవీఎంసీ జోనల్ కమిషనర్ షేక్ సుభాని



పారిశుధ్య వాహనానికి చెత్తను వేస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్: పట్టణాభివృద్ధికి సహకరించి పారిశుధ్యానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ షేక్ సుభాని అన్నారు. గురువారం ఉదయం స్థానిక కూరగాయాల గాంధీమార్కెట్‌లో సిబ్బందితో కలిసి పారిశుధ్య పర్యవేక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులందరూ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా తాము నిర్దేశించిన ప్రదేశాల్లో వేసి తమ యొక్క పారిశుధ్య వాహనాలకు అందజేయాలన్నారు. ప్రతి రోజు మార్కెట్‌లో ఉదయం ఐదు నుంచి తొమ్మిది గంటల వరకు, అదేవిధంగా సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచే చర్యలను చేపడుతున్నామని కమిషనర్ సుభాని అన్నారు.

జగ్గన్నపేటలో దళిత తేజం - తెలుగు దేశం



జగ్గన్నపేట, న్యూస్‌లీడర్: మండల కేంద్రంలో జగ్గన్నపేట గ్రామంలో దళిత తేజం కార్యక్రమం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అధ్యక్షతను గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితులకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలు సబ్ ప్లాన్ నిధులతో ఉచిత విద్యుత్తు అందిస్తున్నామన్నారు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను దళితుల సద్వినియోగం చేసుకోవాలన్నారు ఎస్సీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అధిక స్థాయిలో ప్రజలు కేటాయిస్తున్నామని తెలిపారు అంబెడ్కర్ స్ఫూర్తి తో తెలుగు దేశ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారు ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు రాజాం రమేష్ కుమార్ జడ్పీటీసీ సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు మండల పార్టీ అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు మార్కెట్ కమిటీ చైర్మన్ దూల్ రంగనాయకుల సర్పంచ్ మాధురి తెదేపా జిల్లా కార్యదర్శి తులసీరామ్

బస్టాండ్‌లో భయం.. భయం...

మాడుగుల, న్యూస్‌లీడర్: రాత్రి తొమ్మిదయ్యిందంటే మాడుగుల బస్టాండ్‌లో కొంతమంది మద్యం సేవించి ఘర్షణలకు దిగుతున్నారు. బస్సు దిగి ఇంటికి చేరుకునే ప్రయాణికులకు, మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పోలీసులు అల్లరి చేస్తున్నవారిని పట్టుకొని హెచ్చరికలు జారీ చేస్తున్నా మందుబాబులు పట్టించుకోవడంలేదు. వారం క్రితం కృష్ణంపాలెం గ్రామంలో జరిగిన తీర్థంలో మాడుగులకు చెందిన యువకులకు కృష్ణంపాలెం గ్రామానికి చెందిన వారికి తీవ్ర ఘర్షణ జరిగి కొట్లాటకు దారితీసింది. వీరందరికి మాడుగుల ఎస్ఐ రాజాన ధనుంజయ్ మీ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. మరికొంత మంది యువకులు లైసెన్సులు లేకుండా వేగంగా బైకులు నడుపుతూ ప్రజలకు భయాన్ని కలిగిస్తున్నారు. మరికొంత మంది యువకులు టిక్కెట్ బెట్టింగులకు పాల్పడుతూ గెలవలేక లక్షలాది రూపాయలు అప్పులు పాలవుతున్నారు. రాత్రి అయ్యేసరికి పోలీసులు బస్టాండ్ ఆవరణలో గస్తీ ఏర్పాటు చేస్తే మద్యం బాబుల ఆగడాలను అరికట్టవచ్చునని, టిక్కెట్ బెట్టింగులు నిర్వహిస్తున్నవారిపై ప్రత్యేక దృష్టిపెట్టి పూర్తిగా విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాడుగుల ప్రజలు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ



విశాఖపట్నం,న్యూస్‌లీడర్: విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలం రేబాక సీహెచ్ ఎన్ అగ్రహారం సమీపాన టైర్లు కంపెనీ లో జరిగిన అగ్ని ప్రమాదంలో 6 గురు కార్మికులలో 4 గురు పరిస్థితి విషమంగా ఉందని వారికి విశాఖ కింగ్ జార్జ్ హాస్పిటల్ వైద్యులు మెరుగైన వైద్యం సహాయం అందిస్తున్నా మరింత వైద్య సదుపాయాలు కల్పించాలని సిపిఐ డిమాండ్ చేసింది.బుధవారం సిపిఐ గ్రేటర్ విశాఖ నగర కార్యదర్శి మరుపిళ్ల పైడి రాజు నాయకత్వాన జిల్లా కార్యవర్గ సభ్యుడు డి మార్కండేయులు, నగర సహాయ కార్యదర్శులు కె సత్య అంజనేయ జె డి నాయుడు పైలా ఈశ్వరరావు కె జి హెచ్ లో అగ్ని ప్రమాదవార్డ్ కి వెళ్లి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారుచికిత్స పొందుతున్న సియ్యాద్రి శ్రీను యూ గోవింద్ టి గోపి ల పరిస్థితి విషమంగా ఉందని వారికి వారితో పాటు మిగిలిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.4 సం రాలుగా ఎటువంటి అనుమతులు లేకుండా ఎటువంటి ప్రమాద రక్షణలు తీసుకోకుండా నిర్వహిస్తున్న టైర్లు కంపెనీ పై తక్షణ చర్యలు తీసుకోవాలని కంపెనీ యజమానిని అదుపులోకి తీసుకొని ప్రమాదానికి గురైన కార్మికులకు నష్టపరిహారం కింద ఒక్కొక్కరికి 20 లక్షల రూపాయలు ఇప్పించాలని డిమాండ్ చేసారు

స్కూల్ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు

పెందుర్తి, న్యూస్‌లీడర్: పెందుర్తి నియోజక వర్గ పరిధిలో పలు స్కూలు భవనాలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు . దీమలపల్లి జిల్లా పరిషద్ వున్నత పాఠశాల అదనపు నూతన తరగతుల భవనాన్ని , అదేవిదంగా వేపగుంట లో ఉన్న జిల్లా పరిశద్ వున్నత పాఠశాలకు చెందిన తరగతిగదులని కుడా ప్రారంభించారు. అక్కడ 42 లక్షల రూపాయల ప్రభుత్వ నిదులతో నిర్మించారు . మొత్తం మీద సుమాలు 80 లక్షల రూపాయలతో వీటిని నిర్మించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తోందని, పేద విద్యార్థులకు, ప్రైవట్ విద్యకు దీటుగా, ప్రభుత్వ పాటశాలలలో చదువులు చెబుతున్నారని , వాటిని ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని బండారు అన్నారు . అదేవిదంగా, ప్రభుత్వంలో విద్యకు చాలనిధులు ఉన్నాయి , వాటిని వినియోగించుకొని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్య క్రమంలో పెందుర్తి ఎం పి పి రెడ్డి వరలక్ష్మి, చింతల అగ్రహారం సర్పంచ్ డి పైడికోట , టీ డీ పీ గ్రామా అధ్యక్షుడు ఎం సూరిబాబు, స్కూలు కమిట చైర్మన్ బొడ్డేటి జగదీశ్, టీ డీ పి నాయకులు గంటల పెంటారావు, బాలాజీ రాము, రామ రాజు, కారక దేముడు తదితరులు పాల్గొన్నారు .

జీవీఎంసీ పాఠశాలలో వీడ్కోలు వేడుకలు



మల్కాపురం, నూస్‌లీడర్: మల్కాపురం జీవీఎంసి 48 వార్డు ప్రకాశ్ నగర్ జీవీఎంసి హై స్కూల్‌లో 10 వ తరగతి విద్యార్థులు వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకులకు ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే పి గణబాబు హాజయ్యారు. అయన మాట్లాడుతూ ప్రకాశ్‌నగర్ జీవీఎంసి హై స్కూలు ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించి మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. జీవీఎంసి పాఠశాలలకు అవసరమైన సదుపాయాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ యాజమాన్యం కూడా పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 49 వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షడు మజ్జి సోమేష్, జీవీఎంసి హై స్కూలు కమిటీ చైర్మన్ కోరిబిల్లి రాము, డేవిడ్, జైశంకర్, శ్రీలక్ష్మి, జోజి, జీవీఎంసి హై స్కూలు హెడ్ మాస్టర్ కె .వి .సుబ్బారావు అధ్వర్యంలోఈ కార్యక్రమం నిర్వహించారు .

మైన్స్ లీజుదార్లు, వాహన యాజమానులపై చర్యలు తీసుకోవాలి



హెచ్‌సికి ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

నాతవరం, న్యూస్‌లీడర్: సరుగుడు పంచాయతీకు రావలసిన డిఎంఎఫ్ నిధులు చెల్లించిన తర్వాత మైన్స్ తవ్వకాలు జరపాలని, ఆర్‌అండ్‌బి రోడ్డులో సుమారుగా 20 టన్నుల పైగా బరువుతో వాహనాలను అడ్డుకట్టవేయాలని డిమాండ్ చేస్తూ నాతవరం పోలీస్‌స్టేషన్‌లో వైసిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పెట్ల ఉమాశంకరగణేష్ మాట్లాడుతూ నాతవరం మండలం సరుగుడు పంచాయతీలో గత కొంత కాలంగా మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. మైనింగ్ తవ్వకాలు జరిపే ముందు ఒక టన్నుకు రూ.43 చొప్పున డిఎంఎఫ్‌ను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటికి సుమారుగా 5లక్షల మైన్స్ తరలించుకు పోయారన్నారు. అంటే సుమారు 2కోట్ల 15లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించి ఉన్నట్లయితే అందులో సరుగుడు గ్రామ పంచాయతీకు 50 శాతం అనగా సుమారు రూ.కోటికి పైగా ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ ఒక్క రూపాయి కూడా సరుగుడు పంచాయతీకి రాలేదన్నారు. ఈ విషయమై జనవరి 18వ తేదీన నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వెంటనే సరుగుడు పంచాయతీకు రావలసిన డిఎంఎఫ్ నిదులను విడుదల చేయాలని,లేనిపక్షంలో సరుగుడు ప్రాంత ప్రజలతో మైన్‌డు అడ్డుకోవడం జరుగుతుందని తెలియజేశామన్నారు. జనవరి 29న సరుగుడు పంచాయతీలో మైన్స్ రవాణా చేయడంతో మించిన బరువుతో వాహనంలు వెళ్లడం వలన ఆ ప్రాంతంలో ఉన్న రోడ్లన్నీ పాడైపోతున్నాయని వెంటనే మైన్స్ యాజమానులు, రవాణా వాహనాలపై చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవోకు మరలా ఫిర్యాదు చేశామన్నారు. అయితే వారు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. కావున మైన్స్ లీజుదార్లను, వాహన యాజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే అందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం నాతవరం హెచ్‌సి గోవిందరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అంకంరెడ్డి జమీలు, వైసిపి మండల అధ్యక్షులు శెట్టి సూకరాజు, మండల వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవీధిలో సీసీరోడ్డు నిర్మాణం



రాజవీధి వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు

మాడుగుల, న్యూస్ లీడర్: ఎన్నో సంవత్సరాలుగా కేజేపురం మెయిన్‌రోడ్డులో రాజవీధి చేనీ దగ్గర రహదారిలో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి ఆ వీధి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమస్యను గుర్తించి సర్పంచ్ పెంటకోట అప్పారావు అధ్వర్యంలో సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ వీధికి చెందిన కొంత మంది మాట్లాడుతూ ఈ రోడ్డు వేయడం ద్వారా మురికినీటి సమస్య పోతుందని వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మిస్తున్న పంచాయతీ సర్పంచ్‌కు, వార్డు సభ్యులకు వారు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

48వ వార్డులో చంద్రన్న బీమా అందజేత



మల్కాపురం, న్యూస్‌లీడర్: మల్కాపురం జీవీఎంసి 48 వార్డు ఇందిర కాలనీ చెందిన దాడి కృష్ణ మంగళవారం కరెంటు షాక్ తో మృతి చెందిన దాడి కృష్ణ కుటుంబ సభ్యు లకు 48 వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కోరిబిల్లి రాము , మరియు జన్మ భుమి కమిటీ జయశంకర్ ,డేవిడ్ చెతులు మీదగా 5000 చంద్రన్న బీమా అందజేశారు ,495000 ఎమ్మెల్యే పి .గణబాబు చేతులు మీదగా కొన్ని రోజులో అందజేస్తుంటారు

కరాటేలో భాష్యం విద్యార్థుల ప్రతిభ ..



ఎన్‌ఏడీ, న్యూస్‌లీడర్: భాష్యం పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈమేరకు ఈ నెల 16 నుండి 18 వరకు జరిగిన స్వర్ణభారతి స్టేడియంలో ఆలిండియా బుడోకాన్ కరాటే పోటీల్లో 25-30 కేజీల విభాగంలో ఆరో తరగతి చదువుతున్న పి వంశీకృష్ణ, 35-40 కేజీల విభాగంలో ఏడో తరగతి చదువుతున్న డి జ్యోతి వెండి పథకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కే మణికంఠారెడ్డి విద్యార్థులను అభినందిస్తూ భాష్యం విద్యార్థులు ఇటు చదువులోనే కాకుండా అటు క్రీడల్లోనూ రాణించడం తమకెంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాష్యం విశాఖ జోనల్ ఇన్‌ఛార్జ్ కె. వెంకట్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పసుపురెడ్డి కృష్ణవంశీ, జ్యోతి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం .

ఎన్‌ఏడీ, న్యూస్‌లీడర్: స్థానిక జీవీఎంసీ 67వ వార్డు బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న డోలా శ్రావణి పెందుర్తి కళాశాలలో చదువుతూ తిరుపతిలో జరుగుతున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శ్రావణికి తిరుపతి వెళ్ళేందుకు టీడీపీ అర్బన్ నగర కార్యదర్శి బొమ్మిడి రమణ రూ.ఐదువేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా తగిన ప్రతిభ ఉన్నవారు ఆర్థిక స్తోమత . లేని వారికి తమ వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.



స్కాట్‌తో శరీర, మానసిక ఆరోగ్యం



మాట్లాడుతున్న చైర్మన్ మలసాల

కశింకోట, న్యూస్‌లీడర్: కశింకోట ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం భారత స్కాట్ అండ్ గైడ్స్ థింకింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఈసీఎస్ ఛైర్మన్ మలసాల రమణారావు పాల్గొని స్కాట్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వృత్తివిద్య కోర్సులలో బాగా నైపుణ్యం కలిగి ఉండాలని, ఆర్ఈసీఎస్ వినియోగదారుల పిల్లలకు 50శాతం సీట్లు కల్పిస్తున్నామన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో పాలిటెక్నిక్ కళాశాల పెట్టడం వినియోగదారుల పిల్లల అదృష్టమన్నారు. ఈ స్కాట్ ద్వారా శరీరంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. జనవరి 26 రిపబ్లిక్‌డే రోజున విజయవాడలో జరిగిన పెరేడ్‌లో పాల్గొన్న విద్యార్థులు సుమారు పది మందికి ప్రశంసాపత్రాలు అందించారు. స్కాట్ వ్యవస్థాపకులు బేడిల్ పవల్ భార్య లేడీ బేడిల్ పవల్ ఇద్దరూ ఫిబ్రవరి 22న పుట్టిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాశంకర్, కొణతాల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఛలో విజయవాడను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్: యాదవ కార్పొరేషన్ ఏర్పాటు యాదవ జాతి ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోరుతూ అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తదీన విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు జరిగే రాష్ట్ర యాదవ గర్జనను జయప్రదం చేయాలని విశాఖజిల్లా యాదవ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి నబ్బి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. గురువారం ఉదయం స్థానిక చోడవరం రోడ్డులో గల యాదవసంఘం కార్యాలయంలో జిల్లా యాదవ సంఘం నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు యాదవులకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా పరిష్కరించాలని ఆయన కోరారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది వెయ్యి కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. రాష్ట్ర రాజధానిలో యాదవుల భవనం నిర్మించి ఇవ్వాలన్నారు. నిరుపేద యాదవ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో యాదవ విద్యార్థులకు హాస్టల్ భవనాలు నిర్మించి ఇవ్వాలన్నారు. విదేశాలు వెళ్లి చదువుకునే యాదవ విద్యార్థులకు పది లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. యాదవ విద్యార్థులకు యాదవ కార్పొరేషన్‌లో ఉద్యోగ మేళా నిర్వహించాలన్నారు. యాదవ యువతీ యువకులకు 75శాతం సబ్సిడీతో డెయిరీ ఫారాలు ఏర్పాటు చేయుటకు రుణాలివ్వాలన్నారు. యాదవ యువతకు కార్లు, ఆటోలు నడుపుకొనుటకు సబ్సిడీపై రుణాలు ఇవ్వాలన్నారు. యాదవ యువతకు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలన్నారు. పేద యాదవ మహిళకు కల్యాణ లక్ష్మి పథకం కింద ఐదు లక్షల రూపాయలు కేటాయించాలని ముఖ్యమైన డిమాండ్స్‌తో బ్రోచర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచదార్ల సూరిబాబు, వియ్యపు సింహాచలం, వాయిబోయిన శేఖర్ యాదవ్, బొట్టా పద్మావతి, మొల్లి వెంకటరమణ, పల్లా అర్జున్, బాలిబోయిన రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులులేక వలసపోతున్న గిరిజనులు



వలసవెళ్తున్న గిరిజనులు

మాడుగుల, న్యూస్‌లీడర్: ఉపాధి పనులు లేకపోవడంతో వందలాది మంది గిరిజనులు దేవపురం, కాముగెడ్డ, పులుసు మామిడి, బిల్లలపాలెం, అర్జాపురం గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు ఉపాధి పనులు లేకపోవడంతో తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు కూలిపనులు చేయడానికి వలస వెళ్లిపోతున్నారు. గురువారం ఉదయం కొంత మంది గిరిజనులు మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ఉపాధి పనులు లేవని, కొన్ని దినాలు పనిచేసినా డబ్బులు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బయట ప్రాంతాలలో వ్యవసాయ కూలీగా పనిచేస్తే రోజుకు మూడు వందల రూపాయల వరకు వస్తుందన్నారు. గిరిజన ప్రాంతాలలో వ్యవసాయం చేయడానికి నీటి సదుపాయంలేదని, దాని కారణంగా పొలాలు ఎండిపోతున్నాయని చెప్పారు. ప్రస్తుతం కుటుంబాలతో కలిసి బయట ప్రాంతాలకు వెళ్లి పోతున్నామని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజనులకు పూర్తి స్థాయిలో ఉపాధి పనులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వృద్ధులకు ప్రత్యేక ఓపీ కౌంటరు ఏర్పాటు చేయాలి

రోగులకు సరిపడా మందులు వైద్యాలయంలో అందుబాటులో ఉంచాలి

అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంనకు రోజుకు తీవ్ర అనారోగ్యాలతో 1500 మందికి పైగా స్త్రీ, పురుషులు, వృద్ధులు పరీక్షల నిమిత్తం రావడం జరుగుతుందని వయో వృద్ధుల వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. ఆస్పత్రికి వివిధ గ్రామాల నుంచి వచ్చే వృద్ధులకు వైద్యులను సంప్రదించి వైద్యం పొందేకంటే చీటిలు రాయించుకోవడానికే రోజంతా సరిపోతుందని దీంతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న వృద్ధులు దిక్కుతోచని పరిస్థితిలో వైద్యం పొందకుండా వెనక్కి పోతున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నాం ఒంటిగంట వరకే వైద్యసదుపాయం అందుతుండడం వలన ఓపీ చీటీలు రాసుకునేందుకే ఈ సమయమంతా సరిపోతుందని వైద్యులను సంప్రదించి వారి యొక్క సమస్యలను చెప్పుకొని చికిత్సలు పొందేందుకు అవకాశం లేకుండా పోతుందని ఆయన అన్నారు. సామాన్య పేద ప్రజలు మందులు కొనుక్కొలేని పరిస్థితుల్లో ఎన్టీఆర్ వైద్యాలయానికి వస్తే మందులు లేవని అక్కడ ఉన్న సిబ్బంది చెబుతున్నారని ఇది చాలా అన్యాయమన్నారు. మెడికల్ ప్రధాన అధికారి చొరవ తీసుకొని రోగుల అవసరాలకు సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని అయన కోరారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న రోగులు ప్రైవేటు మందుల షాపుల్లో మందులు కొనుక్కొనే పరిస్థితులు దాపరిస్తున్నాయని అయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో ఎన్. ఉమా మహేశ్వరరావు, కె. సూకరాజు, ఎం.విజయ్, కె. శ్రీను, జి. సాంబమూర్తిరాజు, ఎం.నాగేశ్వరరావు, ఎ.రామారావు తదితరులున్నారు.

ప్రశాంతంగా టెట్

విజయనగరం, న్యూస్‌లీడర్ : ఉపాధ్యాయ అర్హత ప్రవేశపరీక్ష (టెట్‌కు) 2017 మంది అభ్యర్థులు హాజరయ్యారు. బొబ్బిలిలోని స్వామివివేకనంద ఇంజినీరింగ్ కళాశాల, కొత్తవలసలోని కోస్టల్ ఇంజినీరింగ్ కళాశాల, భోగాపురం మండలంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాల, విజయనగరంలోని సత్యా ఇంజినీరింగ్ కళాశాల, అయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో ఆన్‌లైన్ విధానం ద్వారా పరీక్ష నిర్వహించారు. జిల్లా మొత్తంగా 2140 మంది హాజరు కావాల్సి ఉండా, 2027 మంది హాజరయ్యారు. 113 మంది గైర్హాజరయ్యారు.

వైభవంగా మాతృదినోత్సవ వేడుక



పద్యాలకు పద్యలలో భావార్థాలు వివరిస్తున్న ఫణిశయన సూరి

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: తేటతెనుగుదనం కవన కుతూహలమైంది.ప్రదంధ కావ్యాల్లోని పద్యాలు రేపటి పౌరుల గొంతుల్లోంచి ఖంగు ఖంగుమని విన్పించాయి. అక్కడ తల్లి భాషాభిమానం తేజరిల్లింది. బుధవారం సాయంత్రం పరవస్తు పద్యపీఠం అధ్వర్యాన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుక ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో వైభవంగా జరిగింది. ముఖ్య అతిథి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పివీ జ్యోతిర్మయి ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతృభాషపై పట్టు సాధించిన నాడే మానవాళి మనుగడ ప్రగతి బాటలో పయనిస్తుందన్నారు. తెలుగు భాషాభివృద్ధికి కృషిచేసేవారికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. వేమన, ఆముక్తమాల్యద 'జెండాపై కపిరాజు' వంటి పద్యాలలోని రసరమ్యతను సూరి తనదైన శైలిలో అద్భుతంగా వివరించి సభాసదుల మెప్పు పొందారు. పద్యాలకు అర్థాలు విశ్లేషించే క్రమంలో సమకాలీన సమాజానికి అనువుగా సందర్భోచితమైన చెణుకులు విసిరి ఆద్యంతం ప్రసంగాన్ని రక్తి కట్టించారు.ఏయూ విశ్రాంతాచార్యులు ఎస్. బాబు సభా వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

శ్రీకృష్ణా విద్యామందిర్ పాఠశాలలో.....

కృష్ణా విద్యా మందిర్ పాఠశాలలో మాతృభాషా దినోత్సవం వేడుకలు ఉత్సాహంగా జరిగాయి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డాక్టర్ మీగడ రామలింగ స్వామి హాజరయ్యారు. మాతృభాష తల్లివంటిదని, మాతృభాష రానివారికి ఇతర భాషలపై పట్టు వుండదన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు కె.రాఘవాచార్యు , పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీవీ. నాగేశ్వరదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న మీగడ రామలింగ స్వామి

విజ్ఞాన్‌కు ఎంఎస్‌ఎంఈ ఇంక్యుబేషన్ కేంద్రం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : దువ్వాడలో గల విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళావాలకు మధ్య, చిన్న, సూక్ష్మ సంస్థల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి ఎంఎస్‌ఎంఈ మినిస్ట్రీ ఇంక్యుబెషన్ కేంద్రం మంజూరైనట్టు కళాశాల ప్రతినిధులు ప్రొఫెసర్ ఆర్పీ.దాస్, డాక్టర్ ఎ.నాగజ్యోతి తెలిపారు. కళాశాలలో ఉన్న వసతులు, అధ్యాపకులు నైపుణ్యాలు, ఆధారంగా ఇంక్యుబేషన్ కేంద్రం మంజూరైనట్టు వారు తెలిపా రు. ఈ స్కీమ్ ద్వారా కళాశాలలోని విద్యార్థులు, అధ్యాపకులతో పాటు ఇతర కళాశాలల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యా వేత్తలకు లబ్ధికలుగుతుందని ఆయన వివరిం చారు.ఈ సారి ఏపీ నుంచి రెండు సంస్థలకు మాత్రమే ఈ కేంద్రం మంజూరైనట్టు ప్రతినిధలు తెలి పారు.

పేదలకు పథకాల బాధ్యత సాధికార మిత్రలదే

వీడియో కాన్ఫరెన్స్‌లో చంద్రబాబునాయుడు



విజయనగరం, న్యూస్‌లీడర్ : రాష్ట్రంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత సాధికార మిత్రలపైనే ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. అమరావతి నుంచి సాధికార మిత్రలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు అండగా ఉంటామని, అన్ని విధాలా చేయూతనిస్తామని, గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్ర విభజన, నవనిర్మాణ దీక్ష, జన్మభూమి-మాఊరు, చంద్రన్నబీమా, పింఛన్లు, పరిష్కార వేదిక, బయోమెట్రిక్ విధానం, జలభద్రత, గృహభద్రత, గృహ నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, ఆరోగ్యభద్రర, చంద్రన్నపెళ్లికానుక తదితర అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నది, లేనిది సాధికార మిత్రలు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు, పిల్లలు ఆదాయ ధృవపత్రం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఆఫీసులు చుట్టూ తిరిగేవారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. స్వయం సహాయ సంఘాల్లో 90లక్షల మంది సభ్యులు ఉన్నారని, ఒక్కొక్క సభ్యురాలికి రూ.10వేలు పెట్టుబడి నిధి ఇస్తామని, ఇప్పటికే రూ.6వేలు ఇచ్చామని, మార్చి నెలలో మరో రెండువేలు అందిస్తామని తెలిపారు. రైతు రుణమాఫీలో భాగంగా మిగిలిన లక్ష రూపాయలు నాలుగు వాయిదాల్లో 10శాతం వడ్డీతో చెల్లిస్తామన్నారు. ఎవరికైనా సకాలంలో రేషన్ బియ్యం అందకపోతే సంబంధిత డీలరును రియల్ టైమ్ గవర్నన్స్ 1100 ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉత్తమ విద్యార్థులుగా రాణించాలి



నృత్య ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : డివైన్ టచ్ ప్లే స్కూల్ ఏడవ వార్షికోత్సవం వుడా చిల్డ్రన్ ఎరినా థియేటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉత్తమ విద్యార్థులుగా రాణించాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మీ అందరిపై వుందని హితవు పలికారు. అనంతరం విద్యా ర్థులు ప్రదర్శించిన నృత్యా లు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్ర మంలో ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షుడు సాంబదాస్, స్కూల్ ప్రిన్సిపాల్ నేహాదాస్, ఇస్కాన్ పిఆర్వో ఎంవీ. రాజశేఖర్, స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పరీక్షలపై సమగ్ర విచారణ జరిపించాలి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ ఆంధ్రాయూనివర్శిటీలో ఒక్కడి కోసం మళ్లీ పరీక్ష నిర్వహించడం దారుణమని అన్నారు. మెయిన్ గేట్ వద్ద వైఎస్ఆర్ ఎస్‌యూ అధ్వర్యంలో ధర్నా జరిగింది. దీనిని ఉద్దేశించి స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు మాట్లాడుతూ జీఎస్ఎస్.వెంకటేష్ అనే ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్, 2014 బ్యాచ్‌కు చెందిన విద్యార్థికి బి.టెక్ సెకండియర్ ఎలిమెంట్స్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సబ్జెక్ట్ మిగిలిపోయింది. మూడేళ్ళు నుంచి రాస్తున్న పూర్తికాకపోవడంతో అధికార పార్టీ ఎమ్మెల్యే ఒత్తిడితో పరీక్షలు నిర్వహించడం సిగ్గుచేటని అన్నారు. ఒక వ్యక్తి కోసం పరీక్ష నిర్వహించడం చూస్తే రిజిస్ట్రార్ ఎంత బరితెగించారో అర్థం అవుతుందని విమర్శించారు.అధికార పార్టీ ఎం.ఎల్.ఏ వెలగపూడి రామక్రిష్ణబాబు అండ చూసుకుని రిజిస్ట్రార్ ఆంధ్రాయూనివర్శిటీలో రెచ్చిపోతున్నారని, ఇది తెలుగుదేశం పార్టీ కార్యాలయం అడ్డాగా మారిపోయిందన్నారు. రిజిస్ట్రార్ మేధావులను తయారుచేసే విశ్వవిద్యాలయాలను రాజకీయ కలుషితం చేశారని అన్నారు. రిజిస్ట్రార్ అధికారా! తెలుగుదేశం పార్టీ తొత్తా అర్థం కావడం లేదు. రాజకీయ మీద అంత ఆసక్తి వుంటే రిజిస్ట్రార్‌గా మానేసి, పసుపు చొక్కా తొడుక్కొని చెయ్యాలనే తప్ప, విద్యా వ్యవస్థను విషపూరితం చేయొద్దన్నారు. వీసీకి తెలియకుండా ఇలా జరుగుతుంటే వీసీ కళ్ళు మూసుకొని పోవడం దారుణమన్నారు. యువజన విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి తుల్లి చంద్రశేఖర్ యాదవ్ ఈ విషయంలో వి.సి. జోక్యం చేసుకుని బాధితులపై చర్యలు తీసుకోవాలన్నారు. .ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, యువజన విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి తుల్లి చంద్రశేఖర్ యాదవ్, సన్నపు కుమారస్వామి, జి.నాని, ప్రసాద్‌రెడ్డి, సతీష్, సాయికిరణ్, సాయిక్రిష్ణ, చిన్నబాబు, కార్తీక్, శ్రీకాంత్, మణి, వంశీ, బాలాజీ, జయ, అంజి, అధిక సంఖ్యలో విద్యార్థులో పాల్గొన్నారు.


నిరసన చేస్తున్న వైఎస్ఆర్ ఎస్‌యూ విద్యార్థులు

సాయం అందించడం మానవ ధర్మం

పోర్టుట్రస్టు చైర్మన్ కృష్ణబాబు

పార్వతీపురం, న్యూస్‌లీడర్ : పార్వతీపురం కేంద్రంగా జట్టు ఆశ్రమం నడిపిస్తు పద్మజ మానవధర్మాన్ని తు.చ. తప్పకుండా నిర్వర్తిస్తున్నారని, ఒక మనిషికి సాయం అందించలేని మానవజన్మకు సార్థకత ఉండదని విశాఖ పోర్టు ట్రస్టు చైర్మన్ టి.కృష్ణబాబు అన్నారు. పార్వతీపురం లోని జట్టు ఆశ్రమంలో జట్టులో పెరిగి తమ కాళ్లపై తాము నిలవగలిగే స్థాయికి చేరిన పిల్లలు ఏర్పాటుచేసిన రసాయనాలు లేని పచ్చళ్ల తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మాటసాయం మానవధర్మం. మనిషిగా సాటి మనిషికి సాయం అందించడం అందరి బాధ్యత అన్నారు. తాను కలెక్టరుగా పనిచేసిన కాలంలో మండలపరిషత్తు అధికారిణిగా పద్మజ పనితీరు ఏమిటో తనకు తెలుసునని అన్నారు. అందుకే తనను ఆశ్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించిన వెంటనే మరో ఆలోచన లేకుండా వచ్చేందుకు అంగీకరించానని అన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రోగాలు లేని సమాజాన్ని నిర్మించేందుకు టి.విజయ్‌కుమార్ బాధ్యతగా వ్యవహరిస్తున్నారని, ఆయన అడుగుజాడల్లో ప్రకృతివ్యవసాయం విస్తారంగా సాగుతుందన్నారు. రూ.10లక్షల నుంచి రూ.15లక్షలు వరకు సామాజిక బాధ్యత నిధులతో వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో. ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధిశిక్షణ విభాగం అధికారి టి.ఫణికుమార్, గ్రామబజార్ జాగరణ్ సంస్థ వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్, జట్టు పారినాయుడు, పద్మజ, కెనరా బ్యాంకు ప్రబంధకుడు రవికుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉగాదికి తీపికబురు

ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

అమరావతి: ఏపీ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉగాదికి ముందుగానే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు అందించింది. డీఏ 2.096 శాతం విడుదల చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 2017 జనవరి నుంచి 2018 మార్చి వరకు దాదాపు 15 నెలల డీఏ కోసం రూ.1048 కోట్లు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే పోలవరం కాంక్రీట్ పనులు చేపట్టిన నవయుగ కంపెనీకి రూ.1244 కోట్ల పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. అంతేకాకుండా విద్యాధరపురంలో ఉర్దూ జూనియర్ కాలేజీకి ఎకరా స్థలం కేటాయించారు. ఏసీబీలో 350 పోస్టులు భర్తీ, విజయవాడలోని గన్నవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు 25 పోస్టులు భర్తీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

మధ్యాహ్న భోజన బకాయిలు చెల్లించాలి

విజయనగరం, న్యూస్‌లీడర్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం బకాయిఉన్న రూ.20 కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ఆధ్వర్యాన కార్మికులు కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్ష చేపట్టారు. దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఉమా మహేశ్వరి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం పట్ల, కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కోట్లాది రూపాయలు బిల్లులు చెల్లించకుంటే నిర్వహణ ఎలా చేయగలరని ఆమె ప్రశ్నించారు. కేంద్రంలో మోడి, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా విద్యార్థుల మెస్‌ఛార్జీలను మాత్రం పెంచడంలేదని అన్నారు. అయినా అనేక ఇబ్బందులకు ఓర్చి మహిళలు సామాజిక బాధ్యతగా పథకాన్ని ప్రభుత్వ స్కూలులో అమలు చేస్తున్నారన్నారు. మరోవైపు వారితో వెట్టిచాకిరి చేయించుకోవడం తప్ప వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. తక్షణమే కార్మికులకు రూ. 5వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు రిలే నిరాహారదీక్షలో కూర్చున్న కె. సరస్వతి, టి.ఆదిలక్ష్మి, బోగి రమణమ్మ, పి. ఈశ్వరమ్మ, బి. రమణమ్మ, ఎస్ రమణమ్మలకు పూలదండలు వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, నాయకులు బి.రమణ తదితరులు పాల్గొన్నారు.


రచ్చబండలో మాట్లాడుతున్న వైకాపా నేతలు తిలక్ తదితరులు

జాబు రావాలంటే బాబు పోవాలి

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ : ఇంటింటికీ ఉద్యోగంతో పాటు వృద్ధులకు పింఛన్ ఇస్తామని ఓటేయించుకొని నాలుగేళ్ళుగా మోసగిస్తున్నారని పలువురు యువకులు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని దీపుర్లపాడు పంచాయతీలోని దుర్గంపేట, ఊడికలపాడు, వరహాలమ్మపేట, దీపుర్లపాడు గ్రామాల్లో నిర్వహించిన రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమానికి టెక్కలి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త పేరాడ తిలక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఎస్. హేమసుందరరాజు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బోయిన నాగేశ్వరరావు, వైకాపా నాయకులు నేతింటి అప్పలస్వామి, కాకి లక్ష్మణరావు, నేతింటి ఎర్రన్నాయుడు, నేతింటి చిన్నబాబు, నేతింటి అప్పన్న, వాన రామదాసు, శిల్లా హరి, నెయ్యిల సురేష కుమార్, శిల్లా కుమార్, సిదపాన గోపి, పి. చెంచునాయుడు, శిమ్మ లక్ష్మణరావు, చల్ల రాంబాబు, షేక్ మహమ్మద్‌రాజు, అన్నెపు రామారావు, కవిటి రామరాజు, కాళ్ళ సంజీవరావు, దుబ్బ వెంకటరావు, పేదాడ వెంకటరావు, కె.దాలెప్ప, రోణింకి మల్లేశ్వరరావు, రొక్కం తులసీదాస్ పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు అందించాలి

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ రెడ్‌క్రాస్ సంస్థలో స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు వచ్చిన వలాంటీర్లు అత్యవసర పరిస్థితిల్లో సహాయకచర్యలు అందించాలని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక మండలపరిషత్ సమావేశమందిరంలో వలాంటీరులకు రెండురోజులు పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వక పోతే నిరవధిక దీక్ష



దీక్షకు మద్దతు ఇస్తున్న వైసీపీ నేతలు

శృంగవరపుకోట, కొత్తవలస, న్యూస్‌లీడర్ : శృంగవరపుకోటలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే నిరవధిక దీక్షలు చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. దీక్షల్లో కూర్చున్న నాయకులకు ఎర్రకండువాలు వేసి తమ్మినేని ప్రారంభించారు.

సీపీఎం పోరాటానికి వైసీపీ మద్దతు

సీపీఎం నాయకులు చేపట్టిన దీక్షలకు వైసీపీ నాయకులు మద్దతు తెలిపారు. వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్ రహమాన్, రైతు సంఘం నాయకులు బి.బాబూరావు శిబిరాన్ని సందర్శించారు.

భ్రూణ హత్యల నివారణపై సదస్సు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : పైడా నర్సింగ్ కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ అధ్వర్యంలో గర్భస్థ మహిళా భ్రూణ హత్యల నిరోధంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును జిల్లా యువజన సంక్షేమశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింగ వివక్షత వుండకూడదన్నారు. మహిళలను గౌరించాలని సాంకేతిక కారణాలతో మహిళా శిశు భ్రూణ హత్యలు చేయకూడదన్నారు. ఈ కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రాజేశ్వరి, డాక్టర్ డి.వి.రమణ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యల్లారమ్మ జాతర

విజయనగరం, జామి, న్యూస్‌లీడర్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా పేరు గాంచిన జామి ఎల్లారమ్మ జాతర గురువారం అత్యంత వైభంగా ప్రారంభమైంది. ఇందుకు గాను అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. మూడు రోజులు జరిగే ఈ జాతర గురువారం తొలేళ్ల సంబరంతో ప్రారంభమవుతోంది. శుక్రవారం తీర్థమహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. శనివారం చిన్న తీర్థంతో ఎల్లారమ్మ జాతర ఉత్సవాలు ముగుస్తాయి. ఈ నేపథ్యంలోనే ఉత్సవాలను ఆలయ అధికారులు అన్ని ఏర్పా టు చేశారు. ఇప్పటికే అమ్మవారికి ముడుపులు చెల్లించేందుకు భక్తులు తరలి రాగా, స్థానికంగా వున్న ప్రజలు సైతం అమ్మవారికి మొక్కుబడులను తీర్చుకుం టున్నారు. ఈ జాతరకు తెలంగాణా, చత్తీష్‌ఘడ్, ఒడిస్సా, జార్కండ్, కర్నాట క, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు ఏటా వస్తుంటారు సారి సందర్శకుల తాకిడి ఎక్కువగానే ఉంది.

బాధితుడికి రూ.లక్ష సాయం అందజేత




బొబ్బిలి, న్యూస్‌లీడర్ : ఇంటర్ చదువుతున్న బొబ్బిలి పట్టణానికి చెందిన పి.శంకరరావుకు అనుకోకుండా రెండు కిడ్నీలు పాడయ్యాయి. వైద్యులు తక్ష ణం శస్త్రచికిత్స చేయాలని చెప్పడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తు న్నారు. తల్లిదండ్రులు రమణ, సీతలు నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో కుమారుడికి మెరుగైన వైద్యం అందించలేకపోతున్నారు. అభ్యు దయ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు కూర్మినాయుడు, శారద స్పం దించి రూ.లక్ష పోగుచేశారు. సంస్థలో చదువుతున్న విద్యార్థులు కూడా స్పం దించడంతో తలోకొంత పోగుచేసి కిడ్నీరోగికి అందజేసి ఉదారత చాటుకున్నారు.

మరుగుదొడ్డి నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలి

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ మండలంలో ప్రతి గ్రామాల్లో విడిగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి ఎం. రేణుక, తహశీల్దార్ వాన శివబ్రహ్మానందం అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో మాట్లాడుతూ మండలంలో సుమారు 19వేలు కుటుంబాలు ఉండగా అందు లో 9వేలు వరకు మరుగుదొడ్లు ఉన్నాయని, మిగిలిన కుటుంబాలు నిర్మిం చుకోవాల్సి ఉందని. ఇప్పటికే అన్ని గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించి, పూర్తన మరుగుదొడ్లుకు వెంటనే బిల్లులు చెల్లించేటట్లు కృషి చేయాలన్నారు. అలాగే ఇప్పటికే ఉపాధి హామీ పనులు ప్రారంభించి వారం పనిచేసి అపేశారని, వెంటనే ఉపాధి హామీపనులు ప్రారం భించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ జి. హరిప్రభాకర్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు..


విలేకర్లుతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రేణుక

గుట్కా అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితుల పట్టివేత


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రఘువీర్

భోగాపురం, న్యూస్‌లీడర్ : భోగాపురం జాతీయరహదారిపై వ్యానులో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రూ.10లక్షల ఖైనీ, గుట్కా ప్యాకెట్లకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు గుట్టు చప్పుడుగా నిషేధిత పొగాకు ఉత్పత్తులను అక్రమ రవాణా చేస్తున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘువీర్ విష్ణుతెలిపారు. బరంపురానికి చెందిన మహ్మద్ అజీజ్, మహ్మద్ షహిల్‌లు గుట్కా ఖైనీలను బరంపురం నుంచి విశాఖ మీదుగా కాకినాడ తరలిస్తుండగా పోలీసు సిబ్బంది తనిఖీలో దొరికిందని చెప్పారు. అట్టపెట్టెల్లో అమర్చిన వీటిని చేపల తొట్టెల్లో ఉంచి ఎవ్వరికీ తెలికుండా వ్యానులో జాతీయరహదారి మీదుగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐలు తారకేశ్వరరావు, మహేష్ సిబ్బందిలో సోదాలు చేసి పట్టుకున్నారని వివరించారు. ఈ విషయాన్ని ఎస్పీ పాలరాజు దృష్టికి తీసుకెళ్లగా పొగాకు ఉత్పత్తులను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కి అప్పగించాలని ఆదేశించారని చెప్పారు. భారీఎత్తున అక్రమ రవాణా అవుతున్న గుట్కా ఖైనీలను పట్టుకున్న ఎస్ఐలను ఆయన అభినందించారు.

సీహెచ్‌సీలో ఫిజియోథెరపీ సేవలు



సీతంపేట,న్యూస్‌లీడర్ సీతంపేట సీహెచ్సీలో ఫిజియోథెరపీ యూనిట్ ఐటీడీఏ పీవో శివశంకర్ ప్రారంభించారు .ఈ సేవలను అందరూ వినియోగించుకోవాలని పీఓ కోరా రు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ నరేష్‌కుమారు, ఆసుపత్రి కమిటీ చైర్మన్ బి.దమయంతి నాయుడు పలువురు అధికారులు పాల్గొన్నారు .

ప్రత్యేక హోదా సాధించే వరకు ఉద్యమిస్తాం : ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట,న్యూస్‌లీడర్ :రాష్ట్ర విభజన అనంతరం వైసిపి రాష్ట్ర నాయకుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక హెూదాకోసం నిరంతరం పోరాడుతున్నదని వారికి మద్దత్తుగా యువజన,పార్టి వివిధ పోరాటలు జరుపుతున్నామని రాష్ట్ర రాజకీయ్యవహారాలు ప్రతినిది ధర్మాన.క్రిష్ణదాస్ అన్నారు.స్థానికి వై.యస్.ఆర్ పార్టి కార్యాలయం నుండి వైసిపి యువజన సంఘం నాయకుల తీసిని బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించిన ఆయన మాట్లాడుతు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీ డ్రామ అడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయుకులు ధర్మాన రామలింగంనాయుడు,బైరినాయుడు బగ్గు రమణయ్య,ముద్దాడ క్రిష్ణతేజ, రామచంద్రరావు తదితరలు బైక్ ర్యాలో పాల్లున్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్నా ధర్మాన కృష్ణదాస్

జననం.. మరణం!




- పుట్టగానే 10 లక్షల చిన్నారులు చనిపోతున్నారు
- భారత్‌లో ఏటా 6 లక్షల మంది మృతి
- నివేదిక విడుదల చేసిన యూనిసెఫ్

వాషింగ్టన్ :
ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా దాదాపు 10 లక్షల మంది చిన్నారులు పుట్టినవెంటనే చనిపోతున్నారని యూనిసెఫ్ తెలిపింది. నెల రోజుల్లోపు వయసున్న చిన్నారులు ప్రతి ఏటా 26 లక్షల మంది కన్నుమూస్తున్నారని వెల్లడించింది. అభివృద్ధి చెందిన ధనిక దేశాలతో పోల్చుకుంటే పేద దేశాల్లో పుట్టే చిన్నారులు చనిపోయే అవకాశం 50 రెట్లు ఎక్కువని పేర్కొంది. ఈ మరణాలన్నీ మెరుగైన వైద్యంతో నివారించదగ్గ వేనని యూనిసెఫ్ తెలిపింది. గత పాతికేళ్లలో చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి పురోగతి సాధించినప్పటికీ, నెల రోజుల్లోపు వయసున్న నవజాత శిశువుల ఆరోగ్యం విషయం లో చాలా దేశాలు విఫలమయ్యామని వెల్లడించింది. భారత్‌లో ప్రతి ఏటా 6 లక్షల మంది చిన్నారులు పుట్టిన నెల రోజుల్లోపే కన్నుమూస్తున్నారని పేర్కొంది. 'ఎవ్రీ చైల్డ్ అలైవ్' పేరుతో చేపట్టిన ప్రచార కార్యక్రమానికి అనుబంధంగా 184 దేశాల్లో చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి యూనిసెఫ్ ఈ నివేదికను విడుదల చేసింది. నవజాత శిశువుల మరణాల్లో పాకిస్తాన్ తొలిస్థానంలో నిలిచిందనీ, అక్కడ పుట్టిన ప్రతి 22 మంది శిశువుల్లో ఒకరు చనిపోతున్నారని యూనిసెఫ్ తెలిపింది. శిశు మరణాలకు సంబంధించి 52 దిగువ మధ్యతరగతి దేశాల్లో భారత్ 12వ స్థానంలో నిలిచినట్లు యూనిసెఫ్ తెలిపింది. నవజాత శిశువుల మరణాలు జపాన్‌లో(ప్రతి 1,111 మందిలో ఒకరు) అత్యల్పంగా నమోదైనట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా చనిపోతున్న చిన్నారుల్లో 80 శాతం మందిని మెరుగైన వైద్యసౌకర్యాలతో రక్షించవచ్చని వెల్లడించింది. అమెరికా సైతం చిన్నారులకు సురక్షితమైన దేశాల్లో 41వ స్థానంలో నిలిచిందని తెలిపింది. అభివృద్ధి చెందినదేశాల్లో కూడా ధనికులతో పోల్చుకుంటే పేద కుటుంబాల్లో పుట్టిన చిన్నారులు చనిపోయే అవకాశం 40 శాతం ఎక్కువని వెల్లడించింది.
భారత్‌లో పుట్టే చిన్నారుల్లో 6 లక్షల మందికిపైగా నెలరోజుల్లోపే కన్నుమూస్తున్నారని యూనిసెఫ్ తెలిపింది. ఇలా చనిపోతున్నవారిలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఉన్నారంది. కేరళ, గోవా రాష్ట్రాల్లో పుట్టిన ప్రతి 1000 మంది చిన్నారుల్లో 10 మంది నెల రోజుల్లోపే చనిపోతుండగా, ఉత్తరాఖండ్, బిహార్‌లో ఇది 44గా ఉందని తెలిపింది. దేశవ్యాప్తంగా మొత్తం జననాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల వాటా 46 శాతంగా ఉందంది. అలాగే దేశవ్యాప్తంగా నెలరోజుల్లోపు చనిపోతున్న శిశువుల్లో ఈ రాష్ట్రాల్లోనే 57 శాతం మంది ఉన్నారని వెల్లడించింది. 2030 నాటికి నెల రోజుల్లోపు శిశు మరణాల రేటును ప్రతి వెయ్యిమందికి 12కు తగ్గించాలన్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాన్ని భారత్ అందుకోలేదని నివేదిక స్పష్టం చేసింది. అయితే ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలను ప్రతి వెయ్యిమందికి 25కు తగ్గించడంలో భాగంగా భారత్ మంచి పురోగతి సాధించిందని పేర్కొంది. ఈ జాబితాలో భారత్(31వ ర్యాంక్)తో పోల్చుకుంటే నేపాల్(50), బంగ్లాదేశ్(54), భూటాన్(60), శ్రీలంక(127) మెరుగైన ర్యాంకులు సాధించాయని తెలిపింది.

పీఎన్‌బీ వ్యవహారంలో
రంగంలోకి ఆర్థికశాఖ



ఢిల్లీ:
పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)కు వివిధ బ్యాంకర్లకు మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగనుంది. ఈ మేరకు పలు బ్యాంకు ఉన్నతాధికారులతో త్వరలోనే ఆర్థికమంత్రిత్వ శాఖ సమావేశం కానుంది. పీఎన్‌బీ మధ్యవర్తిగా వ్యవహరించి ఎల్‌వోయూల ద్వారా వివిధ బ్యాంకుల్లో ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి భారీగా రుణాలు ఇప్పించిన విషయం తెలిసిందే. బ్యాంకులకు రూ.11,400కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన నీరవ్ ప్రస్తుతం దేశం విడిచి వెళ్లిపోయాడు. దీంతో ఆ బకాయిలన్నీ పీఎన్‌బీనే చెల్లించాల్సి వచ్చింది.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), అలహాబాద్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంకుతో పాటు పలు బ్యాంకులకు పీఎన్‌బీ బకాయిలు పడింది. దీనిపై ఇటీవల బ్యాంకర్ల సంఘం సమావేశమై పీఎన్‌బీ బకాయిలు మొత్తం చెల్లించాల్సిందిగా కోరింది. అయితే.. తాము మొత్తం చెల్లించలేమని కేవలం రూ.6000కోట్లు మాత్రమే చెల్లించగలమని పీఎన్‌బీ బ్యాంకర్లకు స్పష్టం చేసింది. దీంతో బ్యాంకర్లు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)ని ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో బకాయిలు పద్ద బ్యాంకర్ల ఉన్నతాధికారులతో ఆర్థిక మంత్రిత్వ శాఖ చర్చలు జరిపి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. పీఎన్‌బీ కేసు వ్యవహారంపై కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తొలిసారిగా నిన్న స్పందించిన విషయం తెలిసిందే. బ్యాంకింగ్ వ్యవస్థను మోసగించే వారు ఎవరైనప్పటికీ ప్రభుత్వం వదిలిపెట్టదని.. వారిని వెంటాడి తీరుతుందని ఆయన హెచ్చరించారు.
నేరుగా పీఎన్‌బీ పేరు గానీ, ప్రధాన నిందితుడు నీరవ్ మోదీని గానీ ప్రస్తావించకుండానే జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈనెల 13న బ్యాంకింగ్ రంగాన్నే కుదిపేసిన రూ.11వేల కోట్ల భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీకి సంబంధించిన ఆస్తులను, దుకాణాలను, బ్యాంకు ఖాతాలను ఇప్పటికే అధికారులు స్తంభింపజేశారు. ఆయనకు సంబంధించిన దుకాణాలపై నిర్విరామంగా దాడులు చేస్తూనే ఉన్నారు.

మానస సరోవర యాత్రకు దరఖాస్తులు!

- జూన్ 8 నుంచి యాత్ర
- రెండు మార్గాలను ఎంపిక చేసిన విదేశాంగ శాఖ



(ప్రత్యేక ప్రతినిధి)
కైలాస శిఖరం... సాక్షాత్తూ పరమశివుడు కొలువైవుండే ప్రదేశమని భారతీయులు నమ్మే ప్రాంతం. ఆ శిఖరం పాదాల చెంత ఉండేదే మానస సరోవరం. బ్రహ్మ దేవుని ఆలోచనల నుంచి ఆవిర్భవించి భూమి దకు చేరి పరమ పవిత్రమైన సరస్సే ఇదని హిందూ పురాణాలు ప్రస్తావించాయి. బ్రహ్మ మానసాన జన్మించి నది కాబట్టి దీనికి మానస సరోవరమని పేరు. మానస సరోవరంలో స్నానం చేసినా, ఆ నీళ్లు తాగినా, మరణిం చిన తరువాత నేరుగా కైలాసానికి వెళ్లవచ్చని నమ్ముతారు. ప్రపంచంలోని అన్ని సరస్సు ల్లో మానస సరోవరంలోని నీరే అత్యం త స్వచ్ఛమైనది. బ్రహ్మపుత్ర, కర్నలి, ఇండస్, సట్లెజ్ వంటి నదులకు పుట్టినిల్లు కూడా. ఇక ఈ సంవత్సరం మానస సరోవరం యాత్ర చేయాలని భావించేవారు మార్చి 23లోగా దర ఖాస్తు చేసుకో వాలని భారత విదేశాంగ శాఖ సూచించింది. సిక్కింలోని నాథులా పాస్, ఉత్తరాఖండ్ లోని లిపులేఖ్ పాస్ మార్గాల గుండా యాత్ర సాగుతుందని, మరో నెలలో రిజిస్ట్రేషన్ చేసు కోవాలని పేర్కొంది. జూన్ 8 నుంచి యాత్ర ప్రారంభమ వుతుందని తెలిపింది. ఆన్ లైన్ దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వెల్లడించింది. లిపులేఖ్ పాస్ మార్గం గుండా వెళ్లాలని భావించే వారికి రూ. 1.60 లక్షలు, నాథులా పాస్ మార్గంలో రూ. 2 లక్షల వరకూ ఖర్చవు తాయని వెల్లడించింది. దరఖాస్తులు 'https://kmy.gov.in' వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్నాయని తెలిపింది.

విశాఖలో కుటుంబ వినోద కేంద్రం

- ఎస్వీఐ సినిమాస్ ప్రై.లిమిటెడ్ డెవలపర్‌కు 33 ఏళ్లకు లీజు
- తిరుపతిలోనూ ఇదే తీరుగా ఎఫ్ఈసీ



అమరావతి:
గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో కుటుంబ వినోద కేంద్రం (ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్-ఎఫ్ఈసీ) ఏర్పాటుకు ఎస్వీఐ సినిమాస్ ప్రైవేట్ లిమిటెడ్ (డెవలపర్)కు 33 సంవత్సరాలకు లీజు ప్రాతిపదికన 2.7 ఎకరాలను కేటాయించేందుకు జీవీఎంసీ కమిషనరుకు అనుమతి ఇస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. లీజు రూపంలో మొదటి ఏడాది రూ. 4.284 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి 5 శాతం చొప్పున లీజు మొత్తాన్ని పెంచేలా ఒప్పందం కుదుర్చుకుంటారు. పీపీపీ పద్ధతిలో చేపట్టే ఈ ప్రాజెక్టుని రూ. 25 కోట్ల వ్యయంతో రెండేళ్లలో పూర్తి చేసేలా ఒప్పందం కుదుర్చుకుంటారు. ప్రాథమికంగా ఏపీ టూరిజం కార్పోరేషన్(ఏపీటీడీసీ) దీని ఖర్చులను భరించి పర్యాటక ప్రాజెక్టుగా దీనిని నిర్వహిస్తుంది. తిరుపతి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (తుడా) పరిధిలో ఎఫ్ఈసీ ఏర్పాటుకు అన్నమయ్య సర్కిల్‌లో 33 సంవత్సరాలకు లీజు ప్రాతిపదికన 3.72 ఎకరాలను ఎస్వీఐ సినిమాస్‌కు కేటాయించేందుకు తుడా వైస్ చైర్మన్‌కు అనుమతిస్తూ నిర్ణయించింది. లీజు రూపంలో మొదటి ఏడాది రూ. 3.265 కోట్లు చెల్లించేవిధంగా, ఏడాదికి 5 శాతం చొప్పున లీజు మొత్తాన్ని పెంచేలా ఒప్పందం కుదుర్చుకుంటుంది. పీపీపీ పద్ధతిలో 25 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసేలా ఒప్పందం కుదుర్చుకుంటారు. 23 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్, 80 వేల చ.అ. విస్తీర్ణంలో ఫుడ్ కోర్టులు, వాణిజ్య సముదాయం ఏర్పాటు చేస్తారు. 6 మల్టీ ప్లెక్స్ స్క్రీన్లతో ఐమ్యాక్స్ థియేటర్, 3 స్టార్ల హోటల్ నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టులో వారు ప్రతిపాదించిన రూముల కంటే ఎక్కువ సంఖ్యలో రూములను నిర్మించాలని సీఎం సూచించారు. దీని ఖర్చులను కూడా ఏపీటీడీసీయే భరించి పర్యాటక ప్రాజెక్టుగా దీన్ని నిర్వహిస్తుంది.

చపాతీలు చేసిన కెనడా ప్రధాని



పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయాన్ని సందర్శించిన ట్రూడో కుటుంబం

పంజాబ్:
భారత పర్యటనలో ఉన్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చపాతీలు చేశారు. తన కుటుంబంతో కలిసి పంజాబ్ లోని అమృతసర్ లో ఉన్న స్వర్ణ దేవాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దేవుని సేవలో భాగంగా చపాతీలు చేశారు. సామూహిక వంటశాలలో తన భార్యతో కలిసి కూర్చున్న ఆయన, చపాతీలు ఒత్తారు. ఈ సందర్భంగా ట్రూడో మాట్లాడుతూ, తన కుటుంబంతో కలిసి ఆలయాన్ని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని, ఆలయం అద్భుతంగా ఉందని ప్రశంసించారు. కాగా, పంజాబ్ పర్యటనకు వెళ్లిన ట్రూడోను సీఎం అమరీందర్ సింగ్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు.

15 భారతీయ భాషల్లో ఈమెయిల్ ఐడీ

హైదరాబాద్:
ఈ-మెయిల్ యాప్స్‌లో యూజర్లు తమ మాతృభాషలోనే మెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకునే సౌకర్యాన్ని సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ అందుబాటులోకి తేనున్నది. ఈ ఫీచర్ వల్ల తెలుగు, ఉర్దూ, హిందీ, తమిళం, పంజాబీ, మణిపురి, గుజరాతీ, బెంగాలీ, సింధీ, నేపాలీ, మరాఠీ, మైథిలి, కొంకణి, డోగ్రి, బోడో భాషల్లో యూజర్లు ఈ-మెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకోవచ్చు. మైక్రోసాఫ్ట్‌కు చెందిన ఆఫీస్ 365, ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్, ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్ ప్రొటెక్షన్, ఔట్‌లుక్ తదితర యాప్‌లలో ఈ-మెయిల్ ఖాతాలను తెరువవచ్చు.

రాజమండ్రిలో భారీ అగ్నిప్రమాదం

మోరంపూడి:
రాజమండ్రిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అర్ధరాత్రి సమయంలో మోరంపూడి సమీపంలోని గారాలమ్మ వీడియోకాన్ గోడౌన్‌లో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ఏసీలు బుగ్గయ్యాయి. గోదావరి జిల్లాలకు వీడియోకాన్ ఏసీలను ఇక్కడి నుంచి సరఫరా చేస్తుంటారు. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.4కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. కాగా ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రైల్వే నియామకాలపై కీలక ప్రకటన




ఢిల్లీ:
రైల్వేలో ఉద్యోగ నియామకాలపై రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక ప్రకటన చేశారు. రైల్వే నియామకాల్లో రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు పరీక్ష రుసుం రూ.250లుగా ఉంటుందని ఆయన మీడియా సమావేశంలో ప్రకటించారు. పరీక్షకు హాజరైన రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థికి ఆ రుసుం మొత్తం తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు పరీక్ష రుసుం రూ.500గా ఉంటుందని, పరీక్షకు హాజరైన అభ్యర్థులకు తిరిగి రూ.400 చెల్లించనున్నట్లు వివరించారు. పరీక్షల సమయంలో అభ్యర్థి సంతకం చేసే భాష విషయంలో ఎలాంటి ఆంక్షలు లేవని తెలిపారు.

చైనా సాయంతో పాక్ పక్కా ప్లాన్



న్యూఢిల్లీ:
చైనా సాయంతో పాకిస్తానే పక్కా ప్రణాళికతో బంగ్లాదేశీయులు ఈశాన్య రాష్ట్రాల్లోకి వలస వచ్చేలా చేస్తోందని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ అన్నారు. ఈ ప్రాంతంలో అస్థిరత నెలకొనేలా చూడటమే వారి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోకి బంగ్లాదేశీయుల వలసలు పెరిగిపోతున్న అంశంపై ఆయన ఢిల్లీలో ఓ కార్యక్రమంలో మాట్లాడారు. అస్సాంలో ముస్లింల జనాభా పెరిగిపోతుండటాన్ని రావత్ ప్రస్తావిస్తూ అక్కడ ఏఐయూడీఎఫ్ అనే ముస్లిం పార్టీ బీజేపీ కన్నా చాల వేగంగా ఎదుగుతోందని అన్నారు. ఈశాన్య ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలోనే ఈ సమస్యకు పరిష్కారం దాగుందని రావత్ సూచించారు.

బిల్లీ గ్రాహమ్ కన్నుమూత



మాంట్రీ(యూఎస్):
విఖ్యాత క్రైస్తవ మత ప్రబోధకుడు, ప్రచారకర్త బిల్లీ గ్రాహమ్ కన్ను మూశారు. ఆయన వయసు 99 ఏళ్లు. గత కొన్నేళ్లుగా ప్రొస్టేట్ కేన్సర్, న్యుమోనియాతో బాధపడుతున్న ఆయన బుధవారం ఉత్తర కరోలినాలోని తన స్వగృహం లో మృతిచెందారు. అమెరికాలో ఉదారవాద ప్రొటెస్టెంట్లు, రోమన్ కేథలిక్‌లకు పోటీగా మత ప్రచార కార్యక్రమాలను ఆయన ఒక ఉద్యమంలా నిర్వహించారు. 185కు పైగా దేశాల్లో సదస్సులు, సమావేశాలు నిర్వహించి సంప్రదాయ క్రైస్తవుల మధ్య అంతర్జాతీయ స్థాయిలో సంబంధాలు నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. కమ్యూనిస్టుల పాలనలోని క్రైస్తవులకు కూడా ఆశా కిరణంగా నిలిచారు. మత బోధనల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మందికి చేరువైంది గ్రాహమే అంటే అతిశయోక్తి కాదు. 'అమెరికా పాస్టర్'గా పేరొందిన గ్రాహమ్.. ఐసన్‌హోవర్ నుంచి జార్జి దబ్ల్యూ బుష్ వరకు పలువురు అమెరికా అధ్యక్షులకు ఆధ్యాత్మిక సలహాదారుగా, సన్నిహితుడిగా వ్యవహరించారు. బహిరంగ ప్రార్థనలే కాకుండా టీవీలు, రేడియోల ద్వారా కూడా గ్రాహమ్ మిలియన్ల కొద్ది అభిమానులను సంపాదించుకున్నారు. గ్రాహమ్ మృతిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతాపం తెలిపారు. 2005లో న్యూయార్క్ పట్టణంలో నిర్వహించిన తన చివరి ప్రార్థనలో ప్రపంచ వ్యాప్తంగా 21 కోట్ల మందిని ఉద్దేశించి ప్రసంగించి రికార్డు సృష్టించారు. అయనలా మరో ఎవాంజలిస్ట్ ఇలాంటి బృహత్తర కార్యక్రమం తలపెట్టే అవకాశాలు దాదాపు అసాధ్యమే. 1983లో అప్పటి అధ్యక్షుడు రీగన్ నుంచి గ్రాహమ్ అమెరికా అత్యున్నత పౌర పురస్కారం ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను అందుకున్నారు. గ్రాహమ్ 1918, నవంబర్ 7న చార్లెట్‌లో సంప్రదాయ క్రైస్తవుల కుటుంబంలో జన్మించారు. కాలేజీలో చదువుతుండగా చైనాకు చెందిన రూత్ బెల్ అనే యువతితో పరిచయమైంది. 1943లో వారు వివాహం చేసుకున్నారు.

టీచర్లకు తుపాకులు ఇస్తాం : ట్రంప్



వాషింగ్టన్:
ఇటీవల ఫ్లోరిడా పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటన నుంచి ప్రాణాలతో బయటపడిన వారితో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమావేశమయ్యారు. గత వారం పాఠశాలకు చెందిన ఓ మాజీ విద్యార్థి విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో 17 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ బాధితులతో శ్వేతసౌధంలో సమావేశమై మాట్లాడారు. తుపాకుల యజమానులకు నిబంధనలు మరింత కఠినతరం చేస్తామని, తుపాకుల జారీకి పక్కాగా నిబంధనలను అమలుచేస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. వారి మానసిక పరిస్థితిని కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు.
పాఠశాలల్లో తరచూ ఇలాంటి కాల్పులు జరగకుండా ట్రంప్ ఓ ఐడియా ఇచ్చారు. స్కూళ్లో టీచర్ల వద్ద కూడా తుపాకులు ఉండాలని ఆయన సూచించారు. కొందరు ఉపాధ్యాయులకు తుపాకుల వినియోగంలో మంచి శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే అది రహస్యంగా ఉండాలని చెప్పారు. కొందరు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇచ్చి వారి దగ్గర రహస్యంగా తుపాకులు ఉంచితే.. పరిస్థితిలో కొంత మేర మార్పు వస్తుందని ట్రంప్ ఆశించారు. దీని వల్ల గన్-ఫ్రీ జోన్ ఉండబోదని, అయితే గన్-ఫ్రీ జోన్ అంటే దుండగులు తుపాకులతో వచ్చి కాల్పులు జరుపుతున్నారని ట్రంప్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటానని ట్రంప్ హామీ ఇచ్చారు.
కాల్పుల ఘటనను ప్రత్యక్షంగా చూసిన కొందరు విద్యార్థులు తమ ఆవేదనను అధ్యక్షుడితో పంచుకున్నారు. ప్రపంచంలో ఇంకెప్పటికీ ఇలాంటి పరిస్థితి ఎదురుకావొద్దని ఒకరు, స్కూల్ నుంచి ప్రాణాలతో ఇంటికెళ్లగలిగినందుకు తాను చాలా అదృష్టవంతుడినని మరొకరు అన్నారు. విమానాశ్రయానికి వెళ్తే.. ఓ బాటిల్ నీళ్లతో విమానం కూడా ఎక్కలేం. అలాంటిది మృగాలు తుపాకులు పట్టుకుని దర్జాగా స్కూల్లోకి వచ్చేస్తున్నాయంటూ ఒకరు ఆవేదన వ్యక్తంచేశారు.

ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్‌పై కేసు: పారిస్ ఉగ్రదాడి బాధితురాలు

పారిస్:
పారిస్ ఉగ్రదాడి బాధితురాలు ఒకరు ట్విట్టర్, ఫేస్‌బుక్, గూగుల్‌పై కేసు వేశారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు విచ్చలవిడిగా పెరిగిపోవడానికి ఈ మూడే కారణమని పేర్కొంటూ కోర్టు కెక్కారు. 2015లో జరిగిన పారిస్ ఉగ్రదాడిలో మొత్తం 130 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఓ కేఫ్‌లో ఉన్న షికాగోకు చెందిన మండీ పాల్‌ముక్కి బాధితురాలిగా మిగిలారు. తాజాగా గతవారం ఆమె షికాగో కోర్టులో ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్‌పై దావా వేస్తూ ఇస్లామిక్ ఉగ్రవాదం పెరగడానికి ఈ మూడు పరోక్షంగా దోహదం చేస్తున్నాయని ఆరోపించారు. ఉగ్రదాడి జరిగినప్పుడు తానున్న కేఫ్‌లో 12 మందికిపైగా చనిపోవడంతో ఆమె మానసికంగా తీవ్రంగా గాయపడినట్లు లాసూట్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ ఉగ్రదాడి తమపనేనని అప్పట్లో ఐసిస్ ప్రకటించింది. విషయం తెలిసిన ఫేస్‌బుక్ స్పందిస్తూ తమ సైట్‌లో ఉగ్రవాదానికి కానీ, అటువంటి అంశాలకు కానీ చోటు లేదని తేల్చి చెప్పింది. అటువంటి పనులకు తాము మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేసింది. తమపై కేసు దాఖలైన విషయంపై ట్విట్టర్, గూగుల్‌లు ఇప్పటి వరకు స్పందించలేదు.

బిగ్ బాస్ స్టూడియోలో భారీ అగ్నిప్రమాదం



బెంగళూరు:
టీవీ చానల్ రియాల్టీ షో బిగ్ బాస్ స్టూడియోలో గత రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. బెంగళూరు ఇన్నోవేటివ్ ఫిల్మ్ సిటీలో అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో భారీ సెట్టింగులు అగ్నికి ఆహుతయ్యాయి. అక్కడ ఉన్న కార్మికులు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చేలోగానే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాంక్రీటు వాడకుండా మౌల్డింగ్ విధానంలో నిర్మించిన తాత్కాలిక సెట్ కావడంతో ఏమీ మిగల్లేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సివుంది.

భూకబ్జా కేసులో హైకోర్టుకు బొండా సతీమణి



అమరావతి :
విజయవాడ స్వతంత్ర సమర యోధుడి భూమి కబ్జా కేసులో ఎమ్మెల్యే బొండా ఉమ సతీమణి సుజాత హైకోర్టును ఆశ్రయించారు. తన నమోదైన కేసులను కొట్టేయాలంటూ పిటీషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు 8వారాల స్టే విధించింది. ఆలోపు కౌంటర్ దాఖలు చేయాలంటూ సీఐడీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో బొండా సుజాత ఏ-8 ముద్దాయిగా ఉన్నారు. 1951లో సూర్యనారాయణ అనే స్వాతంత్ర్య సమరయోధుడికి ప్రభుత్వం పదెకరాల స్థలాన్ని కేటాయించింది. 2016లో నకిలీ పత్రాలు సృష్టించి బొండా ఉమ కబ్జాకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న సూర్యనారాయణ మనువడు సురేష్ 2017, ఫిబ్రవరి 10న విజయవాడ సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో సురేష్ సీఐడీ అధికారులను ఆశ్రయించారు. దాంతో మొత్తం ఎమ్మెల్యే బొండా ఉమా కుటుంబం భూబాగోతం వెలుగులోకి వచ్చింది.

సంచలన వార్తా పత్రిక
లీడర్
విశాఖపట్నం
శుక్రవారం 23-2-2018

రకుల్ కు తెలుగు సినిమా దొరికిందోచ్

గత ఏడాది వరకు బిజీ బిజీ షెడ్యూల్ తో గడిపిన స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ ఇప్పుడు డేట్స్ ఇవ్వడానికి రెడీగా ఉంది. స్పైడర్ సినిమా ఎప్పుడైతే డిజాస్టర్ అయ్యిందో అప్పుడే రకుల్ కి ఆఫర్స్ తక్కువయ్యాయి. అయితే చాలా కాలం తరువాత రకుల్ కి ఒక మంచి ఆఫర్ దక్కింది. గత ఏడాది మొదట్లో రారండోయ్ వేడుక చూద్దాం అనే సినిమాతో రకుల్ చివరి హిట్ అందుకుంది. నాగ చైతన్య తోఅమ్మడి కెమిస్ట్రీ కరెక్ట్గా సెట్ అవ్వడంతో సినిమాకి మంచి టాక్ వచ్చింది. నాగ చైతన్య కూడా వరుస డిజాస్టర్స్ తరువాత ఆ సినిమాతో హిట్ ను చూశాడు. దీంతో ఈ సారి మళ్లీ ఇద్దరు ఒక్కటై హిట్ కొట్టాలని చూస్తున్నారు. ఇద్దరి కాంబినేషన్ ని ఒక దర్శకురాలు సెట్ చేసిందట. ఆమె ఎవరో కాదు. కృష్ణవంశీ దగ్గర కొన్ని సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేసిన సౌజన్య. సింపుల్ లవ్ స్టోరీ లైన్ తో స్క్రీన్ ప్లే ను బేస్ చేసుకొని తీయబోయే ఈ సినిమా కథ చాలా బావుంటుందట. నాగచైతన్య సింగిల్ సిట్టింగ్‌లో ఒకే చేశాడని సమాచారం.

అప్పడాలు అమ్ముకుంటున్న హృతిక్



తాము నటించే సినిమాల్లో పాత్రల కోసం వాటికి అనుగుణంగా తమను తాము పూర్తిగా మార్చుకునే స్టార్ హీరోలలో హృతిక్ రోషన్ ఒకడు. గత కొంత కాలంగా సినిమాలు చేయటంలో దూకుడు తగ్గించిన ఈ కండల వీరుడు తన రేంజ్ కు తగ్గ సక్సెస్ కొట్టి చాలా కాలమే అయ్యింది. గత ఏడాది వచ్చిన కాబిల్ లో కళ్ళు కనిపించని వాడిగా హృతిక్ నటన క్రిటిక్స్ ని సైతం మెప్పించినప్పటికి షారుఖ్ ఖాన్ రయీస్ తో పోటీ పడటం వల్ల కమర్షియల్ గా అనుకున్న రేంజ్ కు చేరుకోలేకపోయింది. తాజాగా హృతిక్ రోషన్ చేస్తున్న సినిమా సూపర్ 30. ప్రముఖ గణిత నిపుణుడు విద్యావేత్త ఆనంద్ కుమార్ జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న ఈ మూవీ కోసం హృతిక్ తన ఆహార్యాన్ని పూర్తిగా మార్చుకోవడం ఫోటోలలో చూసి అభిమానులు సైతం షాకయ్యారు. తాజాగా హృతిక్ ఈ సినిమాలో అప్పడాలు సైకిల్ మీద పెట్టుకుని అమ్ముకుంటూ తిరిగే ఫోటో ఒకటి సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఆనంద్ కుమార్ తన కెరీర్ ప్రారంభంలో ఆర్థికంగా కుటుంబంలో ఇబ్బందులున్న కారణంగా సాయంత్రాలు పార్ట్ టైం లాగా ఇలా అప్పడాలు అమ్ముకుంటూ చేదోడు వాదోడుగా నిలిచేవాడు. సరిగ్గా ఇప్పుడు ఆ సీన్లనే చిత్రీకరిస్తున్నాడు దర్శకుడు వికాస్ భల్.టీవీ నటి మృణాల్ ఠాకూర్ హృతిక్ సరసన తన జీవిత భాగస్వామిగా కనిపిస్తుంది. సూపర్ 30 ఇప్పటి దాకా వచ్చిన బయోపిక్స్ లో ప్రత్యేకంగా నిలుస్తుందంటున్నాడు దర్శకుడు వికాస్. స్పోర్ట్స్ డ్రామా లోనే అధికంగా బాలీవుడ్ సినిమాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇది స్పెషల్ గా నిలుస్తుంది అనేది ఆయన నమ్మకం. నవంబర్ లో విడుదల కానున్న సూపర్ 30 మీద హృతిక్ చాలా ఆశలు పెట్టుకున్నాడు. దీని తర్వాత క్రిష్ 4 రూపొందించేందుకు నాన్న రాకేశ్ రోషన్ ఈపాటికే సన్నాహాలు మొదలుపెట్టేసాడు. క్రిష్ సిరీస్ కి దీంతో ముగింపు పలికే అవకాశాలు ఉన్నాయి.

అందాల ఆరబోతకు అనూ సై



మలయాళీ భామ అను ఇమాన్యుయేల్‌కు టాలీవుడ్ పట్టం కట్టేసిన సంగతి తెలిసిందే. వరుస అవకాశాలతో ఈ వయ్యారి దూసుకుపోతోంది. రీసెంట్‌గా పవన్ కళ్యాణ్ అజ్ఞాతవాసి నిరుత్సాహ పరిచినా అందులో సెకండ్ హీరోయిన్ గా నటించిన అను కెరీర్ కి వచ్చిన ఇబ్బంది పెద్దగా ఏమీ లేదు. ఇప్పటి వరకూ ఆన్ స్క్రీన్ పై వీలైనంత పద్ధతిగా కనిపించిన అను ఇమాన్యుయేల్.. రియల్ లైఫ్ లో మాత్రం మహా హాట్ నెస్ ప్రదర్శించేస్తూ ఉంటుంది. రీసెంట్ గా ఓ ఈవెంట్ కోసం ఈ అమ్మడు రెడీ అయిన తీరు చూసి అందరిలోనూ సెగలు పుట్టేశాయి. బ్లాక్ డ్రెస్ కి వైట్ ఓవర్ కోట్ తగిలించి.. అను ఇచ్చిన పోజులు అందరికీ మతులు పోగొట్టించేశాయి. హాట్‌నెస్‌కి కేరాఫ్ అడ్రస్ మాదిరిగా అను ఇచ్చిన పోజులను అదరహో అనాల్సిందే. అంతగా ఫోటోలలో హాట్నెస్ పంచేస్తూ తను ఎంతటి స్పీడ్ అనే విషయాన్ని మేని మెరుపులతోనే చెప్పేస్తోంది అను ఇమాన్యుయేల్. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో పలు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో అల్లు అర్జున్ తో నటిస్తున్న నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా అత్యంత కీలకమైనది. అమ్మడి పాత్ర సినిమాలో పరిమితంగానే ఉంటుందనే సంగతి అర్థమవుతున్నా.. ఈ సినిమాలో గ్లామర్ యాంగిల్ అంతా అను చుట్టూనే తిరుగుతుందనే విషయం ఒప్పు కోవాల్సిందే. ఓ కమర్షియల్ మూవీలో హీరోయిన్ గా హిట్టు కొడితే ఆ కిక్కే వేరుగా ఉంటుంది.

సైరా షూటింగ్ మళ్లీ బ్రేక్ ?

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 151వ చిత్రం సైరా.. నరసింహారెడ్డి. కొన్ని రోజుల పాటు జరిగిన తొలి షెడ్యూల్ షూటింగ్ పూర్తయి.. రెండు నెలలు దాటిపోయింది. ఆ తర్వాత ఈ చిత్రంపై చాలానే రూమర్స్ రాగా.. వాటన్నిటినీ సైరా టీం ఖండించింది. ఫిబ్రవరిలో రెండో షెడ్యూల్ ప్రారంభం అవుతుందంటూ ప్రకటించింది. కానీ ఇప్పుడు సైరా సెకండ్ షెడ్యూల్ షూటింగ్ దాదాపు నెల రోజులు వాయిదా పడినట్లు తెలుస్తోంది. నిజానికి ఈ మంగళవారమే చిరంజీవితో సహా మొత్తం సైరా యూనిట్ అంతా కేరళకు షిఫ్ట్ అవాల్సి ఉంది. కానీ అలాంటివేమీ జరగకపోవడంతో.. సైరా షూట్ వాయిదా పడిందనే వార్తలకు ఆధారం దొరికింది. కానీ ఇది తప్పనిసరి పరిస్థితులలో చేయాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఇందుకు కారణం.. సినిమాటోగ్రాఫర్ రత్నవేలు. ప్రస్తుతం రంగస్థలం షూటింగ్ పూర్తి చేసిన రత్నవేలు.. ఆ మూవీకి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ పనులు చేయాల్సి ఉంది. మార్చ్ 30న విడుదల తేదీ టార్గెట్ అందుకునేందుకు రత్నవేలు ప్రెజెన్స్ తప్పనిసరి.

వర్మ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు



మియా మల్కొవాతో తీసిన గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ విడుదలైనప్పుడు ఎంత సంచలనం రేపిందో ఇప్పుడు వర్మ మెడకు చుట్టుకుంటున్న కేసుల ఉదంతం అంత కన్నా ఎక్కువ అనిపించేలా ఉంది. ఇప్పటికే ఉన్న కేసులతో పోరాడేందుకు వర్మ తన ఆయుధాలు సిద్ధం చేసుకునే పనిలో ఉండగా తాజాగా విశాఖపట్నం ఎంవిపి పోలీస్ స్టేషన్ లో కొత్త ఫిర్యాదు నమోదు అయ్యింది. చేసింది మహిళా సంఘాలే. వర్మ పోర్న్ కంటెంట్ ని ప్రోత్సహిస్తున్నాడని అతని కామెంట్స్ మహిళలను కించపరిచేలా చాలా దారుణంగా ఉన్నాయని అందులో పేర్కొంటూ వర్మ జిఎస్టి గురించి అందులో ప్రముఖంగా ప్రస్తావించారు. ఇప్పటికే మహిళా సంఘాల ఆధ్వర్యంలో వైజాగ్ లో వర్మకు వ్యతిరేకంగా నిరాహారదీక్ష కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇది మీడియాలో హై లైట్ అవ్వడంతో పాటు వర్మ మీద చర్యలు తీసుకునేలా ప్రభుత్వం మీద కూడా మహిళా సంఘాలు ఒత్తిడి మొదలు పెట్టడంతో హోం మినిస్టర్ చినరాజప్ప ఆదేశాల మేరకు వర్మ మీద కేసు రిజిస్టర్ అయినట్టుగా తెలిసింది. కొన్ని టీవీ ఛానల్స్ ఇదే విషయమై నిర్వహిస్తున్న లైవ్ డిబేట్స్ లో సైతం అధికార పార్టీ ప్రతినిధులను నేరుగానే అడిగేస్తున్నారు మహిళలు. సన్నపనేని రాజకుమారి గారికి ఇది అనుభవమైంది. దీంతో వర్మపై కేసుల పరంపర ఇప్పట్లో ఆగేలా లేదు. వర్మ చేసింది రైటా రాంగా అనే చర్చను పక్కన పెడితే ఇదే స్థాయి స్పందన – చర్యలు యువతను రుగ్మతలా కమ్ముకుని వారి మానసిక ప్రవర్తన మీద తీవ్ర ప్రభావం చూపుతున్న వాటిపై కూడా రావడం ఎంతైనా అవసరం. పోర్న్ కొత్తగా పుట్టుకువచ్చింది కాదు ఇప్పుడు వర్మ మీద చర్యలు తీసుకుంటే ఆగిపోయేది కాదు. మూలాలు కనుక్కుని దాన్ని కట్టడి చేసే మార్గాల వైపు దృష్టి సారిస్తే మంచి ఫలితాలు దక్కుతాయి. ఒకరకంగా ఇప్పుడు జరుగుతున్నది వర్మకు ఒక అలెర్ట్ లాగా అనుకోవచ్చు. ఏదైనా తీయొచ్చు ఏమైనా మాట్లాడొచ్చు అనే ధోరణికి ఇది చెక్ పెట్టేలాగే ఉంది. లేదు నేను మారను అని వర్మ మళ్ళీ పాత స్టైల్ లోకి వస్తాడేమో చూడాలి.

ఆ మాయకు సీక్వెల్ వస్తోందట



టాలీవుడ్ లో ఒక్కటైన సినీ జంటల మధ్య ప్రేమ నిజంగా వారి లైఫ్ కి చాలా స్పెషల్ అని చెప్పాలి. వారి కెరీర్ పరంగా అర్థం చేసుకునే బంధాన్నీ ఎంచుకునే ఛాన్స్ అందరికి రాదు. కొందరు మాత్రమే ప్రేమ నుంచి పెళ్లి ట్రాక్ లోకి షిఫ్ట్ అవుతారు. అలాంటి వారిలో గత ఏడాది పెళ్లి చేసుకొని ఆకర్షించిన జంట నాగ చైతన్య– సమంత. 2010 లో వచ్చిన ఏ మాయ చేసావే సినిమాతో ఒకటైన వారి బంధం ప్రేమలో నాలుగేళ్ల వరకు ఉండి ఫైనల్ గా గత ఏడాది పెళ్లి చేసుకున్నారు. అయితే వీరిద్దరిని ఒకటి చేసిన ఘనత మాత్రం దర్శకుడు గౌతమ్ మీనన్ కే చెందుతుంది. ఇక అసలు మ్యాటర్ లోకి వస్తే.. ఇప్పుడు మళ్లీ అదే జంటను ఒక్క ఫ్రేమ్ లో చూపించబోతున్నడు గౌతమ్. స్పెషల్ ఏంటంటే ఏ మాయ చేసావే సినిమా కథను పొడిగిస్తారట. అంటే సీక్వెల్ అన్నమాట. అందుకు సంబంధించిన న్యూస్ ఇప్పుడు సౌత్ లో హాట్ టాపిక్ గా మారింది. పెళ్లి తరువాత వారి జీవితం ఎలా సాగింది. వారికి ఎలాంటి సమస్యలు వచ్చాయి అనే అంశమే కాకుండా. మొత్తంగా నాలుగు ప్రేమ కథల చుట్టూ గౌతమ్ కథని నడిపిస్తాడట. దాదాపు స్క్రిప్ట్ ఎండింగ్ కి వచ్చిందని తెలుస్తోంది. తమిళ్ – మలయాళం – కన్నడ లో దర్శకుడు ఆ భాషలకు సంబంధించిన వారితో సినిమా చేయాలని డిసైడ్ అయ్యాడు. మాధవన్ పునీత్ రాజ్ కుమార్ టోవినో థామస్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. ఇక ఏ మాయ చేసావే సినిమాకు అద్భుతమైన మెలోడీస్ అందించిన ఎఆర్.రెహమాన్ సీక్వెల్ కి కూడా అదే తరహాలో సంగీతాన్ని అందించడానికి రెడీ అయ్యాడు. మరి ఈ సినిమా ఏ స్థాయిలో విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

నాని రిజెక్ట్... సాయిధరమ్ యాక్సెప్ట్



చిత్ర పరిశ్రమలో ఒక సినిమా కథ ఎన్ని దారుల్లో ప్రయానిస్తుందో ఎవరికి తెలియదు. దాదాపు పట్టాలెక్కిం చేందుకు రెడీ చేస్తుండగా సడన్ గా మరో ట్రాక్ లోకి జంప్ చేస్తుంది. అంటే మరో హీరో దగ్గరికి వెళుతుందన్నమాట. ఆ విధంగా చాలా కథలు షిఫ్ట్ అవ్వడం కామన్. హిట్ అయితే లాక్కు లేదంటే బ్యాడ్ లక్. ఇక అసలు మ్యాటర్ లోకి వస్తే.. నాని తన కెరీర్ లో కొన్ని కథలను చాలా మిస్ చేసుకున్నాడు. అవి మంచి హిట్ అయ్యాయని కూడా నాని కొన్ని సందర్భాల్లో చెప్పాడు. అయితే రీసెంట్ గా న్యాచురల్ స్టార్ ఆల్ రెడీ కొన్ని నెలల కింద ఒకే చేసిన ఒక ఎమోషనల్ లవ్ స్టోరీని వదిలేసుకున్నట్లు తెలుస్తోంది. నేను శైలజా దర్శకుడు కిషోర్ తిరుమల దర్శకత్వంలో నాని ఒక సినిమా చేయడానికి ఒప్పుకున్న సంగతి తెలిసిందే. చిత్రాలహరి అని టైటిల్ ని కూడా సెట్ చేశారు. అయితే ఆ సినిమా కథ ఇప్పుడు మరొక హీరోకి షిఫ్ట్ అయ్యిందని సమాచారం. నాని కథలో కొన్ని మార్పులు చేయమని అడగడంతో దర్శకుడు తన అక్షరాలను చేరిపేయడం ఇష్టం లేక నో అని చెప్పాడట. దీంతో నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ వారు సాయి ధరమ్ తేజ్ ని ఈ కథకు సెట్ చేశారని తెలుస్తోంది. అయితే సాయి ధరమ్ తేజ్ గత సినిమాలను ఒకే చేసినట్టుగానే కిషోర్ తిరుమల చెప్పిన కొన్ని లైన్స్ కే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. ఇక సినిమాను మరికొన్ని రోజుల్లో స్టార్ట్ చేసే విదంగా సాయి డేట్స్ ని సెట్ చేసుకుంటున్నాడట. ప్రస్తుతం ఈ హీరో కరుణాకరన్ దర్శకత్వంలో ఒక సినిమాను చేస్తున్నాడు. అలాగే గోపిచంద్ మలినేని దర్శకత్వంలో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. అయితే కరుణాకరన్ సినిమాతో పాటు చిత్రలహరి కథను కూడా ఒకే సారి ఫినిష్ చేయాలని మెగా అల్లుడు ప్లాన్స్ వేసుకుంటున్నట్లు టాక్.

దర్శకుడు లేకుండా సినిమానా?



ఇప్పుడంటే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారాక అవకాశాలు తగ్గాయి కాని ఒకప్పుడు శ్రీకాంత్ స్టార్ హీరోలతో ధీటుగా తనకంటూ ఒక మార్కెట్ సృష్టించుకున్నవాడే. కెరీర్ మొదట్లో విలన్ గా చిన్నా చితకా వేషాలు వేస్తూ బండి నెట్టుకొచ్చిన శ్రీకాంత్ కు పెళ్లి సందడి ఇచ్చిన బ్రేక్ నిర్విరామంగా ఓ ఇరవై ఏళ్ళ పాటు హీరో కెరీర్ ను ఎంజాయ్ చేసేలా మార్చింది. ఆ తర్వాత వరస పరాజయాలు కుర్ర హీరోల తాకిడి ఎక్కువ కావడం తదితర కారణాల వల్ల స్పీడ్ బాగా తగ్గించేసాడు. మొదటిసారి శ్రీకాంత్ నటిస్తున్న హారర్ సినిమా రా..రా. ఈ సినిమా కోసం విస్తృతంగా ప్రమోషన్ చేస్తున్న శ్రీకాంత్ పోస్టర్లలో దర్శకుడి పేరు లేకపోవడం గురించి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. సదరు దర్శకుడికి నిర్మాతకు ఏవో విభేదాలు వచ్చిన కారణంగా అతను లేకుండానే సినిమా తీసామని యూనిట్ లో ప్రతి ఒక్కరు ఎంతో బాధ్యతగా అందరు డైరెక్టర్ లాగా ఫీల్ అయ్యి పూర్తి చేయడానికి దోహదపడ్డారని చెప్పాడు. కాకపోతే ఒక మంచి వ్యక్తి టీంని మొత్తం నడిపించాడని రారా విడుదల అయ్యాక అతను ఒప్పుకుంటే అప్పుడు పేరు వేస్తామని చెప్పాడు. కేవలం నిర్మాత నష్టపోకూడదు అనే ఒక ఒక్క కారణంతో సహకరించానని చెబుతున్న శ్రీకాంత్ అసలు గొడవ ఎందుకు వచ్చిందో మాత్రం చెప్పలేదు. ఒకవేళ సినిమా ఫలితం తేడా వస్తే ఆ పేరు బయటికి రాకుండా చేస్తారా అనే అనుమానం కూడా వ్యక్తమవుతోంది. నిజానికి ఇలాంటి గొడవలు కొత్త కాకపోయినా అసలు దర్శకుడి పేరే వేయకుండా సినిమాను ప్రమోట్ చేయటం మాత్రం ఈ మధ్య కాలంలో ఎన్నడు చూడలేదు. ఇటీవలే సందీప్ కిషన్ ప్రాజెక్ట్ జెడ్ అనే డబ్బింగ్ సినిమా విషయంలో కూడా నిర్మాత బషీర్ కు హీరో కు ఉన్న గ్యాప్ మీడియా సాక్షిగా బట్టబయలు అయ్యింది. ఎవరి వెర్షన్లో వారు కరెక్ట్ గానే అనిపించినా తెరవెనుక ఏం జరుగుతోంది అనేది మాత్రం ఇలాంటి కేసుల్లో అంతు చిక్కడం లేదు. మొత్తానికి సినిమాలో సస్పెన్స్ లాగే రారా దర్శకుడు ఎవరో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాలన్న మాట.

ఇక స్టార్ హీరోయిన్స్ వాళ్లే



సినీ పరిశ్రమలో హీరోయిన్ల హవా సాగేది కొన్నాళ్లే. హీరోలు మాత్రం ఏళ్లకు ఏళ్లు పాతుకుపోతారు. హీరోయిన్లు రెండు మూడేళ్లు సినీ పరిశ్రమను ఏలేసి... కనుమరుగైపోతుంటారు. కొత్త నీరొచ్చి పాతనీరును తోసేసినట్టు... కొత్త హీరోయిన్లు వచ్చి పాత హీరోయిన్లకు ఎసరు పెడుతుంటారు. ప్రస్తుతం టాలీవుడ్లో స్టార్ హీరోయిన్ల జాబితా కూడా మారిపోతున్నట్టు కనిపిస్తోంది. 2009–2010 కాలంలో కాజల్ అండ్ సమంత ఎంట్రీ ఇచ్చారు. అప్పటికీ టాలీవుడ్ ఏలేస్తున్న శ్రియ – త్రిషలకు టెండర్ పెట్టారు. నెమ్మదిగా వారి అవకాశాల్ని వీరు అందుకున్నారు. దాంతో శ్రియ – త్రిష – ఇలియానాలు బ్యాగులు సర్దేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్య మధ్యలో తమన్న కూడా మెరుపులు మెరిపించింది. గబ్బర్ సింగ్ సినిమాతో శ్రుతి హాసన్ భారీ హిట్ కొట్టి... కొన్నాళ్ల పాటూ అందరు హీరోల సినిమాలలోనూ ఆమెనే కనిపించింది. అందరినీ తొక్కేసింది. కానీ ఎక్కువ కాలం ఆమె హవా కొనసాగలేదు. రకుల్ ప్రీత్ సింగ్ ఎంట్రీ ఇచ్చి... అప్పటికి స్టార్ హీరోయిన్లుగా ఉన్న కాజల్ – తమన్నా – శ్రుతి హాసన్ లకు చుక్కలు చూపించింది. తానే స్టార్ హీరోయిన్ గా మారింది. ఇప్పుడు ఆమె కాలం కూడా ముగిసిపోయింది. ఇప్పుడు టాలీవుడ్లో కాస్త ఊపు మీద ఉన్న హీరోయిన్లు... కీర్తి సురేష్ – అను ఇమ్మాన్యుయేల్ – రాశి ఖన్నా – సాయి పల్లవి – పూజా హెగ్డే... వీరికే ఇప్పుడు అవకాశాలన్నీ తలుపు తడుతున్నాయి. వీరే ఇప్పుడు టాప్ హీరోయిన్లుగా పేరు తెచ్చుకుంటున్నారు. అందులో పూజా హెగ్డే బన్నీతో చేశాక మహేష్ అండ్ ఎన్టీఆర్ తో ఛాన్సులు కొట్టేయడం.. ఆమెను మరో ఇలియానా తరహాలో వర్ణిస్తున్నారు జనాలు. ఇక సమంత – అనుష్క... సీనియర్ హీరోయిన్లు అయిపోయారు. అనుష్క పెద్ద హీరోలతో తప్ప చిన్న హీరోలతో చేసే పరిస్థితి లేదు. ఇక సమంత... తనదైన శైలిలో సినిమాలు ఒప్పుకుంటూ పోతోంది. అక్కినేని వారి ఇంటి కోడలు కనుక... అవకాశాలు వస్తూనే ఉంటాయంటున్నారు సినీ జనాలు.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 98488 49832**

సంచలన వార్తాపత్రిక

లీడర్

విశాఖ రూరల్

6

విశాఖపట్నం

శుక్రవారం 23-2-2018

వైయస్సార్ విగ్రహావిష్కరణ



రోలుగుంట, న్యూస్‌లీడర్: మండలం బల్లిపాలెంలో వైయస్సార్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన మాడుగుల వైఎస్సార్ ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రతీ పేదవాడి గుండెల్లో వైయస్సార్ ఉంటారన్నారు. ఆయన లేని లోటు రాష్ట్రంలో స్పష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాయకులు కల్యాణి, చోడవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణం ధర్మశ్రీ, మండల నాయకులు, మాజీ ఎంపిపి శెట్టి సత్యనారాయణ, పిఏసిఎస్ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షులు మద్దు అప్పలనాయుడు, మద్దు సత్యనారాయణ, మామిడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

గరుడాచల తీర్థానికి సర్వం సిద్ధం



నక్కపల్లి, న్యూస్‌లీడర్: విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి తిరుపతి పుణ్యక్షేత్రమంత విశిష్టత ఉంది. స్వామి గరుడాచలంపై వెలిశారు. ప్రతీ రోజు తిరుపతిలో జరిగే పూజా కార్యక్రమాలు ఇక్కడ కూడా జరగడం విశేషం. మహా మహిమాన్వితుడిగా భక్తుల పూజలందుకుంటున్న ఉపమాక శ్రీవేంకటేశ్వరస్వామివారు సంతాన ప్రదాత. బంధుర సరస్సులో స్నానమాచరించి గరుడాచలంపై స్వయం వ్యక్తమైన స్వామిని దర్శించుకోవడం ద్వారా సకల సౌభాగ్యాలు, సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. గరుడాచలంపై స్వామిని దర్శించుకోవడానికి వెళ్లేటపుడు కొండ దిగువన చిన్నచిన్న రాళ్లతో ఇల్లు నిర్మించి నట్లయితే నూతన గృహ యోగం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

శ్లోకం: ఏకేన శంఖమపరేణ కరేణ చక్రం
అన్యేన ఖడ్గ మితరేణ ధనుస్సు బాణం!
వామేశ్రియం పరిధరం తురగాధి రూఢం
పాయాత్సమాం భగనగ స్థిత వేంకటేశ!!

అర్థం: ఒక చేతిలో శంఖం, దక్షిణ హస్తమున చక్రము, మరొక చేతిలో ఖడ్గం, ఇతర హస్తమున ధనుర్బాణాలు, హృదయస్థానమున లక్ష్మీదేవిని ధరించి అశ్వారూఢుడై గరుడ పర్వతమున నివసించే శ్రీవేంకటేశ్వరా మమ్మల్ని కాపాడుగాక!

స్వామి ఇలా వెలిశారు..


ద్వాపరయుగంలో గరుత్మంతుడు శ్రీకృష్ణ భగవానుడిని ఎల్లవేళలా తన వీపుపై ఉండమని వరంకోరగా, అనుగ్రహించిన స్వామి గరుడాచలం పైనున్న ఏకశిలపై అశ్వారూఢుడిగా స్వయం వ్యక్తమయ్యారని పురాణం ఉంది. ఆలయానికి ఎదురుగా ఉన్న రెండు తటాకాల్లో చిన్న చెరువును బంధుర సరస్సుగా పిలుస్తుంటారు. పూర్వం బ్రహ్మ ఈ సరస్సులో తపస్సు ఆచరించడం వల్లనే మహర్షులు ఇలా నామకరణం చేశారని చెబుతుంటారు. ఈ క్షేత్రంలో వేణుగోపాలస్వామి వారి విగ్రహాన్ని నారదుడు ప్రతిష్ఠించారన్న నానుడి ఉంది. క్రీ.శ. ఆరవ శతాబ్దంలో తూర్పు గోదావరి జిల్లా కాండ్రేగుల సంస్థాన అధిపతులు శ్రీకృష్ణ భూపాలుడు స్వామివారికి ఆలయం నిర్మించారు.

సంతానయోగం.. నూతన గృహ ప్రాప్తి...

గరుడాచలంపై స్వామివారికి పంచామృతాభిషేకం చేయించి దర్శించుకున్న తర్వాత ఆలయ దిగువ భాగాన ఉన్న ధ్వజ స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న మహిళలకు సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అందుచేతనే ప్రతీ ఏటా మార్చి నెలలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో పిల్లలులేని దంపతులు ప్రత్యేకించి ధ్వజ స్తంభం వద్ద పూజలు చేయడం ఆనవాయితీ. ఇకస్వామిని దర్శించే ముందు కొండ దిగువన చిన్నచిన్న రాళ్లతో ఇళ్లను నిర్మిస్తే నూతన గృహయోగం కలుగుతుందని నమ్మకం. ఇక్కడ భక్తులు తలనీలాలు సమర్పించుకొని స్వామివారి కృపకు పాత్రులవుతుంటారు.

టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు...

ఉపమాక క్షేత్రంలో స్వామి కల్యాణంలో సహా వివిధ ఉత్సవాలను కన్నులపండువుగా నిర్వహిస్తుంటారు. దేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఏడాదికోసారి లభించే ఉత్తర ద్వార దర్శనం ఉపమాకలో మాత్రం నిత్యవైకుంఠ ద్వార దర్శనం భక్తులకు లభిస్తోంది. స్వామివారికి శ్రీపంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం వార్షిక కళ్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. ధనుర్మాస అధ్యయనోత్సవాలు, తిరుకల్యాణం, శ్రీరాముని అధ్యయన ఉత్సవాలు, వైశాఖ శుద్ధ ఏకాదశినాడు శ్రీవేణుగోపాలస్వామివారి వార్షిక కల్యాణం, ధనుస్సంక్రమణం తదితర విశేష కార్యక్రమాలు జరిపిస్తున్నారు. ఆ ఉత్సవాలలో పుణ్యకోటి వాహనం, పొన్న వాహనం, ఇత్తడి గరుడ వాహనం, లక్ష్మగరుడ వాహనం, పొన్న వాహనం, ఇత్తడి గరుడ వాహనం, లక్ష్మగరుడ వాహనం, రాజాధిరాజ వాహనం, హంస వాహనం, అశ్వ వాహనం, గజవాహనం, పెద్దపల్లకి, చిన్నపల్లకి వాహనాలపై శ్రీవేంకటేశ్వరస్వామివారిని ఉభయ నాంచారులతో గ్రామ తీరువీధి సేవలు వైభవంగా నిర్వహిస్తారు. కొండ దిగువున పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరుడు భక్తులకు నిత్యదర్శనమిస్తుంటారు. ఈ ఏడాది స్వామివారి కల్యాణోత్సవాల్లో కొత్త అందాలు అలరించనున్నాయి. ఉత్సవాలను 20రోజులపాటు నిర్వహిస్తారు. ఉపమాక పుణ్యక్షేత్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఇటీవల స్వాధీనం చేసుకుంది. ఆలయంలో సమూల మార్పులు తీసుకువస్తున్నారు. దీంతో సాధారణ రోజుల్లో కూడా భక్తుల రద్దీ పెరిగింది. ఈ నెల 19న స్వామివారి కళ్యాణ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రతీ ఏటా స్వామివారి కళ్యాణోత్సవాలను తిలకించడానికి రెండు లక్షల వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుంటుండగా ఈ ఏడాది రెట్టింపు భక్తులు ఉత్సవాలకు హాజరుకావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం రూ.45కోట్లతో ఉపమాక క్షేత్ర అభివృద్ధికి ఆమోదముద్ర వేయడంతో మరో తిరుపతి క్షేత్రంగా ఉపమాక వెంకన్న కీర్తి ప్రతిష్ఠలు నలుదిశలా వ్యాపించనున్నాయి. రమణీయ దృశ్యమాలిక...



గరుడ పక్షిని పోలిన ఎతైన పర్వతం... కొండపై స్వయం వ్యక్తమైన కలియుగ శ్రీవేంకటేశ్వరుడు... కొండల దిగువన ముచ్చటగొలిపే రాతి స్తంభాలు, బేడా మండపం, రెండు సుందర తటకాలు, పచ్చని చెట్లు పర్యాటకులు ఇట్టే కట్టిపడేస్తాయి. ఉపమాకలో రెండు తటాకాల నుంచి వీచే చల్లని గాలులు పర్యాటకుల మనస్సులను రంజింపజేస్తాయి. ఉపమాక విశాఖపట్నానికి 90కిలోమీటర్లు, తూర్పుగోదావరి జిల్లా తుని రైల్వేస్టేషన్ నుంచి 20 కిలోమీటర్లు, నర్సీపట్నం రైల్వేస్టేషన్ నుంచి 10కిలోమీటర్ల దూరంలో ఉంది. దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రిగా పనిచేసిన విశాఖజిల్లాలోనే తందేడు వాస్తవ్యుడు రాజాసాగి సూర్యనారాయణరాజు 1970, 75 కాలంలో క్షేత్రం అభివృద్ధికి విశేష కృషి చేశారు. సూర్యనారాయణరాజు హయాంలో ఆలయ పునర్నిర్మాణం, బేడా మండపం, కొండపై మండప నిర్మాణం, రాజగోపురం, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా స్వామివారి విశిష్టతలను తెలియజేయడనికి డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.ఉపమాకబాలాజీ అనే వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. ఉపమాక పుణ్యక్షేత్రం మహాత్యంపై పేరిట వేంకట దీక్షిత కవులు పలు గ్రంథాలు రచించారు. అయిదేళ్ల క్రితం తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి శ్రీఉపమాక క్షేత్ర మహాత్యం అనే పుస్తకాన్ని రచించారు.

20రోజుల తీర్థం...

కళ్యాణోత్సవాల ప్రారంభం నుంచి ఉపమాకలో 20రోజులపాటు తీర్థం జరుగుతుంది. ఈ తీర్థంలో మసాలా సామాన్లు కొనుగోలు చేయడానికి మహిళలు ఆసక్తి కనబరుస్తారు. జిల్లాలోను పలు మండలాల నుంచే కాకుండా తూర్పు, పశ్చిమ గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి మహిళలు ఇక్కడ మసాల సామాన్లు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఇక్కడ మసాలా సామాన్లు ద్వారా వంటకాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయన్నది భక్తుల నమ్మకం. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. స్వామి అమ్మవార్ల కల్యాణం సందర్భంగా ట్రెజరీలో భద్రపరిచిన నగలతో అలంకరిస్తారు. నగల అలంకరణలో కేవలం కేవలం రెండు మూడు రోజులు మాత్రమే స్వామి దర్శనం లభిస్తుండడంతో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి భారీగా తరలివస్తారు. పౌర్ణమి రోజున స్వామివారిని రాజయ్యపేట సముద్రతీరంలో చక్రస్నానం చేయిస్తారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి వెంట వెళ్లడానికి పోటీ పడతారు. స్వామివారితో పాటు భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కళ్యాణోత్సవం రోజు నుంచి ఉగాది వరకు ఇక్కడ వెంకన్న సంబరాలు అందరిని భక్తి పారవశ్యంలో మునిగేలా చేస్తాయి.

పొంచి ఉన్న ప్రమాదం

శిథిలావస్థలో గొల్లలపాలెం పాఠశాల భవనం



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

రావికమతం, న్యూస్‌లీడర్: మండలంలో మరుపాక శివారు గొల్లలపాలెంలోని ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. భవనం పూర్తిగా దెబ్బతిని ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఉంది. ఇక్కడి పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం శిథిలమై శ్లాబ్ పెచ్చులూడి పడిపోతున్నాయి. దాదాపుగా అన్ని గోడలు బీటలు వారాయి. కాంక్రీట్ స్తంభాలు కూడా దెబ్బతిని ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ భవనం వినియోగానికి ఏ మాత్రం అనువుగా లేదు. రెండేళ్ల క్రితం మండల ఇంజనీరింగ్ అధికారులు మండల వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చేయడానికి గుర్తించిన 22 పాఠశాల భవనాల జాబితాలో ఈ పాఠశాల భవనం ఉంది. అయితే ఇప్పటికి కూల్చకుండా వదిలేశారు. పాత భవనం, అందునా శిథిలావస్థలో ఉండటంతో ఇది ఎప్పుడు కూలిపోతాదోనని, ప్రమాదకరంగా తయారైన ఆ భవనం కారణంగా విద్యార్థులకు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

విధి నిర్వహణలో బీఎల్ఓలు నిర్లక్ష్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీవో కె.సూర్యారావు

నర్సీపట్నం, న్యూస్‌లీడర్: విధి నిర్వహణలో బిఎల్ఒలు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆర్డీవో కె.సూర్యారావు అన్నారు. ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన బిఎల్ఒల సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు చేపట్టిన సర్వే ఈ నెల 14తో పూర్తయిందన్నారు. అయినప్పటికీ బిఎల్ఒలు సక్రమంగా ఓటు నమోదు చేయడంలో వైఫల్యం చెందారన్నారు. ఎక్కువ శాతం మంది ఓట్ల నమోదులో సక్రమంగా పని చేయలేదన్నారు. ఈ నెల 20లోగా ఓటర్ల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటు హక్కు ఉన్న ప్రతీ ఓటరును నమోదు చేయాల్సిన బాధ్యత బిఎల్ఒలపై ఉందన్నారు. ఓట్ల నమోదుకు సంబంధించి సేకరించిన వివరాలను ఓటర్ల వివరాలను జాబితా తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో నర్సీపట్నం, గొలుగొండ తహసీల్దార్లు వివి.రమణ, అంబేద్కర్, నియోజకవర్గ స్థాయి బిఎల్ఒలు పాల్గొన్నారు.

రాజవీధిలో సీసీరోడ్డు నిర్మాణం



రాజవీధి వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు

మాడుగుల, న్యూస్ లీడర్: ఎన్నో సంవత్సరాలుగా కేజేపురం మెయిన్‌రోడ్డులో రాజవీధి చేనీ దగ్గర రహదారిలో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి ఆ వీధి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమస్యను గుర్తించి సర్పంచ్ పెంటకోట అప్పారావు ఆధ్వర్యంలో సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ వీధికి చెందిన కొంత మంది మాట్లాడుతూ ఈ రోడ్డు వేయడం ద్వారా మురికినీటి సమస్య పోతుందని వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మిస్తున్న పంచాయతీ సర్పంచ్‌కు, వార్డు సభ్యులకు వారు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

సీసీరోడ్లకు మార్జిన్ల ఏర్పాటు



బుచ్చెయ్యపేట, న్యూస్‌లీడర్: మండలంలోని వడ్డాది వెంకన్న కొండపైకి నిర్మించిన సీసీరోడ్లకు మార్జిన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్లకిరువైపులా అంచులు శిథిలమవకుండా, ఫోర్ వీలర్ వాహనాల రాకపోకలకు వీలుగా ఉండేలా రోడ్డు అంచులను మట్టితో కప్పుతున్నారు. కొండపైకి వేళ్లేందుకు ఇప్పటి వరకు సరైన రహదారి సౌకర్యంలేదు. భక్తులు ఇబ్బంది పడేవారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు కొండపైకి మూడు సీసీ రోడ్లను నిర్మించేందుకు రూ.80 లక్షల నిధులు ఎమ్మెల్యే రాజు మంజూరు చేయించారు.వీటిలో రెండు రోడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తి చేశారు. మరో రోడ్డు నిర్మించాల్సి ఉంది. వచ్చే నెలలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం నిర్మించిన రోడ్ల అంచుల వద్ద మట్టితో కప్పుతున్నారు. కొండపైన ఐరన్‌తో రెయిలింగ్స్ కూడా నిర్మించనున్నారు. ఈ పనులను స్థానిక మాజీ ఎంపీపీ బత్తుల తాతయ్యబాబు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 26 నుండి జరిగే స్వామి వారి వార్షిక కళ్యాణోత్సవాల నాటికి ఈ పనులన్నీ పూర్తి చేస్తామని తాతయ్యబాబు చెప్పారు.

24న నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నర్సీపట్నం, న్యూస్‌లీడర్: మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. గతంలో చేసిన అభివృద్ధి పనులతో పాటు భవిష్యత్‌లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ఈ సమావేశం చర్చించనున్నట్టు చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

మైన్స్ లీజుదార్లు, వాహన యాజమానులపై చర్యలు తీసుకోవాలి

నాతవరం, న్యూస్‌లీడర్: సరుగుడు పంచాయతీకు రావలసిన డిఎంఎఫ్ నిధులు చెల్లించిన తర్వాత మైన్స్ తవ్వకాలు జరపాలని, ఆర్అండ్‌బి రోడ్డులో సుమారుగా 20 టన్నుల పైగా బరువుతో వాహనాలను అడ్డుకట్టవేయాలని డిమాండ్ చేస్తూ నాతవరం పోలీస్‌స్టేషన్‌లో వైసిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పెట్ల ఉమాశంకరగణేష్ మాట్లాడుతూ నాతవరం మండలం సరుగుడు పంచాయతీలో గత కొంత కాలంగా మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. మైనింగ్ తవ్వకాలు జరిపే ముందు ఒక టన్నుకు రూ.43 చొప్పున డిఎంఎఫ్‌ను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటికి సుమారుగా 5లక్షల మైన్స్ తరలించుకు పోయారన్నారు. అంటే సుమారు 2కోట్ల 15లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించి ఉన్నట్లయితే అందులో సరుగుడు గ్రామ పంచాయతీకు 50 శాతం అనగా సుమారు రూ.కోటికి పైగా ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ ఒక్క రూపాయి కూడా సరుగుడు పంచాయతీకి రాలేదన్నారు. ఈ విషయమై జనవరి 18వ తేదీన నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వెంటనే సరుగుడు పంచాయతీకు రావలసిన డిఎంఎఫ్ నిదులను విడుదల చేయాలని,లేనిపక్షంలో సరుగుడు ప్రాంత ప్రజలతో మైన్‌డు అడ్డుకోవడం జరుగుతుందని తెలియజేశామన్నారు. జనవరి 29న సరుగుడు పంచాయతీలో మైన్స్ రవాణా చేయడంతో మించిన బరువుతో వాహనంలు వెళ్లడం వలన ఆ ప్రాంతంలో ఉన్న రోడ్లన్నీ పాడైపోతున్నాయని వెంటనే మైన్స్ యాజమానులు, రవాణా వాహనాలపై చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవోకు మరలా ఫిర్యాదు చేశామన్నారు. అయితే వారు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. కావున మైన్స్ లీజుదార్లను, వాహన యాజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం నాతవరం హెచ్‌సి గోవిందరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అంకంరెడ్డి జమీలు, వైసిపి మండల అధ్యక్షులు శెట్టి సూకరాజు, మండల వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



హెచ్‌సికి ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

23న ఛలో గుంటూరు

రావికమతం, న్యూస్‌లీడర్: దళితుల సమస్యలపై ఈ నెల 23న తలపెట్టిన ఛలో గుంటూరు కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కెవిపిఎస్ నాయకులు అర్జునరావు పిలుపునిచ్చారు. ఆయన కొత్తకోటలో విలేకరులతో మాట్లాడారు. దళితులపై అగ్రవర్ణాల నుంచి దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ మేరకు ఛలో గుంటూరు కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. శాంతికుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

వెంకన్న ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



వెంకన్న ఆలయం

బుచ్చెయ్యపేట, న్యూస్‌లీడర్: వడ్డాది వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. ఈనెల 26 నుండి మార్చి 3 వరకు శ్రీవారి 145వ వార్షిక కళ్యాణోత్సవాలు జరగనున్నాయి. భక్తుల దర్శనానికి క్యూలైన్లు, విద్యుత్ అలంకరణకు, సెట్టింగ్‌లకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధర్మకర్త దొండా కన్నబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు సాగుతున్నాయి.

సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన పైలా ప్రసాదరావు



కలెక్టర్‌కు సమస్యలను తెలుపుతున్న ప్రసాదరావు

మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగుల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ జన్మభూమి సమన్వయకర్త పైలా ఫౌండేషన్ అధినేత పైలా ప్రసాదరావు గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రావీణ్‌కుమార్‌ను కోరారు. కె.కోటపాడు మండలం ఆలమండ భీమవరంలో పంచాయతీ కేంద్రం రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, మాడుగుల మం దలం అవురువాడ పంచాయతీ పరిధి లో హుద్‌హుద్ తుఫాన్‌లో దెబ్బతిన్న కమ్యూనిటీ భవనాలను పునరుద్ధరణ చేయాలని, మాడుగుల, చీడికాడ, దేవరా పల్లి మండలాల్లో గిరిజన ప్రాంతాలకు ఐటీడీఏ ద్వారా పథకాలను వర్తింప చేయాలని కోరారు. ఇప్పటి వరకు మాడుగుల నియోజకవర్గంలో 50 పాఠశాలలకు డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్‌కు తెలిపారు. పాతవలస గ్రామంలో కమ్యూనిటీ భవనం, జిల్లా పరిషత్ పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, పశువుల ఆసుపత్రికి పక్కా భవనాలు నిర్మించడానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ సమస్యలను జిల్లా అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జామి బుచ్చిరాజు, పాలకుర్తి నాగేశ్వరరావు, మామిడిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

స్కౌట్‌తో శరీర, మానసిక ఆరోగ్యం



మాట్లాడుతున్న ఛైర్మన్ మలసాల

కశింకోట, న్యూస్‌లీడర్: కశింకోట ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం భారత స్కౌట్ అండ్ గైడ్స్ థింకింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఈసీఎస్ ఛైర్మన్ మలసాల రమణారావు పాల్గొని స్కౌట్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వృత్తివిద్య కోర్సులలో బాగా నైపుణ్యం కలిగి ఉండాలని, ఆర్ఈసీఎస్ వినియోగదారుల పిల్లల కు 50శాతం సీట్లు కల్పిస్తున్నామన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో పాలిటెక్నిక్ కళాశాల పెట్టడం వినియోగదారుల పిల్లల అదృష్టమన్నారు. ఈ స్కౌట్ ద్వారా శరీరంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. జనవరి 26 రిపబ్లిక్‌డే రోజున విజయవాడలో జరిగిన పెరేడ్‌లో పాల్గొన్న విద్యార్థులు సుమారు పది మందికి ప్రశంసాపత్రాలు అందించారు. స్కౌట్ వ్యవస్థాపకులు బేడిల్ పవల్ భార్య లేడీ బేడిల్ పవల్ ఇద్దరూ ఫిబ్రవరి 22న పుట్టిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాశంకర్, కొణతాల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులులేక వలసపోతున్న గిరిజనులు



వలసవెళ్తున్న గిరిజనులు

మాడుగుల, న్యూస్‌లీడర్: ఉపాధి పనులు లేకపోవడంతో వందలాది మంది గిరిజనులు దేవపురం, కాముగెడ్డ, పులుసు మామిడి, బిల్లలపాలెం, అర్జాపురం గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు ఉపాధి పనులు లేకపోవడంతో తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు కూలిపనులు చేయడానికి వలస వెళ్లిపోతున్నారు. గురువారం ఉదయం కొంత మంది గిరిజనులు మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ఉపాధి పనులు లేవని, కొన్ని దినాలు పనిచేసినా డబ్బులు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బయట ప్రాంతాలలో వ్యవసాయ కూలీగా పనిచేస్తే రోజుకు మూడు వందల రూపాయల వరకు వస్తుందన్నారు. గిరిజన ప్రాంతాలలో వ్యవసాయం చేయడానికి నీటి సదుపాయంలేదని, దాని కారణంగా పొలాలు ఎండిపోతున్నాయని చెప్పారు. ప్రస్తుతం కుటుంబాలతో కలిసి బయట ప్రాంతాలకు వెళ్లి పోతున్నామని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజనులకు పూర్తి స్థాయిలో ఉపాధి పనులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

గృహ నిర్మాణాలకు శ్రీకారం



జిప్లస్3 గృహాల నమూనా

నర్సీపట్నం, న్యూస్‌లీడర్: మున్సిపాలిటీలో ప్రతిపాదించిన జిప్లస్3 గృహ నిర్మాణాలకు శ్రీకారం చుదుతున్నారు. ప్రతిపాదించిన స్థలాన్ని చదును చేసే పనులు చేపడుతున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కూడా వీటి నిమిత్తం ప్రత్యేక సమాచార కేంద్రాన్ని ప్రారంభించారు. లబ్ధిదారుల నుండి డిపాజిట్లుగా వాటా ధనాన్ని సేకరించేందుకు సిద్ధమవుతున్నారు. మున్సిపాలిటీలోని మొత్తం 2592 మంది లబ్ధిదారులకు జిప్లస్3 గృహాల కోసం మొత్తం 24 ఎకరాల స్థలాన్ని మున్సిపల్ అధికారులు గతంలోనే సిద్ధం చేసి ఉంచారు. ఇక్కడికి సమీపంలోని కసిమి వద్ద 12 ఎకరాలు, బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలో 12 ఎకరాల స్థలాన్ని సేకరించారు. వీటిని జేసిబిలతో చదువు చేసి పనులను ప్రారంభించారు. మరో వైపు వీరు స్థలాన్ని ఇళ్ల నిర్మాణాలకు అనువుగా విభజించేందుకు ప్రత్యేక సర్వే కూడా నిర్వహిస్తున్నారు.

లబ్ధిదారులకు ప్రత్యేక కౌంటర్:

లబ్ధిదారులకు అవసరమైన సమాచారం తెలియజేయడానికి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఇద్దరు సిబ్బందిని నియమించి వారికి ల్యాప్‌టాప్‌లు సమకూర్చారు. లబ్ధిదారులు చెల్లించాల్సిన వాటాధనాలు తదితర విషయాలను తెలియజేస్తున్నారు. లబ్ధిదారులు కొందరు తమ వాటాధనానికి సబంధించిన డిడిలను ఇప్పటికే మున్సిపల్ అధికారులకు అందజేస్తున్నారు. ఈ నెలాఖర నాటికి చెల్లించాలని మున్సిపల్ కమిషన్ జంపా సురేంద్ర తెలిపారు.